www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609

బుధవారం

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 31, జనవరి 2024

సంపుటి: 5 సంచిక: 252, పేజీలు: 12, వెల: రూ.5/-

## జాతిపితకు సిఎం ఘన నివాళి

- ప్రభుత్వ క్యాలెండర్ ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి



హైదరాబాద్,జనవరి30(వెలుతురు): మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతి ఆయనకు గననివాళి అర్పించింది. మంగళవారం లంగర్‌హౌజ్ బాపూఘాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి తదితరులు గాంధీఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించారు. మహాత్ముడి సేవలను స్మరించుకున్నారు. పలువురు ప్రముఖులు జాతిపితకు నివాళి అర్పించారు.ఇదిలావుంటే సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సిఎస్ శాంతికుమారి, హోం సెక్రటరీ జితేందర్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్ అంజన్ కుమార్‌లు ఉన్నారు.




# ఇక నేరుగా ప్రజల్లోకి వెళతా...

- 2న ఇంద్రవెల్లి సభతో ప్రారంభిస్తా
- పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలు సాధించడమే లక్ష్యం
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,జనవరి30(వెలుతురు): ప్రజల్లోకి వెళ్లేందుకు 2వ తేదీ నుంచి సభలు నిర్వహిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 2వ తేదీన ఇంద్రవెల్లిలో సభ ఉందని... నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పార్లమెంట్ ఎన్నికలు ఇంకా 60 రోజులలో జరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు గాంధీభవన్‌లో సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ... ఇప్పటికే రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ వచ్చిందని.. తెలంగాణలో కూడా రాజ్యసభ ఎన్నికల జరుగుతున్నాయని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా ఇన్‌చార్జీలను నియమించినట్లు తెలిపారు. పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా సభలు నిర్వహించి ముందుకు పోవాలని కోరారు. అభ్యర్థుల ఎంపిక పూర్తిగా అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. హైకమాండ్ తెలంగాణకు పరిశీలకులను నియమించిందని వివరించారు.

హరీష్ చౌదరీ చైర్మన్‌గా కమిటీ పనులు చేస్తుందని స్పష్టం చేశారు. ఆ కమిటీ అభ్యర్థుల ఎంపిక చూసుకుంటుందని చెప్పారు. మనం కష్టపడి కాంగ్రెస్ విజయం సాధించే విధంగా కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## కొత్త జిల్లాల ఏర్పాటుపై కమిషన్

- సిఎం హామీ మేరకు అసెంబ్లీలో చర్చ
- కొత్తగా పివి పేరుతో జిల్లా ఏర్పాటు డిమాండ్

హైదరాబాద్,జనవరి30(వెలుతురు): కొత్త జిల్లాల ఏర్పాటు అసంబద్ధంగా జరిగిందని సిఎం రేవంత్ రెడ్డి అంగీకరించాక..దీనిపై కమిషన్ వేసి అధ్యయనం చేస్తామని ప్రకటించారు. జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటులో ఉన్న లోటుపాట్లను తొలగిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో జిల్లాల కుదింపు జరగవచ్చన్న సంకేతాలు వచ్చాయి. పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాలు చేశారు. ఇందులో అధ్యయనం తరవాత శాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటుకు మార్గం సుగమం కావచ్చు. గత బిఆర్ఎస్ హయాంలో కొత్త జిల్లాలను ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేశారు. కొత్తగా కమిషన్ ఏర్పాటు చేసి, అసెంబ్లీలో చర్చించాక కొత్త జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేస్తామని సిఎం రేవంత్

మిగతా.. 2లో

## వేసవి నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

- ప్రతి గ్రామానికి మంచినీరు అందించేలా ప్రతిపాదనలు
- తాగునీటికి కొత్తగా ఏర్పాటుచేసిన రిజర్వాయర్ల వినియోగం
- తాగునీటి నిర్వహణా బాధ్యతలు సర్పంచ్‌లకు అప్పగింత
- జల్‌జీవన్ మిషన్ నిధులు వచ్చేలా చర్యలు
- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన సిఎం రేవంత్



హైదరాబాద్,జనవరి30(వెలుతురు): రాష్ట్రంలో వచ్చే వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. కేవలం గోదావరి, కృష్ణా నదుల నుంచే రాష్ట్రమంతటికీ నీళ్లు ఇవ్వటం కాకుండా, కొత్తగా ఏర్పడ్డ

మిగతా.. 2లో



## ప్రజాస్వామ్యాన్ని బ్రతికించుకుందాం..

- భువనేశ్వర్ ర్యాలీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే
- మోడీ మళ్లీ గెలిస్తే నియంతృత్వ పాలనేనని ధ్వజం
- ప్రజలు మేల్కొనకపోతే మరో రష్యా లాగా మారుతుందని ఆవేదన

భువనేశ్వర్, (వెలుతురు): నరేంద్రమోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో నియంతృత్వాన్ని తీసుకొస్తారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. సోమవారం భువనేశ్వర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన ఖర్గే.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మోదీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే దేశానికి ఇవే చివరి ఎన్నికలవుతాయని హెచ్చరించారు. ఇకపై ఎన్నికలనేవే ఉండవని అన్నారు. 'రష్యాలో వ్లదిమిర్ పుతిన్ అధ్యక్ష ఎన్నిక మాదిరిగానే భారతదేశంలోనూ ఉంటుంది.

రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే.. వారు వారి బలాన్ని ఉపయోగించి దేశాన్ని పాలిస్తారు. ఎన్నికవుతారు.. 200, 300, 400, 500 సీట్లు గెలుచుకుంటారు. ఆఖరుకు 600 సీట్లు కూడా గెలుచుకుంటారు' అని ఖర్గే చెప్పారు. లోక్‌సభ ఎన్నికలతోపాటు రాష్ట్ర అసెంబ్లీకీ ఒడిశాలో ఎన్నికలు జరుగనున్న సంగతి తెలిసిందే. ఏఐసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన ఒడిశాకు రావడం ఇదే మొదటిసారి. 'మీరు కోరుకుంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడవచ్చు. కానీ.. బ్రిటిష్ పరిపాలనలో బానిసల్లా

మిగతా.. 2లో




## బిజెపి గుప్పిట్లోనే ఈవీఎంల తయారీ..

- భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌లో బీజేపీ నేతలు
- ఇండిపెండెంట్ డైరెక్టర్లుగా బాధ్యతలు
- తొలగించాలంటూ ఈసీకి కేంద్ర మాజీ కార్యదర్శి శర్మ లేఖ

న్యూఢిల్లీ, (వెలుతురు): భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్! దేశంలో జరిగే ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తయారు చేసి అందించే సంస్థ! ఇది బీజేపీ గుప్పిట్లో ఉందా? ఈవీఎంలలో లోపాలు సవరించకపోతే బీజేపీ ఈసారి 400 సీట్లు కూడా సాధించే అవకాశం ఉన్నదని ఇటీవల కాంగ్రెస్ సీనియర్ నేత శ్యాం పిట్రోడా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. బీజేపీ గెలుపులో ఈవీఎంలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటిని మేనేజ్ చేస్తున్నారని ఆరోపణలు

మిగతా.. 2లో



## నేటినుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం
- ఫిబ్రవరి1న ఆర్థికమంత్రి ఓటాన్ అకౌంట్ బడ్జెట్

న్యూఢిల్లీ,జనవరి30 (వెలుతురు): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొత్త భవనంలో నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో చివరి బడ్జెట్ సమావేశం మొదలవుతుంది. ఉభయ సభలను ఉద్దేశించి ముర్ము ప్రసంగిస్తారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం నాడు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను లోక్ సభలో

మిగతా.. 2లో

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణానికి బ్రేక్

తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నిలుపు చేసిన హైకోర్టు

హైదరాబాద్,జనవరి30(వెలుతురు): గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారానికి హైకోర్టులో బ్రేక్ పడింది. యథాతథ స్థితిని కొనసాగించాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీరుల్లా ఖాన్‌లు ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే ఎమ్మెల్సీల నియామకంపై బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో సవాల్ చేశారు. గతంలో తాము వేసిన పిటిషన్‌పై విచారణ తేలే వరకు ఎమ్మెల్సీల నియామకాలు ఆపాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణకు రాగా.. యథాతథంగా కొనసాగించాలంటూ న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి హైకోర్టు వాయిదా వేసింది. ఈ మేరకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, అమిర్ అలీఖాన్‌లను నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన

మిగతా.. 2లో





## నితీశ్ అవసరం మాకు లేదు

- భాజాపాకు భయపడి పోయిన వ్యక్తి
- మండిపడ్డ కాంగ్రెస్ నేత రాహుల్

న్యూఢిల్లీ,జనవరి30(వెలుతురు): విపక్ష 'ఇండియా' కూటమిని వీడి, భాజపాతో చేతులు కలిపిన జేడీయూ అధినేత, బిహార్ సీఎం నీతీశ్ కుమార్ అవసరం మాకు లేదంటూ..కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. 'మాకు నీతీశ్ కుమార్ అవసరం లేదు. ఆయనపై ఒత్తిడి రావడంతో యూటర్న్ తీసుకున్నారు' అని భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా మొదటిసారి స్పందించారు. 'నీతీశ్ ఎందుకు విపక్ష కూటమిని వీడారో తెలుసు. బిహార్‌లో కులగణన చేపట్టాలని మేం ఆయనకు స్పష్టంగా చెప్పాం. దీనిపై కాంగ్రెస్, ఆర్జేడీ ఒత్తిడి తీసుకు వచ్చింది. అందుకు భాజపా భయపడింది. ఆ పార్టీ దీనికి వ్యతిరేకం. నీతీశ్ ఇరుక్కుపోయారు. పారిపోవడానికి భాజపా ఆయనకు దారి చూపించింది. సామాజిక బాధ్యత

మిగతా.. 2లో

## ఎసిబి కస్టడీకి శివబాలకృష్ణ

- 8 రోజులు అనుమతిస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలు
- అనుమతులు, ఆస్తులపై లోతైన విచారణ

హైదరాబాద్,జనవరి30(వెలుతురు): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండిఏ మాజీ డైరెక్టర్ శివ బాల కృష్ణను 8 రోజుల కస్టడీకి ఏసీబీకి అనుమతి ఇస్తూ మంగళవారం నాంపల్లి ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎనిమిది రోజుల పాటు



బాలకృష్ణను ఏసీబీ అధికారులు విచారించ నున్నారు. విచారణ సందర్భంగా బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయనున్నారు. శివ బాలక్రిష్ణ మోసాలపై ఏసీబీ అధికారులు విచారణ చేయనున్నారు. శివ బాలకృష్ణ పని చేసిన సమయంలో ప్రాజెక్ట్ ఫైల్స్ అన్ని

మిగతా.. 2లో



## హెటిరో పార్థసారథికి విలువైన భూములు

- గతప్రభుత్వ కేటాయింపులను రద్దు చేసిన ప్రభుత్వం
- జీవో 140ని రద్దు చేస్తూ ఆదేశాలు
- గత హైకోర్టు సూచనల మేరకు నిర్ణయం

హైదరాబాద్,జనవరి30(వెలుతురు): హెటిరో అధినేత,బిఆర్ఎస్ ఎంపి పార్థసారథిరెడ్డికి సంబంధించిన సంస్థలకు కేటాయించిన భూములపై తెలంగాణ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ ఎంపీ పార్థసారథి రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. హెటెరో సంస్థల అధిపతిగా ఉన్న ఆయనకు ఆస్పత్రి నిర్మాణానికి అంటూ పదిహేను ఎకరాల అత్యంత ఖరీదైన

మిగతా.. 2లో

## రాజ్యసభకు సత్నామ్ సింగ్ నామినేట్

హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ,జనవరి30 (వెలుతురు): చండీఘఢ్ యూనివర్శిటీ ఛాన్సలర్ సత్నామ్ సింగ్ సంధును రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రపతి నామినేట్ చేశారు. సత్నామ్ సింగ్‌ను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేయడాన్ని స్వాగతిస్తున్నట్టుగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. సంధును రాజ్యసభకు నామినేట్ చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. సత్నామ్ సింగ్ ప్రఖ్యాత విద్యావేత్త, సామాజిక సేవకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అతను అట్టడుగు స్థాయి ప్రజలకు వివిధ మార్గాల్లో సేవ మార్గంలో ఉన్నారు.సత్నామ్ సింగ్ ఎప్పుడూ జాతీయ ఐక్యతను పెంపొందించారని, ఎన్నారైలతో కలిసి పని చేశారని ప్రధాని మోదీ అన్నారు. ఆయన రాజ్యసభకు నామినేట్ కావడం తాను శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. అలాగే రాజ్యసభ కార్యకలాపాలు ఆయన అభిప్రాయాలతో సుసంపన్నం అవుతాయని విశ్వసిస్తున్నానని మోదీ అన్నారు.

# కొత్త జిల్లాల ఏర్పాటుపై కమిషన్

మొదటిపేజీ తరువాయి..

ప్రకటించారు. దీంతో శాస్త్రీయంగా ఏర్పాటుకు అవకాశం రానుంది. ఈ క్రమంలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు పేరుతో జిల్లాని ఏర్పాటు చేయాలని డిమాండ్ రోజురోజుకి పెరుగుతుంది. అప్పటి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సమయంలో హుజురాబాద్ కేంద్రం గా పీవీ నరసింహారావు జిల్లాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా అందోళన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అయినా ఫలించలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మరోసారి పీవీ జిల్లా తెరపైకి వచ్చింది.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ కేంద్రంగా పీవీ నరసింహారావు జిల్లాని ఏర్పాటు చేయాలని మేధావులతో పాటు ప్రజాసంఘాలు డిమాండ్ చెస్తున్నాయి. మాజీ ప్రధాని పీవీ భీమదేవరపల్లి మండలం వంగరలో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం ఇక్కడి నుండే మొదలు అయ్యింది. అయన జ్ఞాపకాల గుర్తుగా హుజురాబాద్ కేంద్రంగా పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలారోజుల నుండి ఉంది. గత బీఅర్ఎస్ ప్రభుత్వం పది జిల్లాల నుండి ముప్పై మూడు జిల్లాలకి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అ సమయంలోనే పీవీ జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ పెరిగింది. ఈక్రమంలోనే పీవీ జిల్లా సాధన సమితిని కూడా జేఏసి నేతలు ఏర్పాటు చేశారు. అప్పట్లో హుజురాబాద్ కేంద్రంగా నెల రోజులపాటు అందోళన కార్యక్రమాలు జరిగాయి. అప్పటి రాష్ట్ర మంత్రి ఈటెల రాజేందర్ జోక్యం చేసుకుని అందోళన విరమింపజేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. అయితే హుజురాబాద్ జిల్లా కేంద్రం కాకుండా డివిజన్ కేంద్రంగా మారింది. మళ్ళీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో జిల్లాల పునర్విభజనపై చర్చ జరుగుతోంది ఈ క్రమంలో మరోసారి పీవీ జిల్లా తెరపైకి వచ్చింది. నిజానికి ప్రొఫెసర్ జయశంకర్, కుమ్రం భీమ్, యాదాద్రి, వేములవాడ రాజన్న, జోగులాంబల పేరు మీద జిల్లాలు ఏర్పాడ్డాయి. పివి పేరు మా÷-తరం విస్మరించారు. దీంతో హుజురాబాద్ కేంద్రంగా పదిహేను మండలాలని కలుపుతూ పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలని మేధావులతో పాటుగా ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్పడిన తరువాత మొదటిసారిగా హుజురాబాద్‌లో పీవీ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండరాం హాజరు అయ్యారు. అయన సైతం పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలని సూచించారు. పీవీ జిల్లాపై ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీవీ చేపట్టిన అర్థిక సంస్కరణలు భూ సంస్కరణలు చేపట్టారని ప్రస్తావించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని జిల్లాలని మార్చడం, లేదంటే కుదించడంపై చర్చ సాగుతుంది. పరిపాలన సౌలభ్యంగా ఉండే జిల్లాలని ఏర్పాటు చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు ఇప్పటికే ప్రభుత్వం తెలిపింది. పీవీ జిల్లా ఏర్పాటుకు ప్రతిపక్షాలు కూడా మద్దతు ఇవ్వడంతో ఏదైనా ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. పీవీ సేవలు గుర్తుండే విధంగా అయన పేరుతో జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జేఏసి నేతలు డిమాండ్ చేస్తున్నారు. అరేళ్ళుగా ఉద్యమాలు చేస్తున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పీవీ జిల్లాని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పీవీ జిల్లా కోసం ఎనిమిది ఏళ్ళుగా పోరాటం సాగుతుందని ఎమ్మెల్సీ కోదండరాం అంటున్నారు. అయన పేరు పైనా జిల్లా ఏర్పటుపై సర్వరమే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాల పరిశీలనపై కమిటీ వేసి చర్చించే అవకాశం ఉంది. విధివిధానాలు ఖరారు చేస్తారు. ఆ మేరకు జిల్లాల ఏర్పాటుతో పాటు, రూపురేఖలు మారనున్నాయి. అప్పుడు పివి జిల్లా ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల
# ప్రమాణానికి బ్రేక్

మొదటిపేజీ తరువాయి..

పిటిషన్లపై రాష్ట్ర హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం యథాతథ స్థితినే కొనసాగిం చాలని, తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కొత్త సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించవద్దని తన ఆదేశాల్లో పేర్కొన్నది. దాంతో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా ప్రొఫెసర్ కోదండరామ్, అమిర్ అలీఖాన్‌లు ప్రమాణం చేయడానికి వీల్లేకుండా పోయింది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమిర్‌ఖాన్‌లను నియమించడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. దాంతో కోర్టు తాజా ఉత్తర్వులు ఇచ్చింది. కొద్ది నెలల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దాసోజు శ్రవణ్, సత్యనారాయణలను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు నామినేట్ చేసింది. అయితే గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వారి పేర్లను తిరస్కరించారు.

అయితే గవర్నర్ తమ నియామకాలకు ఆమోదం తెలుపకపోవడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ రాష్ట్ర హైకోర్టుకు వెళ్లారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టికల్ 171 ప్రకారం తమను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసిందని.. దాన్ని తిరస్కరించే హక్కు గవర్నర్ లేదని వారు పేర్కొన్నారు. ఆ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈలోపే కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరామ్, అమిర్ అలీఖాన్‌లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించడం, గవర్నర్ ఆమోదం తెలపడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టుకు వెళ్లారు.

# ముస్తాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ
## మంత్రి పొన్నం సమక్షంలో కాంగ్రెస్‌లోకి నేతలు

**కరీంనగర్,జనవరి30(వెలుతురు):** ముస్తాబాద్ లో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయింది. ముస్తాబాద్ లో జెడ్పీటీసీ, మాజీ జడ్పీటీసీ, మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సహా సర్పంచ్ లు, ఎంపీటీసీలు,



నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరగా.. కండువా కప్పి అందర్నీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. గతంలో ఈ ప్రాంత మంత్రి నియోజకవర్గానికి వస్తే ముందస్తు అరెస్ట్ ల పేరిట నిర్బంధించారని గుర్తు చేశారు. కానీ తమ ప్రభుత్వం స్వేచ్ఛగా సమస్యలు విన్నవించుకునే అవకాశం కల్పిస్తుందని అన్నారు. కేటీఆర్ ను అడ్డుకున్నారని పెట్టిన కేసులను ప్రభుత్వంతో మాట్లాడి తొలగింప చేస్తామని హామీ ఇచ్చారు. కేటీఆర్ అసమర్థత వల్లనే తొమ్మిదో ప్యాకేజీ పనులు నిలిచి పోయాయని అన్నారు. వాటిని త్వరితగతిన పూర్తి చేస్తామని పొన్నం చెప్పారు. 'నేరుగా ఎమ్మెల్యే అయి, కేసీఆర్ కుమారుడిగా మంత్రి అయినావు. మంత్రి పదవి పోగానే మనసున పడతలేదు. కాంగ్రెస్ పార్టీ తప్ప దేశానికి, రాష్ట్రానికి ప్రజాస్వామ్య బద్ధంగా పాలించే పార్టీ లేదు. గతంలో ప్రజా సమస్యలపై ఇక్కడికి వచ్చాను, ఇప్పుడు మంత్రిగా వచ్చాను. ముఖ్యమంత్రి నుంచి అప్పర్ మానేరు అభివృద్ధి పనుల విషయంపై హామీ తీసుకున్నాం' అని మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.

# ఎసిబి కస్టడీకి శివబాలకృష్ణ

**మొదటిపేజీ తరువాయి..**

పరిశీలించాలని ఏసీబీ నిర్ణయించింది. ఈ మేరకు హెచ్ఎండిఏ నుంచి ఫైల్స్‌ను తెప్పించుకుని విచారణ చేయనున్నారు.

10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన నాంపల్లి ఏసీబీ కోర్టు 8 రోజుల కస్టడీకి అనుమతిచ్చింది. వివిధ మీడియాల్లో వచ్చిన కథనంపై అధికారులు విచారణ వేగవంతం చేయనున్నారు. పుప్పాలగూడలో రూ.వేయి కోట్ల ప్రాజెక్టు అనుమతులపై అవకతవకలు జరిగాయని.. దానికి సంబంధించిన ఫైల్స్ హెచ్ఎండిఏ ఇవ్వాలని కోరుతూ సంబంధిత అధికారులకు ఏసీబీ లేఖ రాసింది. హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్.. ప్రస్తుత రెరా సెక్రటరీ శివబాలకృష్ణ, ఆయన బంధువుల ఇళ్లు, కార్యాలయాలలో ఏసీబీ ఆధికారులు ఐదు రోజుల క్రితం సోదాలు నిర్వహించారు. ఆదాయా నికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేప థ్యంలో.. ఎనిమిది బృందాలుగా విడిపోయిన ఏసీబీ అధి కారులు బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే రాష్ట్రవ్యాప్తంగా 17 చోట్ల సోదాలు చేశారు. మణికొండలోని ఆయన నివాస గృహంలో, అమిర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయంలో కూడా తనిఖీలు చేశారు. 2018–2023 కాలంలో హెచ్ఎండీఏ ఎలానింగ్ విభాగంలో కీలక స్థానంలో పనిచేసిన శివబాలకృష్ణ.. అధికార దుర్వినియోగానికి పాల్పడడం ద్వారా కోట్లాది రూపాయల ఆస్తులు అక్రమంగా కూడబెట్టినట్టు వచ్చిన ఆరోపణలు, వాటిపై తాజా ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో మణికొండలోని ఆయన ఇంటిలో సోదాలు నిర్వహించి, పదికి పైగా ఐఫోన్లు.. అత్యంత ఖరీదైన 50 వాచీలు.. కట్టలు కట్టలుగా నగదు.. ఆయన బీరువాలో 5 కిలోల బంగారు నగలు, 70 ఎకరాలకు సంబంధించిన భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

## హెటిరో పార్థసారథికి
# విలువైన భూములు

**మొదటిపేజీ తరువాయి..**

భూమిని 30 ఏళ్ల లీజుకు గత ప్రభుత్వం కేటాయించింది. ఈ లీజు ఒప్పందాన్ని రద్దు చేస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానమేట్‌లో సాయిసింధూ ఫౌండేషన్‌కు 15 ఎకరాలు కేటాయింపు చేస్తూ విడుదల చేసిన జీవో 140ను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. సాయి సింధు ఫౌండేషన్, క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల కోసం హాస్పిటల్ నిర్మాణం, లాభాపేక్ష లేకుండా 30 సంవత్సరాల కాలానికి లీజు ప్రాతిపదికన భూమి కేటాయించింది. సర్వే నంబర్ 41/14/2లోని భూమికి ఏడాదికి రూ. 1,47,743 లీజు మొత్తాన్ని సాయిసింధూ ఫౌండేషన్ చెల్లించేలా నిర్ణయించింది. హైటెక్‌సిటీకి కూతవేటు దూరంలో ఉన్న 15 ఎకరాల భూమిని గత సర్కారు తమ ఎంపీకి కారు చౌకగా కట్టబెట్టింది. రూ.4 వేల కోట్ల విలువైన భూమిని.. ఏడాదికి ఎకరానికి రూ.2 లక్షల చొప్పున.. మొత్తం రూ.30 లక్షలు చెల్లించేలా లీజుకు ఇచ్చింది. అంతేకాదు.. బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డి ట్రస్టీగా ఉన్న సాయిసింధు ఫౌండేషన్‌కు ఎన్నికలకు ముందు గోప్యంగా జారీ చేసిన జీవో ద్వారా ఈ భూమిని ధారాదత్తం చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. నిజానికి ఇది రెండో సారి ఈ భూమి కేటాయించడం. అంతకు ముందు ఓ సారి కేటాయిస్తే హైకోర్టు రద్దు చేసింది. తెలంగాణ ప్రభుత్వం 2018లో 15 ఎకరాలు కేటాయించింది. క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం కోసం ఖానామెట్ లో భూమిని కేటాయిస్తూ జీవో జారీ చేసింది. అయితే, సాయి సింధు ఫౌండేషన్ కి భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోని సవాల్ చేస్తూ రైట్ టు సొసైటీ సభ్యులు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అయితే, ప్రభుత్వం నిర్ణయంపై కొంతమంది హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు జీవోను కొట్టివేసింది. భూకేటాయింపుల్లో ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా ఉండేలా పున:పరిశీలన చేయాలంటూ ప్రభుత్వానికి సూచించింది. అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఇంత తక్కువకు అద్దెకు ఇవ్వడంపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ లెక్కన రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.5వేల 344 కోట్ల గండి పడుతుందని తెలిపింది. ఇంత ఖరీదైన భూమిని ఏకపక్షంగా ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం అనేక అనుమానాలకు తావిస్తోందని హైకోర్టు సీరియస్ అయ్యింది. హైకోర్టు రద్దు చేయడంతో.. ఎన్నికలకు ముందు మరోసారి సీక్రెట్‌గా భూమిని కేటాయించారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కోర్టు తీర్పును ఏమాత్రం పట్టించుకోలేదు. పార్థసారథిరెడ్డి ట్రస్టుకు లీజును కట్టబెట్టేందుకే మొగ్గుచూపింది. మరోమారు లీజు నిబంధనలను సవరించింది. 2023 సెప్టెంబరు 25న జీవో–140 ద్వారా సాయిసింధు ఫౌండేషన్‌కు విలువైన భూమిని కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ఏడాదికి రూ.50 కోట్ల మేర లీజు చెల్లించాలని, ప్రతి ఐదేళ్లకోసారి లీజుమొత్తాన్ని 10శాతం మేర పెంచాలని సర్కారు జారీ చేసిన నిబంధనలు చెబుతున్నా.. 'విచక్షణ అధికారం' పేరుతో బీఆర్ఎస్ సర్కారు ఏడాదికి ఎకరాకు రూ.2 లక్షల చొప్పున.. 15.4 ఎకరాలకు రూ.30 లక్షలు చెల్లించేలా లీజుకు ఇస్తున్నట్లు జీవో–140లో స్పష్టం చేసింది. ఇప్పుడీ భూమి కేటాయింపును రేవంత్ సర్కార్ రద్దు చేసింది.

# వేసవి నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

మొదటిపేజీ తరువాయి..

రిజర్వాయర్లను తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుకు అనుగుణంగా కొత్త ప్రతిపాద నలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేయటం సులభమవుతుందని, తక్కువ ఖర్చుతో సాధ్యమవుతుందని అన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయక్ సాగర్ లాంటి కొత్తగా ఏర్పడ్డ రిజర్వాయర్లన్నింటినీ తాగునీటికి వాడుకోవాలని అన్నారు. మంచినీటి సరఫరా నిర్వహణా బాధ్యతలను సర్పంచ్‌లకు అప్పగించాలన్నారు. దీంతో వారు కూడా బాధ్యతగా పనిచేస్తారని అన్నారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి విభాగాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ విధులను సర్పంచులకు అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇంటింటికీ నీళ్లను అందించే బాధ్యతను వాళ్లకే ఇవ్వాలని అన్నారు. అందుకు అవసరమైన విధి విధానాలు రూపొందించాలని సూచించారు. గ్రామాల వరకు రక్షిత మంచి నీటిని సరఫరా చేసే బాధ్యతను మిషన్ భగీరథ విభాగమే తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ, నల్లాలు, పైపులైన్ల మెయింటెనెన్స్ మాత్రమే విడిగా సర్పంచులకే అప్పగించాలని చెప్పారు. ఇప్పటివరకు మిషన్ భగీరథలో చేపట్టిన ఇంట్రా విలేజ్ వర్క్స్, ఇంటింటికీ నల్లా నీటిని సరఫరా చేసే నిర్వహణ ఎవరూ పట్టించుకోవటం లేదని ముఖ్యమంత్రి అన్నారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ అంశం ఎవరి పరిధిలో లేదని అధికారులు వివరణ ఇచ్చారు. జవాబుదారీతనం లేకపోతే గ్రామాల్లో తాగునీటి సమస్య పెరిగిపోతుందని సీఎం అన్నారు. వందకు వంద శాతం తెలంగాణలో ఇంటింటికీ నల్లా నీళ్లు ఇచ్చినట్లు గత ప్రభుత్వం చెప్పుకోవటంతో నష్టమే తప్ప లాభం లేకుండా పోయిందని ముఖ్యమంత్రి అన్నారు. దీంతో కేంద్రం నుంచి తెచ్చుకునేందుకు వీలున్న జల జీవన్ మిషన్ నిధులు రాకుండా పోయాయని అన్నారు. అందుకే వాస్తవాలను దాచిపెట్టి గొప్పలకు పోవాల్సిన అవసరం లేదని అధికారులను అప్రమత్తం చేశారు. ఇప్పటికీ రాష్ట్రంలో చాలాచోట్ల తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని,




తండాలు, గూడెలు, అటవీ గ్రామాలకు నీళ్లు అందటం లేదని అన్నారు. ఎన్నికల ప్పుడు తాను ఖానా పూర్‌కు వెళితే తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు చాలా గ్రామాల ప్రజలు తన దృష్టికి తెచ్చిన విషయం గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏయే ప్రాంతాలకు, ఎన్ని హాబిటేషన్లకు తాగునీరు అందటం లేదో సమగ్రంగా సర్వే చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నెలాఖరుతో సర్పంచుల పదవీకాలం ముగిసిపోతుందని, అధికా రులే తాగునీటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని చెప్పారు. సంబంధిత ఇంజనీర్లు అన్ని గ్రామాలకు వెళ్లి నిజ నిర్ధారణ బృందం చేసినట్లుగానే పక్కాగా తాగునీరు అందని హాబిటేషన్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. జలజీవన్ మిషన్ నిధులు రాబట్టుకునేలా కొత్త ప్రతిపాదనలు తయారు చేసి కేంద్రానికి పంపించాలని అన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ డెవెలప్మెంట్ ఫండ్ కింద కేటాయించిన రూ.10 కోట్లలో ఒక కోటి రూపాయలను తాగునీటి అవసరాలకు ఖర్చు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో లభ్యమయ్యే నీటిని ప్రజల తాగునీటి అవసరాలకే మొదటి ప్రాధాన్యంగా అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని, వాళ్లకు ఆర్థికంగా చేయూతను అందించే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థిని విద్యార్థులు, పోలీసులకు అందించే యూనిఫామ్లు కుట్టించే పనిని ఈ సంఘాల మహిళలకు అప్పగించాలని సూచించారు.

అవసరమైతే తగిన శిక్షణను ఇచ్చి వారిని ప్రోత్సహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికీ రోడ్డు కనెక్టివిటీ లేని గ్రామాలు, హాబిటేషన్లకు రోడ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 422 గ్రామ పంచా యతీలు, 3177 ఆవాసాలకు ఇప్పటికీ రోడ్డు కనెక్టివిటీ లేదని అధికారులు సీఎం నివేదించారు. వీటన్నింటికీ తారు రోడ్లు వేయా లని సీఎం ఆదేశించారు. అవసరమైతే ఉపాధి హామీ నిధులను లింక్ చేసి వీటిని పూర్తి చేయాలని చెప్పారు. ఈ బ్జడెట్లోనే అందుకు అవసరమైన నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచిం చారు. సీఎంతో పాటు ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని బ్రతికించుకుందాం..

**మొదటిపేజీ తరువాయి..**

ఉన్నట్టయితే.. ఇక మీ ఇష్టం' అని ఖర్గే అన్నారు.

ఎన్డీయే నుంచి బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ బయటకు వెళ్లిపోవడాన్ని ప్రస్తావించిన ఖర్గే.. జేడీయూ వెళ్లిపోయినంత మాత్రాన ఇండియా కూటమి బలహీనపడబోదని స్పష్టం చేశారు. 'ఒక వ్యక్తి పోయినంత మాత్రాన దేశం ఎలా బలహీనపడదో.. ఒకరిద్దరు నాయకులు వెళ్లిపోయినా కూటమి బలహీనపడబోదు. మరింత బలంగా ముందుకు వస్తాం. ఐక్యంగా పనిచేస్తాం. కేంద్రంలో బీజేపీని, ఒడిశాలో నవీన్ పట్నాయక్‌ను ఓడించేందుకు కలిసికట్టుగా కృషి చేస్తాం' అని ఖర్గే చెప్పారు. 70 ఏళ్లుగా దేశానికి కాంగ్రెస్ చేసిన సేవలను విమర్శించడాన్ని ఖర్గే తిప్పికొట్టారు. '70 ఏళ్లలో కాంగ్రెస్ ఏమీ చేయలేదంటే అసలు మోదీ ముఖ్య మంత్రి కూడా అయ్యి ఉండేవారేకాదు. మేం దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాం. అందువల్లే నువ్వు (మోదీ) ఈ రోజు ఆ స్థానంలో ఉన్నావు. ఇప్పుడు నువ్వు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అంతమొందించాలని అనుకుంటున్నావు' అని ఖర్గే నిప్పులు చెరిగారు. విభజించి పాలించాలని బీజేపీ, ఆరెస్సెస్ ప్రయత్ని స్తున్నాయని ఖర్గే మండిపడ్డారు. దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వంటి కాంగ్రెస్ నాయకులు నిరుపమాన త్యాగాలు చేశారని చెప్పారు.

ఆరెస్సెస్, బీజేపీ విషం వంటివి. అవి మన హక్కులను ఒకదాని తర్వాత మరొకటి గుంజుకుంటున్నాయి. మహిళల హక్కులు, ఎస్సీలు, ఎస్టీల హక్కులు పోతున్నాయి. మణిపూర్‌లో ఏం జరుగుతున్నది? ప్రజలు హత్యలకు గురవు తున్నారు. మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయి. వందల వాహనాలు, ఇళ్లు తగులబడిపోతున్నాయి. మోదీ ఎక్కడ? వెళ్లు.. వెళ్లి మణిపూర్, నాగాలాండ్ రాష్ట్రాలకు నీ ముఖం చూపించు' అంటూ ఖర్గే మండిపడ్డారు. ఒడిశా ముఖ్య మంత్రి నవీన్ పట్నాయక్.. ఆయన తండ్రి బిజు పట్నాయక్ వంటివారు కాదని ఖర్గే విమర్శించారు. ముఖ్యమంత్రిగా బిజు పట్నాయక్ రాష్ట్రాన్ని ప్రగతిబాట పట్టించారని చెప్పారు. అధికారులతో పరిపాలన చేస్తున్నారని నవీన్ పట్నాయక్‌పై విమర్శలు గుప్పించారు. తమిళనాడుకు చెందిన ఒక అధికారిని (వీకే పాండియన్) పార్టీలో చేర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బిజెపి గుప్పిట్లోనే ఈవీఎంల తయారీ..

**మొదటిపేజీ తరువాయి..**

కూడా పెద్ద ఎత్తునే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ ఎన్నికల సంఘానికి రాసిన లేఖ ఆసక్తి రేపుతున్నది. తీవ్ర జాప్యం జరిగినప్పటికీ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) బోర్డులో బీజేపీ అనుబంధ వ్యక్తుల నియంతృత్వాన్ని తొలగించేందుకు ఇకనైనా సంబంధిత అధికారులను ఆదేశించాలని ఆ లేఖలో ఈఏఎస్ శర్మ కోరారు. ఈ మేరకు తీసుకున్న చర్యలను ప్రజలు, దేశం చూసే విధంగా బహిరంగం చేయాలని విన్నవించారు. ఈ మేరకు ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్ కుమార్, ఇద్దరు ఎన్నకల కమిషనర్‌లకు శర్మ లేఖ రాశారు. బీఈఎల్‌లో బీజేపీ ఒక రాజకీయ పార్టీగా కీలక పాత్ర పోషిస్తున్నదని, దీనితో ఈవీఎంలు తయారు చేయడంతోపాటు, ఈవీఎం చిప్‌లలో ఉంచే అత్యంత కీలకమైన రహస్య ఎన్‌క్రిప్టెడ్ సోర్స్ కోడ్‌ను అభివృద్ధి చేసే బీఈఎల్ పనితీరును బీజేపీ పర్యవేక్షిస్తున్నదనే అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. బీఈఎల బోర్డులో బీజేపీ నామినీలు ఇండిపెండెంట్ డైరెక్టర్లుగా ఉన్నారన్న విషయాన్ని తాను గతంలోనూ లేఖ లేఖ ద్వారా తెలిపారని శర్మ.. ఎన్నికల కమిషనర్లకు గుర్తు చేశారు. తీవ్ర ఆందోళన కలిగించే ఈ అంశాన్ని తాను ఈసీఐ దృష్టికి తీసుకొచ్చినా దానిపై ఉద్దేశపూర్వకంగానే చర్యలు తీసుకోవడం లేదన్న అభిప్రాయం కలుగుతున్నదని పేర్కొన్నారు.

ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ఎన్నికల సంఘానికి తెలుసని వ్యాఖ్యా నించారు. బీజేపీ ఎన్నికల ప్రయోజనాల కోసమే కమిషన్ ఈ అంశాన్ని పట్టించు కోవడం లేదని ఆరోపించారు. మన్సుఖ్‌భాయ్ షాంజీభాయ్ కచరియా బీజేపీలో కీలక నేత అని ఆయన ఆరోపించారు. అనేక దేశాలు ఈవీఎంలను వదిలేసి బ్యాలెట్ పద్ధతిని అనుసరిస్తున్నా కేంద్ర ఎన్నికల సంఘం కళ్లు మూసుకున్నదని విమర్శించారు. రాజ్యాంగం పట్ల ఏ మాత్రం గౌరవం ఉన్నా.. ఇప్పటికైనా సదరు ఇండిపెండెంట్ డైరెక్టర్లను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు

# నితీశ్ అవసరం మాకు లేదు

**మొదటిపేజీ తరువాయి..**

అందించడం కూటమి బాధ్యత. దానికి నీతీశ్ అవసరం లేదు. కొంచెం ఒత్తిడి వచ్చినా ఆయన యూటర్న్ తీసుకుంటారు' అని విమర్శిం చారు. 2020 శాసనసభ ఎన్నికల తర్వాత నీతీశ్ మూడోసారి బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. మహాకూటమి, విపక్ష కూటమిలో కొన్ని విషయాలు నచ్చకపోవడం వల్లే భాజపాతో పొత్తు పెట్టుకున్నట్లు చెప్పారు. మిత్రపక్షాలను మార్చడం ద్వారా బిహార్‌లో సుదీర్ఘకాలంగా అధికారంలో కొనసాగుతున్న నీతీశ్.. భాజపాకు వ్యతిరేకంగాజాతీయస్థాయిలో 'ఇండియా' కూటమి ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. అయితే, 'ఇండియా' కూటమి కన్వీనర్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికైనప్పటినుంచి ఆయన అసంతృప్తితో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే కూటమిని వీడినట్లు తెలుస్తోంది.

# నేటినుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి..**

ప్రవేశ పెడతారు. ఏప్రిల్– మే నెలలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. ఎన్నికల నేపథ్యంలో విధానపర ప్రకటనలు ఏమి ఉండక పోవచ్చు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కు పార్లమెంట్ ఆమోదం తెలిపితే ఏప్రిల్– జులైకి కావాల్సిన నిధులను ప్రో రేటా ప్రాతిపదికన భారత సంఘటిత నిధి నుంచి తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం 2024–25 ఏడాదికి జూన్‌లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెడతారు. ఈ క్రమంలో కొత్త పథకాలు లేదా విధానాలు ప్రకటించే అవకాశం ఉండకపోవచ్చు. ఆర్థికమంత్రిగా వరసగా ఆరోసారి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సమర్పిస్తున్నారు. ఐదు సార్లు పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించారు. ఈ సారి ఓటాన్ అకౌంట్ బ్జడెట్ ప్రతిపాదిస్తారు. వరసగా ఆరోసారి బ్జడెట్ సమర్పించిన మహిళ నేతగా నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించారు. మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ అత్యధికంగా పది సార్లు బ్జడెట్ ప్రవేశపెట్టారు. ఆ తర్వాత స్థానంలో నిర్మలా సీతారామన్ నిలుస్తారు. అరుణ్ జైట్లీ, పి చిదంబరం, యశ్వంత్ సిన్హా, మన్మోహన్ సింగ్ ఐదు సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ బ్జడెట్ ప్రవేశపెట్టారు. ఇందిరా తర్వాత బడ్జెట్ ప్రతిపాదించిన మహిళా నేతగా నిర్మలా సీతారామన్ నిలిచారు. 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. అరుణ్ జైట్లీ కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేశారు. 2014–15, 2015–16, 2016–2017, 2017–2018, 2018–2019 ఐదుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. జైట్లీ అనారోగ్యానికి గురికావడంతో 2019–2020 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం పీయూష్ గోయల్‌కు వచ్చింది. 2019లో మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చింది. జైట్లీ సూచనలతో నిర్మలా సీతారామన్‌కు ప్రధాని మోదీ ఆర్థిక శాఖ బాధ్యతలను ఇచ్చినట్టు తెలుస్తోంది. అలా వరసగాబడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం వచ్చింది. రెండో అత్యధిక బడ్జెట్ ప్రవేశపెట్టిన నేతగా రికార్డు సృష్టించారు. తన బ్జడెట్‌లో సంస్కరణలకే నిర్మలా సీతారామన్ ప్రాధాన్యం ఇచ్చారు. సూట్ కేసులా కాకుండా రాజముద్ర ఉన్న ఎరుపు రంగు వస్త్రంలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చే సంప్రదాయానికి నిర్మలా సీతారామన్ శ్రీకారం చుట్టారు.ఓట్ ఆన్ అకౌంట్ బ్జడెట్‌లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని 50 శాతం పెంచే అవకాశం ఉంది. కిసాన్ సన్మాన్ పథకం ద్వారా భూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ.6 వేల పంట సాయాని మూడు విడతలుగా అందిస్తున్నారు. ఇప్పుడు దానిని రూ.9 వేలకు పెంచే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వంపై రూ.12 వేల కోట్ల భారం పడనుంది. ప్రస్తుత సమావేశాల్లో 19 బిల్లులు ఆమోదించే అవకాశం ఉంది. ఇన్‌కమ్ ట్యాక్స్ తదితర విషయాల్లో పాతపద్ధతినే అవలంబించే ఛాన్స్ ఉంది.

# చర్లపల్లి టర్మినల్ భూ సమస్య పరిష్కరించాలి
## సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

**హైదరాబాద్,జనవరి30(వెలుతురు):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి మంగళవారం నాడు లేఖ రాశారు. జంట నగరాలకు వస్తున్న రైల్వే ప్రయాణికులకు మరింత సౌలభ్యాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. చర్లపల్లి టర్మినల్ నిర్మాణానికి కొన్ని అడ్డంకులు ఉన్నాయని.. ఆ ప్రాజెక్టు కోసం భూ కేటాయింపులు కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఉత్తరం వైపు టర్మినల్ చేరుకునేందుకు ఉన్న రహదారి విస్తరణకు సహకారం అందించాలన్నారు. మౌలాలీ యార్డ్ స్టేషన్ సమీపంలో ట్రాక్ పైకి.. మురుగునీరు వస్తుండటంపై చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

# 10వ తరగతి విద్యార్థుల చదువు పట్ల హరీష్‌రావు ప్రత్యేక ఫోకస్

హరీష్ రావు సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ

- పిల్లల భవష్యత్తుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు సహకరించాలి

- కష్టంగా కాకుండా ఇష్టంగా చదవండి



**నంగునూర్ మండలం వెలుతురు జనవరి 30:** నంగునూర్ మండల కేంద్రములోనీ జిల్లా పరిషత్ పాఠశాల నర్మేట ప్రభుత్వ బాలికల కస్తూర్బా పాఠశాలలో బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల కోసం ఓ తండ్రిలా హరీశ్ రావు కష్టపడుతున్నారని వారి కృషిలో తాము భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు అన్నారు. పదవ తరగతి విద్యార్థులకు హరీశ్ రావు తన పిల్లలుగా భావిస్తు స్నాక్స్ ఏర్పాటు చేస్తున్నారని ఇప్పటికే తల్లి తండ్రులకు ఉత్తరం పంపారన్నారు. ప్రస్తుతం డిజిటల్ కంటెంట్ బుక్స్ ఇస్తున్నారని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హరీశ్ రావు కష్టానికి ప్రతిఫలంగా పదో తరగతి ఫలితాల్లో అందరూ ఉత్తీర్ణులై ఎమ్మెల్యేకు బహుమతిగా అందివ్వాలని సూచించారు. నంగునూర్ ప్రభుత్వ పాఠశాలల్లో మాజీ ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు లింగం గౌడ్ రాష్ట్ర అయిలు ఫామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి ప్యాక్స్ చైర్మెన్లు కోల రమేశ్ గౌడ్ మహిపాల్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ రాగుల సారయ్య యువజన విభాగం అధ్యక్షులు ఇతర విద్యార్థి యువజన నాయకులు గ్రామ సర్పంచ్ ఎంపీటీసీ పార్టీ అధ్యక్షులు తదితులున్నారు.



## బల్కంపేట్ ఎల్లమ్మను దర్శించుకున్న మన్నేబోయిన కృష్ణ యాదవ్, కృష్ణమాచారి

**హైదరాబాద్ వెలుతురు జనవరి 30:**
శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం బల్కంపేట్ శ్రీ శత చండి యాగ సహిత మహాకుంభాభిషేకం మహోత్సవాలు 2024. ఈరోజు మహా కుంభాభిషేకం మరియు శత చండీ హోమము సందర్భంగా టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మన్నేబోయిన కృష్ణ యాదవ్ గారు మరియు రాష్ట్ర దేవాదాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కే కృష్ణమాచారి గారు ఎల్లమ్మ



పోచమ్మ అమ్మవారి నీ దర్శించుకున్నారు ఈ యొక్క కార్యక్రమంలో కార్యనిర్వాణాధికారి నాగరాజు.. పాల్గొన్నారు మరియు దేవస్థానం చైర్మన్ కే సాయిబాబా గౌడ్ ధర్మకర్తలు ఆంజనేయులు యాదవ్ గారు మరియు యాదగిరి యాదవ్ గారు వారికి అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే దానం నాగేందర్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 30:**
మంగళవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్ని ఖైరతా బాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ మరియు హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్



మహాలక్ష్మి రామన్ గౌడ్ ప్రారంభించడం జరిగింది. డివిజన్లోని స్ట్రీట్ నెంబర్ 5,9, మరియు విట్టల్వాడిలో మున్సిపల్ మరియు జలమండలి కార్యక్రమాన్ని శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్, మరియు టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గాంధీ అహింసా మార్గంలో నడవాలి

**హైదరాబాద్ వెలుతురు జనవరి 30:**
టీఎన్జీఓస్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ మాజీదుల్లా హుస్సేని(ముజీబ్) గారి ఆధ్వర్యంలో మంగళవారం రోజున స్వర్గస్తులు జాతిపిత శ్రీ. మోహన్ దాస్ కరంచంద్ గాంధీ గారి వర్ధంతి సందర్భంగా గృహకల్ప కార్యాలయంలో సహ అధ్యక్షులు కే.ఆర్.రాజ్ కుమార్, కోశాధికారి బాలరాజ్, సభ్యులు ఖాలీద్ అహ్మద్, మాజీ కార్యదర్శి జి.ప్రభాకర్ ఏపీఆర్ఓ మహమ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్ మరియు యూనిట్




అధ్యక్షులు, కార్యదర్శుల సమక్షంలో రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొని అహింస మార్గంలో మనమందరం నడవాలని తెలిపారు.

**పశ్చిమగోదావరి జిల్లా వెలుతురు జనవరి 30:** 2024 జనవరి 30,31 ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం 15వ రాష్ట్ర మహాసభలు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ప్రారంభం. ముఖ్యఅతిథి తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం.వి.రమణ ప్రారంభ ఉపన్యాసం . కేజీకేఎస్




# గంజాయి పీలుస్తున్నారా..

## ప్రతివారం స్టేషన్‌లో సంతకం పెట్టాల్సిందే..

గంజాయి, డ్రగ్స్ నియంత్రణలో భాగంగా ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ

ఉప్పల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్. చంద్రశేఖర్ గౌడ్





**ఉప్పల్, వెలుతురు:** గంజాయి, డ్రగ్స్ నియంత్రణ లో భాగంగా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే గంజాయి సేవించి పట్టుబడ్డ వారిపై కేసులు నమోదుతో పాటు వారిపై నిఘా పెట్టేందుకు వారిని ప్రతి వారంలో ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ పోలీసు స్టేషన్ కు వచ్చి సంతకాలు పెట్టాలని ఆదేశిస్తున్నారు. ఇలా గంజాయి తాగి పట్టుబడ్డ వారిని ఆ ప్రాణాంతక మత్తు మహమ్మారి నుంచి యువతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని ఉప్పల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్. చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.

6 నెలల పాటు ప్రతి వారం అధికారులు నిర్ణయించిన రోజు రావాల్సి ఉంటుంది. ఈ సమయం లోనే వారిని పలు కోణాల్లో ప్రశ్నించి వారు నిజంగానే గంజాయి మత్తుకు దూరమవుతున్నారో లేదా అని గమనిస్తామని ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ స్పష్టం చేశారు. అదే విధంగా గంజాయి తాగిన వారిని మేజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేస్తామన్నారు. బైండోవర్ నిబంధనలు ఉల్లగించిన వారిని బ్రీచ్ కింద నేరుగా 2 సంవత్సరాలు జైలు, 2 లక్షలు జరిమానా విధించే చట్టం, అధికారం బైండోవర్ చేసిన మేజిస్ట్రేట్ కు ఉందని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ స్పష్టం చేశారు. గంజాయి విక్రయించే వారికి కూడా ఇదే చట్టంతో పాటు ఇంకా కొన్ని సెక్షన్ లు వర్తిస్తాయని ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు.

ఈ బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన వారికీ 2 సంవత్సరాల జైలు, 2 లక్షల జరిమానా విధించిన సంఘటనలు ఉన్నాయని చంద్రశేఖర్ వివరించారు. గంజాయి తాగిన దాదాపు 300 మంది విద్యార్థులు, యువత కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చామని చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. మా ఎక్సైజ్ సైట్ లో గంజాయి తాగి, అమ్ముతూ దొరికిన వారి పూర్తి చిట్టా ఫోటో అప్లోడ్ చేసి ఉంటుందన్నారు. దీని గంజాయి కేసులో దొరికిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు దొరకవని, వీసాలు కూడా రావని ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ చెప్పారు. కాబట్టి యువత, విద్యార్థులు తస్మాత్ జాగ్రత్త అంటూ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ హెచ్చరిస్తున్నారు.




# 236 నిషేధిత సిగరెట్ ప్యాకెట్లు సీజ్..

**అక్రమ సిగరేట్లను అమ్ముతున్న "టేస్టీ చాలీయా కిరాణం షాపు"లో జిల్లా టాస్కోర్స్ పోలీసుల దాడులు**

**జహీరాబాద్, 30 జనవరి వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములోని శాంతినగర్ కాలనీలో మహ్మద్ ఖదీర్ తండ్రి ఇసామియ్యా, వయస్సు: 28 సంవత్సరాలు, శాంతినగర్ జహీరాబాద్ వాస్తవ్యుడు, తన "టేస్టీ చాలీయా కిరాణం షాపు" నందు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ నిషేధిత, ప్రభుత్వ అనుమతులు లేని సిగరెట్లను అమ్ముతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతు అక్రమ సిగరేట్లను అమ్ముతున్నాడని అట్టి వ్యక్తిని అదుపులోకి తీసుకుని, వివిధ రకాల 236 సిగరెట్టు బాక్సలను స్వాధీనపరుచుకొని, నిందితులతో సహా స్వాధీనపరుచుకున్న సొత్తును తదుపరి విచారణ నిమిత్తం జహీరాబాద్ పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు.




## పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి..

**రాజేందర్ నగర్ వెలుతురు జనవరి 30:**
బిజెపి రాజేందర్ నగర్ అసెంబ్లీ సమావేశం గత అసెంబ్లీ ఎలక్షన్లలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు చెబుతూ ఎక్కడెక్కడ బూతులలో ఎక్కువ ఓట్లు వచ్చినాయి తక్కువ ఓట్లు వచ్చినాయి తక్కువ ఓట్లు వచ్చిన బూతులలో ఎలా పని చేయాలని చెప్పి పార్లమెంటు ఎలక్షన్లలో మనమందరం బిజెపిని గెలిపించి చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ సీట్ ని నరేంద్ర మోడీ గారికి బహుమానంగా ఇవ్వాలని కోరుకుంటూ మీటింగ్ ఉప్పర్ పల్లి , బిజెపి కార్యాలయం. రాజేందర్ నగర్,డివిజన్.ఈ కార్యక్రమానికి నాయకులు డాక్టర్ ప్రేమ్ రాజ్ ,పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి ,వై శ్రీధర్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ మైలార్ దేవులపల్లి బొక్క బాల్ రెడ్డి ,బాబురావు ,సత్యనారాయణ ,గోనె శ్రీకాంత్ రెడ్డి విట్టల్ ,సోల్కర్ రెడ్డి, సదానందం ,మల్లె చారి ,నాగమణి ,రవి ,శ్రీనివాస్ రెడ్డి ,పవన్ ,కరుణాకర్ , మహేష్ ,పెంటా రెడ్డి, మరియు రాజేంద్రనగర్ డివిజన్ కార్యకర్తలు

## తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్‌ను అభినందించిన దావ శ్రీనివాసులు

**హైదరాబాద్ వెలుతురు జనవరి 30:**
హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్‌గా నియమితులైన శ్రీమతి పాల్వాయి రజిని కుమారిగారిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన బీసీ కుల సంఘల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు దావ శ్రీనివాసులు గారు కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ నాయకులు మల్లెపల్లి



ఎంపీటీసీ చెన్నగొని శివ గౌడ్, కుర్మపల్లి గ్రామ సర్పంచ్ బొడ్డు శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ బాదేపల్లి బాల జంగయ్య గౌడ్, ఉమ్మాపురం ఉప సర్పంచ్ రొక్కం మహేందర్ రెడ్డి,వనం శేషు తదితరులు పాల్గొని సన్మానించడం జరిగింది.

## తెలంగాణ ఉద్యమనేతపై కెసిఆర్ కుతంత్రం

తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె వినయ్ కుమార్



**హైదరాబాద్ వెలుతురు జనవరి 30, 2024:** కోదండరాంపై కేసీఆర్ కుట్ర మరోసారి బహిరంగమైనది. ముందస్తు ప్రణాళికతోనే కోదండరాం ప్రమాణస్వీకారాన్ని వాయిదా వేయించి కోర్టులో కేసు వేశారు. ఉద్యమ నాయ కుడు చట్టసభల్లోకి వస్తుండు అంటేనే వణికి పోతున్న కేసీఆర్. గత ప్రభుత్వ అవినీతిని చట్టసభల్లో నిలదీస్తా రనే భయంతోనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు పెట్టి ప్రొ.కోదండరాంను ఓడించారు. ఇప్పుడేమో కోర్టును తప్పుద్రోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. కుట్రలకు మేం భయ పడం. ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ అంతుతేలుస్తాం. కేసిఆర్ నీచ రాజకీయాలను నిరసిస్తూ తెలంగాణ జన సమితి కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, ప్రజా స్వామిక వాదులు రేపు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలుపవలిసిందిగా విజ్ఞప్తి.

# సంపాదకీయం..

## దేశంలో కులగణన రాజకీయాలు !

దేశంలో కుల రాజకీయాలు, వర్గ రాజకీయాలు నడుస్తున్నాయి. రాజకీయ నాయకుల ఎజెండా ఓట్లు కొల్లగొట్ట డమే తప్ప మరోటి కాదు. కులాల వారీగా విభజించి ఓట్లు కొల్లగొట్టే ఎత్తులకు ప్రయత్నాలు మొదల య్యాయి. దీనిని అడ్డుకోవాలన్న ధ్యాస మేధావివర్గంలో లేకుండా పోతోంది. బీహార్‌లో మొదలైన కులగణన చిచ్చు..ఇప్పుడు దేశంలో క్యాన్సర్‌లా విస్తరిస్తోంది. నిజానికి ఆర్థిక అసమానతలపై జనాభా గణన జరగాలి. ఏ గ్రామానికి వెళ్లినా ఉన్నవారెవరో..లేని వారెవరో ప్రత్యక్షంగా కనినిస్తుంది. ఇళ్లు ఉన్నవారు లేని వారు కూడా కనినిస్తారు. ఆర్థికంగా బలవంతులు ఎవ్వరో..బలహీనులు ఎవ్వరో కనిపిస్తుంది. అంతెందుకు ఇప్పుడున్న తెల్ల రేషన్ కార్డుదారుల్లో వేలాదిమంది ఆర్థికంగా ఉన్నతవర్గాలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్ పొందేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తెల్ల కార్డులు పొందారు. ఈ రెండు రాష్ట్రాల్లో కార్డుల ఆధారంగా వారి ఆర్థికస్థితిగతులను లెక్క కట్టగలమా అన్నది చెప్పాలి. కులగణన చేపట్టాలని ఇరు తెలుగు రాష్ట్రాల్లో తీసుకున్న నిర్ణయం వల్ల కులాల సంఖ్య తేలవచ్చు.. కానీ ఆర్థికస్థితిగతులు తేలవు. కులాల కుంపట్లు పోవాలని కోరుతున్న వారే ఇప్పుడీ కులగణనకు పూనుకోవడం దారుణం. కారణమేంటంటే కులాల వారీగా ఓట్లు పొందాలన్న రాజకీయ కారణమే వారిని ఇలా చేయిస్తోంది. సామాజిక వెనకబాటుతనం గతంలో లాగా లేదు. కులాల మధ్య అంతరాలను తొలగించాల్సిందే. సమాజంలో అంతా ఒక్కటే అన్న భావన పెంపొందించే చర్యలు కావాలి. కులాల ఆధారంగా ఇది సాధ్యం కాదు. దేశ రాజకీయాల్లో ఇప్పుడు వీస్తున్న గాలి కులగణన, అంటే వెనుకబడిన తరగతుల జనాభా లెక్కలు తేల్చడం, కులాల వారీగా జన గణనను చేపట్టడం మాత్రమే అవుతుంది. అలాంటి వారి ఆర్థిక స్థితిగతులను కూడా చేపడితే..ముమ్మందు వెకబడిన వర్గాలకు ఏవైనా పథకాలు అమలు చేయాలన్నప్పుడు ఇలాంటి వారిని గుర్తించడం సులవు కాగలదు. జాతీయ స్థాయిలో దీనిని నిర్వహించడానికి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరాకరించింది. ఇది సమాజాంలో అసంతృప్తులకు, విభజనకు కారణం అవుతుందని భావించారు. ఇది ముమ్మాటికీ నిజం. దీంతో సమాజంలో చీలిక వస్తుంది. అంతరాలు ఏర్పడుతాయి. అయితే ఈ వాదాన్ని ఎవ్వరు కూడా పట్టించు కోవడం లేదు. కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో కులగణనకు అంగీకరించింది. ఈ క్రమంలో తెలంగాణలో కులగణనకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పూనుకుంటోంది. గతంలోనే బీహార్ లోని నితీశ్ కుమార్ నాయకత్వంలోని జెడి (యు)–, ఆర్‌జెడిల మహాఘట్ బంధన్ ప్రభుత్వం తొలిసారిగా ఆ రాష్ట్రంలో కులప్రాతిపదిక జనాభాలెక్కల సేకరణను పూర్తి చేసింది. ఆంధ్రప్రదేశ్ కూడా దీనిని చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కులగణన ఆవశ్యకతను గుర్తించి తాము అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో దీనిని జరిపిస్తామని ప్రకటించారు. తెలంగాణలో కులగణనను చేపడతామని మొన్న జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచార సమయంలో రాహుల్ గాంధీ వాగ్దానం చేశారు. అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తాజాగా నిర్ణయం తీసుకొంది. త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లోనే కుల గణనకు సంబంధించిన బిల్లు ప్రవేశపెడతారని తెలుస్తు న్నది. దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు ప్రత్యేక కమిటీ వేసి బీహార్‌లో జరిగిన పద్ధతిని అధ్యయనం చేయించనున్నారని సమాచారం. రాష్ట్రంలో కులగణన చేపట్టబోతున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాహుల్ గాంధీ అభినందించారు. ఎందుకంటగే ప్రకటించిన హామీ మేరకు ముందుకు సాగుతున్నారు. నిజానికి దీని అవసరం లేదని వారు గుర్తించడం లేదు. సమాజంలో అంతరాలను తొలగించే ప్రయత్నం కానీ, అధ్యయనం కానీ జరగడం లేదు. దేశంలో అత్యధిక జనం ఇంకా పేదరికంలోనే మగ్గుతున్నారు. సగానికి మించిన జన సంఖ్య సరైన తిండి, ఇల్లు, ఇతర మానవీయ జీవన సౌకర్యాలకు దూరంగా బతుకుతున్నారు. ఈ పేదరికం అన్నది కులాన్ని అంటిపెట్టుకొని లేదు.. ఉన్నతవర్గాలుగా చెబుతున్న అనేక కులాల్లో పేదలు లెక్కకు మిక్కిలి ఉన్నారు. బ్రాహ్మణవర్గాల్లో నేటికీ యాచకవృత్తితో బతుకుతున్న వారు లక్షల్లో ఉన్నారు. వీరిని ఉన్నత కులాలుగా పిలుస్తున్నా..వీరికి ఏ పథకం అందడం లేదు. నిజానికి భారతదేశంలో శ్రామికవర్గాలకు చెందిన వారే ఇప్పటికీ దుర్భర దారిద్ర్యంలో ఉన్నారు. ఇందులో అన్ని కులాల వారు ఉన్నారు. తమ బతుకుదెరవు కోసం వీరు నిత్యకూలీలుగా ఉన్నారు. వీరికి సరైన న్యాయం జరగాలంటే కులాలవారీ జనగణన అవసరం లేదు. కుటుంబాల ఆధారంగా ఆర్థిక గణన జరగాలి. కొత్తగా మరికొన్ని కులాల వారికి రిజర్వేషన్లు కల్పించాలన్న ఆలోచనలు కూడా మంచిది కాదు. అమెరికాలో నేటికీ కులాల ఆధారంగా లెక్కలు తీయడం లేదు. ఇక్కడి నుంచి అక్కడికి వెళ్లిన వారు తమ కులాల గురించి మాట్లాడడం లేదు.

బ్రిటిష్ వారు 1931లో సేకరించిన కులాలవారీ లెక్కల తరవాత సమాజంలో మార్పులు వచ్చాయి. అనేక కులాల వారు స్వశక్తితో పైకి వచ్చారు. తమకంటే హోదాను ఏర్పరచుకున్నారు. సమాజంలో ఉన్నతవర్గాలుగా చెలామణి అవుతున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికీ కులాల కుంపట్ల మీదనే ఆధారపడుతున్నాయి. ఏ వర్గానికి, ఏ మేలు చేయాలన్నా కులాల ఆధారంగానే లెక్కలు వేస్తున్నారు. ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. నిజానికి సమగ్ర సామాజిక సర్వే తప్పనిసరి. విద్య, ఉద్యోగాల్లో దక్కుతున్న రిజర్వేషన్లు అర్హులకు దక్కడం లేదు. రిజర్వేషన్లు పొందిన వారు ఆర్థికంగా బాగుపడ్డా ఇంకా కులాల ఆధారంగా లబ్ధి పొందుతు న్నారు. దీనిని తొలుత నిర్మూలించాలి. కులాల ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం మంచిదే అయినా.. అర్హులను కూడా గుర్తించాలి. అర్హులకే ప్రభుత్వ పథకాలు అందాలి. ఆర్తిక అసమానతలే ఇందుకు గీటురాయి కావాలి. కులగణన ఆధారంగా కేవలం రాజకీయంగా మాత్రమే లబ్ది పొందగలరని భావించాలి.

# ముక్కు పచ్చలారని బిడ్డలను కాపాడుకునే బాధ్యత పాలకులకు లేదా..?

మొన్న జాతీయ బాలికా దినోత్సవం జరుపుకున్నాం. ఒక ప్రక్కన 'బేటీ బచావో.. బేటీ పఢావో' మన ప్రధాని నినాదం. పేరు గొప్ప, ఊరు దిబ్బకు ఇంతకుమించిన ఉదాహరణ మరేదీ ఉండదు. ప్రభుత్వ లెక్కలే దీనికి రుజువు. అభివృద్ధిలో ఎంతో ముం దంజలో ఉన్నామని ఢంకా బజాయించి చెప్పుకుంటున్నా.....

అమ్మాయిల పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. నేడు దేశంలో అమ్మాయిల బతుకే ప్రశ్నార్థకమయింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 7 దశాబ్దాలు కావచ్చినా పిల్లలు పోషకాహారలోపంతో పిట్టల్లా రాలిపోతున్నారు. దేశంలో అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య ఒక అరుదైన సామీప్యత ఉండీ వారి, వారి పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. వారి క్షేమం భవిష్యత్ గురించి అవసరానికి మించి జాగ్రత్తలు తీసుకుంటారు. అభం శుభం తెలియని ముక్కుపచ్చలారని పసిప్రాయాన్ని పసిమొగ్గ దశలోనే చిదిమేస్తున్నారు. పౌష్టికాహారంలోపం వల్ల చిన్నారుల జీవి తాలు అప్పుడే నిండు నూరేళ్లు నిండుతున్నాయి. ఈ సమస్య మనదేశంతోపాటు వర్ధమాన దేశాల్లో అధికమైంది. మనదేశంలో ఏటా 34 లక్షల మంది పిల్లలు పోషకాహారలోపంతో చనిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆహారకొరత తాండవిస్తోంది. జనెడు పొట్టను నింపుకోవడానికై పీడిత, తాడిత ప్రజలు వేస్తున్న ఆకలికేకలు ప్రభుత్వాలకు వినిపిస్తున్నాయా.. ఆకలిదపలతో కోట్లాది మంది తనువు చాలిస్తున్నారు నగ్న సత్యం .

భారతదేశంలో ఏటా సుమారు కోటి ఇరవై లక్షల మంది బాలికలు జన్మిస్తున్నారని లెక్కలు చెబుతున్నాయి. కానీ వారిలో పదిహేనేండ్లు వచ్చేసరికి సుమారు ముప్పై లక్షల మంది చనిపోతున్నారు. దీనికి బాలికల మీద ఉన్న చిన్న చూపే ప్రధాన కారణం. లింగ సమానత్వం లేనిదే దేశంలో అభివృద్ధి, సామాజిక మార్పు సాధ్యంకాదంటూ ఓ వైపు ప్రచారం చేస్తూనే అమ్మాయిలపై వివక్ష చూపిస్తు న్నారు. ఒక ప్రక్కనబేటీ బచావో.. బేటీ పడావో అంటున్న మోడీ పాలనలో చిన్నారులు మాయమైపోతున్నారు. కనీసం వారు ఎక్కడ ఉన్నారు..ఎలా ఉన్నారు. అసలు ప్రాణాలతో బతికే ఉన్నారా.. లేదో తెలియక తలిదండ్రులు లోలోన కుమిలిపోతున్నారు. తాజాగా ఎన్సీఆర్బీ విడుదల చేసిన నివేదికల్ని పరిశీలిస్తే.. ఆ కుటుంబాలు ఎంతగా ఆవేదన చెందుతున్నాయో స్పష్టమవుతోంది.దేశంలో 2018 తర్వాత అదృశ్యమైపోతున్న చిన్నారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్బీ) తాజా నివేదిక ప్రకారం 47 వేల మంది చిన్నారుల ఆచూకీ తెలియడం లేదు. వారిలో 71.4 శాతం మంది మైనర్ బాలికలేనని ఆ నివేదిక తెలిపింది.

కనిపించకుండా పోయిన బాలబాలికల సంఖ్య 2022తో కలిపి ఐదు సంవత్సరాల కాలంలో బాగా పెరిగింది. 2021తో పోలిస్తే 2022లో వీరి సంఖ్య 7.5 శాతం పెరిగింది. 2020లో కంటే 2021లో 30.8 శాతం పెరిగింది. అయితే 2019తో పోలిస్తే 2020లో 19.8 శాతం తగ్గింది. కానీ 2018లో కంటే 2019 లో 8.9 శాతం 2017లోపోలిస్తే 2018లో 5.6 శాతం పెరిగింది. ఆచూకీ తెలియకుండా పోయిన చిన్నారులలో ఆయా రాష్ట్రాల అధికారులు కొందరి ఆచూకీ తెలుసుకున్నప్పటికీ గణాంకాలలో తేడా మాత్రం అధికంగానే ఉంది. భారత్లో జరిగిన నేరాలపై ఎన్సీఆర్బీ ఈ నెల 3న తన వార్షిక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం గత సంవత్సరంలో 20,380 మంది బాలురు, 62,946 మంది బాలికలు, 24 మంది ట్రాన్స్‌జెండర్లు (మొత్తం 83,350 మంది) కనిపించకుండా పోయారు. మొత్తంమీద 20,254 మంది బాలురు, 60,281 మంది బాలికలు, 26 మంది ట్రాన్సె జెండర్ల (మొత్తం 80,561 మంది) ఆచూకీ లభించింది.

ఆచూకీ తెలియకుండా పోయిన చిన్నారులకు సంబంధించి పాటిస్తున్న ప్రామాణిక నిబంధనల ప్రకారం... మైనర్ బాలుడు లేదా బాలిక కన్పించడం లేదన్న సమాచారం అందుకున్న తర్వాత పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి, నిర్ధారించుకుంటారు. ఐపీసీ సెక్షన్ 363 (కిడ్నాప్) కింద కేసు నమోదు చేస్తారు. 2022లో కిడ్నాప్కు గురైన 76,069 మంది పిల్లల్లో 62,099 మంది బాలికలే. కిడ్నాప్కు గురైన వారిలో (ఐదు సంవత్సరాలలో కలిపి) 51,100 మంది మైనర్ల ఆచూకీ తెలియలేదు. వీరిలో 40,219 మంది అంటే 78.7 శాతం మంది బాలికలు. కన్పించకుండా పోయిన పిల్లల కేసుల్ని కిడ్నాపింగ్ కేసుల కేటగిరీలో చేరుస్తారు. ఈ కేటగిరీ కింద 2020లో 29,364, 20195 29,243, 2018 24,429 నమోదయ్యాయి. అదృశ్యమైపోయిన చిన్నారుల విషయంలో మరింత దృష్టి సారించాలని ఢిల్లీ మాజీ పోలీస్ కమిషనర్ ఎస్ఎన్ శ్రీవాత్సవ చెప్పారు. వీధుల్లో తిరిగే చిన్నారులు కిడ్నాపర్లకు లక్ష్యంగా మారుతున్నారని, వారిని అపహరించి విక్రయించడమో, వ్యభిచారంలోకి దించడమో లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వాడుకోవడమో జరుగుతోందని తెలిపారు. ఆచూకీ తెలియని చిన్నారులను వెతికి పట్టుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కన్పించకుండా పోయిన చిన్నారుల ఆచూకీని కనిపెట్టడంలో విజయం సాధించిన పోలీస్ సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించాలని అన్నారు. కాగా ఇలాంటి కేసుల విచారణలో తొలి 24 గంటలే కీలకమని స్వచ్ఛంద సంస్థ శక్తి వాహినిలో పని చేస్తున్న సామాజిక కార్యకర్త రిషి కాంత్ చెప్పారు. ఇక ఆదృశ్యమవుతున్న చిన్నారుల సంఖ్య పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో అధికంగా ఉంది. గత సంవత్సరం బెంగాల్ లో అత్యధికంగా 12,455 మంది ఆచూకీ తెలియకుండా పోగా 11,352 మంది చిన్నారులతో మధ్యప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. 2021, 2020, 2019, 2018



సంవత్సరాలలో మాత్రం మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా బెంగాల్ ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. 2022లో కనిపించకుండా పోయిన వారిలో ఇప్పటి వరకూ ఆచూకీ దొరకని చిన్నారుల సంఖ్య విషయంలో కూడా పశ్చిమబెంగాల్ తొలి స్థానంలో, మధ్యప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నాయి. బీహార్, ఢిల్లీ రాష్ట్రాలలో కూడా అదృశ్యమైన పిల్లల సంఖ్య ఎక్కువగానే ఉంది.అత్యధికమంది మహిళలు అయినవారి చేతుల్లోనే లైంగికదాడికి గురవుతున్నారు. కంటికి రెప్పలా కాపాడాల్సిన వారే కాటేస్తుంటే.. బయటకు చెప్పుకుంటే పరువుపోతుందని నోరుళ్లను నొక్కేస్తున్నారు ఇంకొందరు. ఇల్లు మొదలు ఆఫీసు వరకు మహిళలకు ఎక్కడా రక్షణ లేకుండా పోతున్నదని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) నివేదిక వెల్లడించింది. 2022లో దేశవ్యాప్తంగా అత్యాచార కేసులు 96.6 శాతం నమోదయ్యాయి. 18–30 ఏండ్ల వారిపైనే అత్యధికంగా 21,063 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. మొత్తం 31,516 – 31,982 మంది బాధితులు ఉన్నట్టు ఎన్సీఆర్బీ తెలిపింది.

### తెలిసిన వారు.. బంధువులే అధికం...!

మహిళలపై జరుగుతున్న లైంగికదాడి కేసు లను పరిశీలిస్తే.. ఎక్కువగా తెలిసిన వారు, సహోద్యోగులు, యజమానులు. కుటుంబ సభ్యులు, బంధువులే వారిని నమ్మించి వంచి స్తున్నట్టు నివేదిక పేర్కొంది. 2,324 మంది కుటుంబ సభ్యుల చేతుల్లో లైంగికదాడికి గుర య్యారంటే ఆవేదన కలగకమానదు. వీరందరూ తమంతతాము బయటకు వచ్చి ఫిర్యాదు చేసినవారు. ఫిర్యాదు చేయనివారి సంఖ్య ఇంతకుమించి ఉండే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా గుర్తుతెలియని వ్యక్తుల చేతుల్లో 1,062 మంది లైంగికదాడికి గురయ్యారు. 2022లో నమోదైన 31,516 అత్యాచారకేసుల్లో 14,582 కేసులు స్నేహం, ప్రేమ, పెండ్లి పేరిట జరిగాయి. 248 లైంగికదాడి, హత్య/సామూహిక లైంగికదాడి కేసులు నమో దైనట్టు ఎన్సీఆర్బీ తెలిపింది. ఇదే కేటగిరీలో పెండింగ్ కేసులు కలిపి మొత్తం 464 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా 2022తెలంగాణలో 523 మంది అరెస్టు

2022లో తెలంగాణలో 814 లైంగికదాడి కేసులు నమోదు కాగా, 523 మంది అరెస్ట య్యారు. రాష్ట్రంలో నమోదైన మొత్తం కేసుల్లో 812 మంది తెలిసినవారి చేతిలో అఘాయి త్యానికి గురయ్యారు. మిగతా రెండు కేసుల్లో నిందితులు గుర్తుతెలియనవారే. అత్యాచార బాధితులను గుర్తించేందుకు, వారిలో చైతన్యం కల్పించేందుకు తెలంగాణ పోలీసు 'విమెన్ సేఫ్టీ వింగ్'ను ఏర్పాటు చేసింది. మహిళల కోసమే షీటీమ్స్, భరోసా సెంటర్లు, హ్యూమన్ ట్రాఫికింగ్, పని ప్రదేశాల్లో వేధిం పులు అరికట్టేందుకు 'సాహస్' వంటి వ్యవస్థలను విజయవంతంగా అమలు చేస్తున్నది. ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపుల వంటి ఫిర్యా దులు అందిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి పోకిరీల ఆటకట్టిస్తున్నారు.

**ఉరిశిక్ష వేయాలి**

"సమాజంలో మార్పు రావాలి, ఇలాంటి దాడులను అరికట్టేందుకు ప్రుల్లో అవగాహన పెరగాలి, పోక్సో యాక్ట్ కింద బాధితులకు న్యాయం చేసేలా చూడాలి. శిశు సంక్షేమ శాఖ, షీ టీమ్స్ భరోసా సెంటర్ సంయుక్తంగా కేసుల దర్యాప్తు చేయాలి. అత్యాచార బాధితుల వివరాలను స్థానిక కలెక్టర్ కి పోలీసులు అందించాలి. దీని వల్ల బాధితులకు నష్టపరిహారం అందుతుంది. చాలా కేసుల్లో బాధితులకు ప్రభుత్వ పరంగా అందే పథకాల గురించి తెలియదు. ఇలాంటి అత్యాచారాలకు పాల్పడే వారిని దోషులుగా తేల్చి ఉరిశిక్షలు విధించాలి."మన దేశంలో కూడా పురుషులతో సమానంగా మహిళలు, బాలికలు భాగస్వామ్యం అన్ని రంగాల్లో పెరగాలి. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో బాలికల పాత్ర కూడా ఉందని అందరూ గ్రహించాలి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పినట్లు "ఒక దేశ అభివృద్ధి, ఆ దేశ మహిళల అభివృద్ధి పైనే ఆధారపడి ఉంటుంది" అన్న మాటలు మరువరాదు. భారత్ అభివృద్ధి బాలికల అభ్యున్నతిపైనే ఆధారపడి ఉందని పాలకులు, ప్రజలు గ్రహించాలి.బాలికల అక్రమ రవాణా వంటి సమస్యల పరిష్కారం కోసం మరింత చిత్తశుద్ధితో పనిచే యాలి. జాతీయ బాలికా దినోత్సవం అంటే కేవలం ఓ పండుగగా కాకుండా పాలకులు దీన్ని బాధ్యత గా భావించాలి. నినాదాలను కేవలం ఉపన్యాసాలకే పరి మితం చేయకుండా ఆచరణలో పెట్టాలి. అప్పుడే బాలికల భవిత బాగుపడుతుంది.



- మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్సత్తా పార్టీ
రాష్ట్ర అధ్యక్షుడు


# పాలకులు వ్యవస్థలను గౌరవించాలి

ప్రజాస్వామ్యంలో వ్యవస్థలే కీలకం. అవి సక్రమంగా పనిచేసేలా పాలకులు చూడాలి. వ్యవస్థలను రూపొందించిన పాలకులు వాటిని నిర్వీర్యం చేయడమో లేదా వాటిని పనిచేయకుండా చేయడమో జరుగుతోంది. దేశంలో ఇలాంటి అనాగరిక చర్యలు అప్పుడప్పుడు జరుగుతున్నాయి. అయితే సకాలంలో కోర్టులు రంగప్రవేశం చేసి వ్యవస్థకు రక్షణగా నిలుస్తున్నాయి.

చట్టాలను పనిచేసుకునేలా చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి ఎపిలో గత స్థానిక ఎన్నికలకు సంబంధంచిన వ్యవహారమే నిదర్శనం. అధికారం ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లుగా ఆటలాడారు. రాజధాని మార్చడంతో సహా అనేక కార్యక్రమాలను చూస్తున్నాం. కోర్టుల చుట్టూ తిరిగారు. ఎన్నుకున్న ప్రభుత్వాలు ఖచ్చితంగా తమ విధులు నిర్వహించేలా రాజ్యాంగబద్ద వ్యవస్థ కావాలి. ఏప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వానికి కొమ్ము కాయడం, డబ్బాకొట్టడం అలవాటు చేసుకున్న అధికారులు రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతు న్నారు. చట్టానికి, న్యాయానికి విలువనివ్వక పోవడం అనేక సందర్భాల్లో చూశాం. తమకు అనుకూల విధానాలు అవలంబించాలన్న దుందుడుకు రీతిలో ఉండరాదని తెలుసుకోవాలి. ప్రజాస్వామ్యంలో అధికారం అన్నది ఓ వ్యవస్థ మాత్రమే. మిగతా వ్యవస్థలు ఉంటాయని వాటిని గౌరవించా లని గుర్తించాలి. పాలన అన్నది ప్రజల కోసమే అన్నది గుర్తెరగాలి. తమ అధికారంలో ఉంటూ.. తరవాతి తమవారు అధికారంలో ఉండేలా వ్యవస్థలను బలహీనపరిస్తే తగిన గుణపాఠం తప్పదని గుర్తించాలి. ఇంతకాలం రాజకీయ ప్రత్యర్థులను వెంటాడి వేధించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ఇప్పుడు స్వీయ విధ్వంసానికి పాల్పడుతున్నారా? అన్న అనుమానం కలుగుతున్నది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజధాని లేని రాజ్యంగా ఎపి మగిలింది. అనేక రంగాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. దేశానికి రైతులు ఆహార భద్రత అందిస్తుంటే, సైనికులు సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం గస్తీ కాస్తున్నారు. దేశంలో అన్నదాతలు ఆందోళన చేస్తున్న వేళ..వారిగురించి చర్చ చేయడం ద్వారా ప్రభుత్వం ఓ మంచి సందేశం ఇవ్వగలగాలి. నిపుణలతో చర్చించి వారికి ఎలా చేస్తే న్యాయం జరగగలదో ఆలోచన చేయాలి. అన్నదాతలను నిత్యం మననం చేసుకుంటున్న మనం వారికి న్యాయం చేసే విషయంలో ముందుండాలి. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులతో నష్టపోతున్నా పట్టించుకోవడం లేదు. గిట్టుబాటు ధరల కోసం ఏటా యుద్ధం చేయాల్సి వస్తోంది. రైతుల ఆత్మహత్యలను సీరియస్‌గా తీసుకోవాలి. పంటల వేళ వారికి మద్దతు ధరలతో అండగా నిలవాలి. కొన్న పంటలకు సకాంలో డబ్బులు చెల్లించే స్థితి ఉండాలి.


# అప్పుల భారం పట్టించుకోని పాలకులు

ప్రత్యేక తెలంగాణ ఏర్పడక ముందు నీళ్లు.. నిధులు.. నియామకాలు అంటూ ఊదరగొట్టిన కెసిఆర్..తన పాలనా కాలంలోతెలంగాణలో ఈ మూడు లక్ష్యాలు నెరవేరాయని, బంగారు తెలంగాణ అయ్యిందని ప్రకటించుకున్నారు. కానీ కొత్త ప్రభుత్వం వచ్చాక కానీ తెలియలేదు.. తెలంగాణను అప్పుల కుప్పగా చేశారని..తెలంగాణ అంతా బంగారుమయం అయ్యిందన్న భావనలో ప్రజల్లో భ్రమలు కల్పించారు. అడక్కుండానే కాళేశ్వరం కట్టి అది ప్రజలకోసమే అన్నారు. అలాగే ఉచిత విద్యుత్ దుబారాను అరికట్ట లేదు. రైతుబంధు ముసుగులో వేలకోట్ల దుర్వినియోగాన్ని ఆపలేదు. దళితబంధు పేరుతో వందలకోట్లు పంచిపెట్టేశారు. రూపాయికే కిలో బియ్యం పథకం దుబారాను ఏ ప్రభుత్వం కూడా అరికట్టడం లేదు. కాంగ్రెస్ కూడా దీనిని కదుపుతుందా లేదా అన్నది చూడాలి. రైతులు గిట్టుబాటు ధరలు కావాలన్నా..ధాన్యం కొనుగోళ్లు చేయాలన్నా సవాలక్ష కొర్రీలు పెడుతున్నారు. అంటే పథకాలన్నీ ఓట్లను రాల్చేలా ప్రవేశ పెట్టడం నేర్చుకున్నారు. ధనిక రాష్ట్రం కాస్తా ఇప్పుడు అప్పుల ఊబిలో మునిగిందని తెలుసుకునే వరకు సమయం మించిపోయింది. ఉచిత పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా పాలకులు మేల్కోవడం లేదు. ఇక్కడ కెసిఆర్, ఎపిలో జగన్ చేతికి ఎముక లేదన్న చందంగా అటుఇటుగా ఒకే తరహా పథకాలతో ప్రజల్లో దానకర్ణుడిలా పోజులు పెడుతున్నారు. ప్రత్యేక విమానాల్లో విహరించడం మొదలు అధికారం కోసం ప్రజల డబ్బును నీళ్ల ప్రాయంగగా ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల్లో లబ్ది కోసమే దళితబంధు పథకాన్ని ప్రారంభిం చారు. దళితబంధు మాత్రమే కాదు.. రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్తు, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్లు, పంటరుణాల మాఫీ, రైతుబీమా.. కిలో రూపాయికే బియ్యం వంటివన్నీ ఉచిత పథకాలే. ఎన్నికల సందర్భాల్లోనో, ఇతర రాజకీయ పరిస్థితుల్లోనో ప్రజలను ఆకర్షించేందుకు కేసీఆర్ ఇచ్చిన హామీల మేరకు అమలు చేస్తున్నవే. వీటిలో అనుత్పాదక ఉచిత పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఇప్పటికే రాష్ట్ర





అప్పులు దాదాపుగా మూడు ఆరు లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఉచిత పథకాల నిధుల భారంతో భారం తడిసి మోపెడు అవుతోంది. నగదు బదిలీలు అంతాఇంతా కాదు. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా వేల కోట్ల రూపాయలతో కొత్త కొత్త పథకాలు తెరమీదకు తెస్తోంది. కేసీఆర్ రాక ముందు కూడా రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు ఉన్నాయి. వాటికి కేసీఆర్ జోడించిన కొత్త పథకాల బరువు ఏటా రూ.45 వేల కోట్ల పైమాటేనని లెక్కలు చెబుతున్నాయి.. రైతులకు పెట్టుబడి సాయం చేయాలన్న ఉద్దేశంతో 'రైతుబంధు' పథకాన్ని ప్రవేశపెట్టారు. ఎకరానికి రూ.10 వేలు ఇచ్చారు. ఏడాదికి రూ.14 వేల కోట్లకు పైగానే ఖర్చవుతోంది. దీనికి ఎలాంటి పరిమితులు విధించకపోవడంతో వేలకోట్లు దుబారా అయ్యాయి. వందల ఎకరాలున్న ఆసాములు కూడా ఆర్థిక సాయానికి అర్హు లే అన్నట్లుగా పథకం సాగింది. పరిమితి విధించాలంటూ చాలాకాలం నుంచి డిమాండ్లు ఉన్నా పట్టించుకోలేదు. మంత్రి మల్లారెడ్డి కూడా తనకు 600 ఎకరాలున్నాయంటూ ప్రకటించారు. ఇలాంటి మోతుబరి కూడా రైతుబంధును మెక్కేశారు. రైతుబంధును ఎలాగైనా ముందుకు నడిపించే పట్టుదలలో వ్యవసాయ రంగానికి సంబంధించిన ఇతర సబ్సిడీ పథకాలను కొండెక్కించి, రైతు బంధుకు మళ్లించారు. ఉచిత విద్యుత్ భారం ప్రభుత్వంపై పలు రెట్లు పెరిగింది. 10 బోర్లు ఉన్న పెద్ద రైతులకు కూడా ఉచి త విద్యుత్తు అందించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్న ఉదయి స్తోంది. పేద యువతుల పెళ్లిళ్ల కోసం కల్యాణలక్ష్మి కింద ఏటా 3 వేల కోట్లు ఖర్చు పెడుతున్నారు. దళితబంధు మరో ఉచిత నగదు పంపిణీ పథకంగా చూడాలి. ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల నగదును పంపిణీ చేసారు. పథకాల కోసం చేస్తున్న అప్పులు, వడ్డీల సంగతి సరేసరి. దాంతో ఇతర పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు డబ్బులకు కటకట ఏర్పడింది. దీనికితోడు నిరుద్యోగ సమస్య వెన్నాడుతోంది. కిలో రూపాయి బియ్యం పథకం, రైతుబంధు తదితర పథకాలను తక్షణం సమీక్షించాల్సిన సమయం ఆసన్నమైంది. లేకుంటే మరింత ఆర్థిక బారం తప్పేలా లేదు.



## మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు కొరకు కృషి చేస్తా: బండి రమేష్

**కూకట్‌పల్లి, వెలుతురు:** మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు కొరకు తన వంతు కృషి చేస్తానని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు.
మంగళవారం బాలానగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్నూరు కాపు సంఘం, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తెల్ల హరికృష్ణ, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఆకుల బాలకృష్ణ, కూకట్ పల్లి నియోజకవర్గం అధ్యక్షులు బాశెట్టి నర్సింగ్ రావు, కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ "బి బ్లాక్" అధ్యక్షులు తూము వేణు బండి రమేష్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ సానుకూలంగా స్పందించి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు, శేరే సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందించిన వి.జగదీశ్వర్ గౌడ్


**శేర్లింగంపల్లి, వెలుతురు:** హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని సెవెన్ హిల్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీ సభ్యులుగా నియమించబడిన కొమరనేని లక్ష్మీనారాయణ, సూర్య సత్యనారాయణ రాజు, గోగినేని వంశీకృష్ణ, యార్లగడ్డ సుశీల, పోలూరు రవీంద్రనాథ్ రెడ్డి, దొడ్ల బ్రహ్మానంద గౌడ్, సదా శ్రీనివాస్ లకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ నూతన కమిటీ నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం



గౌడ్,కావూరి ప్రసాద్,వెంకటేష్,నాగయ్య,దగ్గిపాటి,వాసు,రామకోటేశ్వర రావు,శ్రీనివాస్ రావు,రాజేందర్ ప్రసాద్,వెంకట్ రావు,కొఠారి వెంకట్,ఎస్.వి రావు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్ముడి మార్గం అనుసరణీయం

**కూకట్‌పల్లి, వెలుతురు:** మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం 5వ ఫేజ్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు జీ.వి. వెంకటేశ్వరరావు( రిటైర్డ్ మిధని ఇంజనీర్) గాంధీ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతిపిత ఆశయాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహాత్ముని



మార్గం యువకులకు ఆదర్శనీయమని అహింసా మార్గంలో పరదేశిలను పాలన నుంచి ముక్తి కలిగించిన మహనీయుడు అని సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి యావత్ భారత జాతికి స్వేచ్ఛను అందించిన వ్యక్తి జాతిపిత మహాత్మా గాంధీ అని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కోఆర్డినేటర్ కొల్లా శంకర్ , వేముల మహేష్ , డివిజన్ ప్రెసిడెంట్లు కలిగినిడి ప్రసాద్ , సాలాది శంకర్, సిరిగి నీడి హరీష్ జనసైనికులు నవీన్ శ్రీనివాస్ గోవిందా , వెంకటస్వామి, అశోక్ , రాము , సుబ్బు, మధు సుధన్ రెడ్డి, సమ్మెట నరేంద్ర , సురేష్, శేఖర్ , రంగబాబు , సుబ్బారావు ,మహిళలు ముంతాజ్ మహాలక్ష్మి, సత్యా, లక్ష్మి , ద్రాక్షాయిని మరియు జనసేనసైనికులు , వీర మహిళలు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి ఎంపిడిఓను సన్మానించిన సామాజిక కార్యకర్తలు

**శంకర్‌పల్లి జనవరి 30 (వెలుతురు):** జిల్లాస్థాయిలో ఉత్తమ మండల అభివృద్ధి అధికారిగా అవార్డు పొందిన సందర్భాన్ని పురస్కరించుకొని శంకర్పల్లి సామాజిక కార్యకర్తలు కలసి ఎంపీడీవో వెంకయ్యని ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. శంకర్పల్లి



మండలానికి జిల్లాస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చినందుకు మాకు ఎంతో గర్వంగా ఉందని సామాజిక కార్యకర్తలు పౌరులు తెలియజేశారు.

## తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**వెలుతురు న్యూస్ నారాయణపూర్:** నారాయణపురం మండల కేంద్రంలోని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ను రజక వృత్తిదారుల సంఘం మండల కన్వీనర్ రాచకొండ రమేష్ బాబు చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది.
ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రజక వృత్తిదారులు ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మన రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని రజకులు ఎన్నో ఎళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్నారని వెట్టిచాకిరి చేస్తున్నారని కావున రజకులు అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్ లోవెయ్యి కోట్లు రూపాయలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా విద్య ఉద్యోగ రంగాలలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.
ఈ కార్యక్రమంలో రజక రిజర్వేషన్ సమితి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ వెంకటేశ్వర రజక సహకార సంఘం అధ్యక్షులు ఉప్పల వెంకటేష్, రజక సంఘం గౌరవ సలహాదారు ఉప్పల ఆంజనేయులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏపూరి



సతీష్, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ,మాజీ వార్డ్ మెంబర్ ఉప్పల శ్రీను, రజక సంఘం మండల నాయకులు ఉప్పల రాజయ్య, ఏపూరి గోపాలు,పున్నం రాములు, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్ముడి సిద్ధాంతము అహింసావాదమే దేశానికి శ్రీరామరక్ష

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

**కూకట్‌పల్లి, వెలుతురు:** కుల మాతాలకు అతీతంగా సర్వజనహితమే మతమన్న జాతిపిత మహాత్మ గాంధీ చిరస్మరణీయులని పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం కొనియాడారు. జాతి పిత మహాత్మా గాంధీ 76 వ వర్ధంతి సందర్బంగా మంగళవారం కూకట్ పల్లి నియోజకవర్గం కేపీహెచ్ బి రోడ్ నెంబర్ వన్ లో బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంలు ముఖ్య అతిధులుగా హాజరై మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ భారత దేశ చరిత్రను తిరగరాసి, భారత దేశ చరిత్రను ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహెూన్నతమైన వ్యక్తి మహాత్ముడని, సత్య గ్రహ దీక్ష చేసి మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి, బానిస సంకెళ్ళ నుంచి విముక్తి చేసిన మహాత్ముడు అహింసావాదంతో ఎంతటి కఠిన లక్ష్యాన్నైనా ప్రపంచానికి నూతన పోరాట ఒరవడిని నేర్పించి సమస్త విశ్వానికి శాంతి సందేశం ప్రబోధించిన జాతిపిత అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడిన మహెూన్నత వ్యక్తి అని, మహాత్ముడి సిద్ధాంతమే దేశానికి శ్రీరామరక్ష అని అన్నారు. ఈ



కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కేపీహెచ్ బి డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్, అల్లాపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహా యాదవ్, సాదు ప్రతాప్ రెడ్డి, ఫణి కుమార్, ప్రకాష్ ముదిరాజ్, రంగ స్వామి, శివ, బాలరాజు, మహిళా అధ్యక్షులు మారుతి, రజిత, భారతమ్మ, జోజమ్మ, జ్యోతి, సంధ్య, కర్రెమ్మ, వాణి, బుజ్జి, అనిత, శ్యామల కుమారి, పవన్, ఉదయ్, శ్రీకాంత్ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ చేసిన రిటైర్డ్ విద్యుత్ శాఖ ఉద్యోగి అంజయ్య

**జహీరాబాద్, 30 జనవరి, వెలుతురు :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దిగ్వాల్ గ్రామంలో మంగళవారం 9వ తరగతి విద్యార్థులకు వారి ఉపయోగార్థంద"ఇంగ్లీష్ –తెలుగు" డిక్షనరీలను విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీరుగా పనిచేసి ప్రస్తుతం విశ్రాంత జీవితాన్ని గడుపుతున్నా అంజయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో నివసిస్తు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ సేవ చేస్తున్నారు. దిగ్వాల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కూడా కావడం విశేషం. వీరితోపాటు రిటైర్డ్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ విప్లవ రెడ్డి రంజోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాబర్ట్ లింకన్, సామాజిక సేవ కార్యకర్త సుదర్శన్ బండారి హాజరయ్యారు. విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయకూడదని, బాగా కష్టపడి ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇకముందు కూడా చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారి యొక్క ఉన్నత చదువుల కోసం తన వంతు పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని అంజయ్య తెలియజేశారు. సామాజిక సేవా కార్యకర్త సుధీర్







భండారి విద్యార్థులు కూర్చోవడానికి పాఠశాలకు 10 కార్పెట్లను ఇస్తానని తెలియజేశారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ డిక్షనరీలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వాటిని విద్యార్థులు ఉపయోగించుకొని విద్యలో ప్రగతి సాధించాలని కోరారు. డిక్షనరీలను అందజేసిన అంజయ్య కార్పెట్స్ ఇస్తానన్న సుధీర్ బండారి లు విద్యార్థులకు చేయూత నివ్వడం ఎంతో హర్షించదగిన విషయమని దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ కుమార్, ఎం. మహేశ్వర్ బి, జయరాజు, డి. రవీందర్, కే.భార్గవి, మమత, అహ్మద్ హసీహుద్దీన్ వికార్, శ్రీనివాస్ డాక్టర్ కే. వసంత రాజు ఎం.డి. భద్రోద్దీన్, బి.లలిత, విజయలక్ష్మి, కల్పన, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.





### తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల (బాలుర)

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన

**జహీరాబాద్, 30 జనవరి, వెలుతురు :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామంలో గల తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సూరి కృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవడంతో పాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉంద





న్నారు. తమకు ఎదురైన సమస్యలను పరిష్కరించుకునేందుకు కొంతవరకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఫోక్సో సమాచార హక్కు మోటార్ వాహనాల బాల కార్మిక నిర్మూలన బాల్య వివాహాల నిరోధక, జువైనై ల్ యాక్ట్, ఉచిత న్యాయ సేవ సహాయంపై విద్యార్థులకు న్యాయ మూర్తి అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, బాల కార్మికులు గుర్తిస్తే స్థానిక తహసిల్దార్ లేదా పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదా ఒక 1098కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.
బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి సోలోమాన్, సంతోష్ కుమార్ సాగర్, న్యాయ వాదులు గోపాల్, సందీప్ కుమార్, మానిక్ పాటిల్, గురు రాజ్ కులకర్ణీ, పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్స్ జే .రాములు, కే.ఎస్ .జమీల్, కాలేజీ కోఆర్డీనేటర్ డి.నాగార్జున, ఎన్. డి.ఎ ఇంచార్జ్ ఇబ్రాహీం, డిప్యూటీ వార్డెన్ సమీయుద్దీన్ డీఈవో ఇర్ఫాన్, పీఈటీ, పీడీ, కాజీమ్, మజీద్, స్టాఫ్ నర్స్ సోలోమాన్, ఇమ్రాన్, పీసీఈ ఫయాజ్, ఓ.ఎస్. మునజ్జీర్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పార లీగల్ వాలంటీర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## వైభవంగా రేణుక మాతా అభిషేకం

**కొల్చారం, జనవరి 30 (వెలుతురు న్యూస్):** ఆదిశక్తి, పరాశక్తి అమ్మా రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో అందరు చల్లగా ఉండాలని గౌడ సంఘం సభ్యులు కోరుకున్నారు. అమ్మను నమ్ముకుని చేసిన పనులు సత్ఫలితాలనిస్తాయని పేర్కొన్నారు. మండల కేంద్రం కొల్చారంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తృతీయ వార్షికోత్సవము అనంతరం 5వ మంగళ వారం నాడు శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సంఘం సభ్య లచే శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అభిషేక,అలంకరణ, అర్చన కార్యక్రమం నిర్వహించగా చల్లూరి కృష్ణ శర్మ, సాగరికల మంత్రోచ్ఛహరణల మధ్య ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .ఈ కార్యక్రమంలో ప్రభాకర్,జూలకంటి సంఘమేశ్వర్,రామకృష్ణ గౌడ్ ,యాదగౌడ్ , రాము,అరుణ్ గౌడ్ ,సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్,శేఖర్, సురేష్,సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## గ్రామస్థాయి నుంచి బిజెపి పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి

**- కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి**

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 30 :**
మెదక్ జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం శంకరంపేట్... గ్రామస్థాయి నుంచి భారతీయ జనతా పార్టీ పటిష్టత కోసం నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇంచార్జ్ కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు.. మంగళవారం సాయంత్రం పెద్ద శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను గ్రామాలలో ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు.. జహీరాబాద్ పార్లమెంటుపై భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ప్రభాది బద్దం మహిపాల్ రెడ్డి.. నారాయణఖేడ్ నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్ సంగప్ప..మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ..పేట మండల బిజెపి అధ్యక్షులు కోణం విట్టల్ నియోజకవర్గం నాయకులు రజనీకాంత్.. పట్నం మాణిక్యం.. మండల నాయకులు శ్రావణ్ కుమార్.. బుగుదాల కృష్ణ.. మంగలి కృష్ణ అనిల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి చేకుముఖి పోటీల్లో శ్రీ గాయత్రి ఇంగ్లీషు మీడియం విద్యార్థుల ప్రతిభ

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 30:**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలోని స్థానిక జెడ్పిహెచ్ఎస్ పాఠశాల లో నిర్వహించిన మండల స్థాయి చేకు ముఖి పోటీల్లో మంచి ప్రతిభ కనపరచి మొదటి బహుమతి సాధించిన శ్రీ




గాయత్రి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు వీరికి బహుమతి ప్రదానం చేసిన నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ కుమార్, ఈ కార్యక్రమని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో సైన్స్ యొక్క ఉపయోగం మన జీవితంలో ఎంతో అవసరం అయింది సైన్స్ మనకు ఒక్క కొత్త జీవన విధానం నేర్పుతుంది అని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మన్మథ కిశోర్, ఎగ్జామ్ ఇన్చార్జ్ రాములు, పి ఈ టి ఏ టీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మారుతి, నర్సింలు, గురునాథ్, రవి, అబ్దుల్ సాజిద్, ప్రశాంత్ కొందరు కార్యక్రమానికి పాల్గొన్నవారు.

## దొడ్డి కొమురయ్యకు విగ్రహానికి కురుమ సంఘం అధ్యక్షులు పూలమాల కార్యక్రమం

**తాలూకా కురుమ సంఘం ఉపాధ్యక్షులు మలుగొండ**

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 30:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్లో దొడ్డి కొమరయ్యకు పూలదండ ఎయ్యడం జరిగింది పార్థిక దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమంలో తాలూకా కురుమ సంఘం ఉపాధ్యక్షులు మలుగొండ యూత్ అధ్యక్షుడు కాంసెన్సీ లోన్డే నరసింహులు కార్యదర్శి తాలూకా నవనాథ్ కాకి జన్వాడ పెద్దలు మనూర్ మండల్ అధ్యక్షుడు ముద్దా మల్లేశం మండల్ నరసన్న నర్సాపూర్ యాదవ సంఘం అధ్యక్షుడు



నారాయణ గారు పగిడిపల్లి నర్సిగొండ తుర్కపల్లి విట్టల్ లక్ష్మణ్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు మూడో వార్షిక దినోత్సవం దొడ్డి కొమరయ్య అమర హై.

## సహాయం

అనగనగా నాగపూర్ అనే గ్రామంలో సింధు, అక్షయ అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వారిద్దరికీ చదువుకోవడం అంటే చాలా ఇష్టం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉండడం మూలంగా పై చదువులకు వాళ్ళు పదవ తరగతి చదవడం కోసం పొరుగు గ్రామం రామయంపేటకు వెళ్లేవారు. అలా వారు వెళుతున్న సమయంలో దారిలో కొన్ని జంతువులు ఆకలికి చనిపోయేవి. ఒకరోజు వాళ్ల ముందు ఒక పక్షి అలమటిస్తూ కొట్టుకొని చనిపోయేవి.

ఇద్దరు మనసు చాలా కలత చెందింది. ఎలాగైనా ఈ సమస్య పరిష్కారం కావాలని చాలామందికి చెప్పారు. కానీ ఎవరూ పట్టించుకోపోయేసరికి సింధు, అక్షయ లు మాత్రం ఎలాగైనా పక్షులను రక్షించాలని పట్టుదలతో ఉన్నారు. ఇద్దరు కూడా ప్రతిరోజు దారిలో ఒక మొక్క నాటుతూ పాఠశాలలో మిగిలిన ఆహారం వెళ్ళేటప్పుడు దారిలో పక్షులకు వేసేవారు. అలా చేయడం మూలంగా కొద్ది రోజుల్లో పక్షులు చనిపోవడం మార్పు జరిగింది.

సింధు, అక్షయలు అలా భోజనం పక్షులకు వేయడం చెట్లు నాటడం మొదట ప్రజలు వ్యతిరేకించిన నెమ్మదిగా వారి మనసును తెలుసుకున్నారు. ఈ విషయం సర్పంచ్ చంద్రయ్య తెలుసుకొని వందల కొద్ది చెట్లు నాటించి ప్రతిరోజు పక్షులకు కొంత ఆహారం వేయించేవాడు. బాగా కురిసిన వర్షానికి చెట్లు పెద్దగాయి కాయలు, పండ్లు ఉండడం మూలంగా పక్షులు వాటిని తిని జీవించసాగాయి. పెద్దగై మంచి ఉద్యోగాల్లో ఉన్న సింధు, అక్షయలు తమ గ్రామం వెళ్ళినప్పుడు దారిలో ఉన్న చెట్లను చూసి సంబరపడేవారు. వారు కూడా అప్పుడప్పుడు చెట్టు నాటుతూ స్ఫూర్తిగా నిలిచేవారు.



**- యస్. రేణుక**
**ఎనిమిదవ తరగతి**
**ZPHS హవేలీ ఘనపూర్**
**మెదక్ జిల్లా, 6302411016**

## జగదీశ్వర్ గౌడ్ సూచనతో ప్రజా సమస్యలపై రామకృష్ణ నగర్‌లో పర్యటించిన విద్య కల్పన ఏకాంత్ గౌడ్..

**వివేకానంద నగర్, వెలుతురు:**
శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ సూచన తో నాయకులు విద్య కల్పన ఏకాంత్ గౌడ్ మంగళవారం వివేకానంద నగర్ డివిజన్ లోని రామకృష్ణ నగర్ లో ప్రజా సమస్యలపై పర్యటించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రోడ్డు నెంబర్ 17 లో బండ రాళ్లను తొలగించి, రోడ్డును అందుబాటులోకి తేవాలని కోరారు. రిక్షాపూలర్స్ కాలనీ రోడ్డు నెంబర్ 19 లో డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుందని పురాతన పైపు లైన్ తొలగించి 1 ఫీట్ పైపు లైన్ వేయాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ఏకాంత్ గౌడ్ మాట్లాడుతు స్థానికులు తెలియజేసిన సమస్యలను నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు నాగరాజు, నవీన్, పల్నాటి అశోక్, బస్తి వాసులు నారాయణ, తీప్ప



శేఖర్, భూప్పమ్మా, సత్యనారాయణ, జంగయ్య, ఇందీరమ్మ, ఎస్. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి జడ్పీ చైర్మన్‌పై దాడిని తీవ్రంగా ఖండించిన సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్

**సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్ రోజా రాధాకృష్ణ శర్మ**

**సిద్దిపేట టౌన్ వెలుతురు జనవరి 30:** సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు క్యాంప్ కార్యాలయం లో జిల్లా పరిషత్ చైర్మన్ రోజా రాధాకృష్ణ శర్మ రాష్ట్ర పార్టీ కార్యదర్శి రాధాకృష్ణ శర్మ నాయకులు ఎల్లారెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు మీడియా సమావేశం నిర్వహించారు..
- ఈ సందర్భంగా మాట్లాడుతూ భువనగిరి జడ్పి చైర్మన్ పై దాడిని తీవ్రంగా ఖండిచారు...
- అధికార మదంతో ఆటవికంగా ప్రవర్తిస్తున్నా మంత్రి...
- భోనగిరి జడ్ పి చైర్మన్ సందీప్ రెడ్డి పై జరిగిన దాడి ఆయన ఆటవిక ప్రవర్తనకు తార్కాణం
- రక్షించాల్సిన పోలీసులు సందీప్ రెడ్డిని నెట్టేయ్యడం దారుణం అత్యుత్సాహం ప్రదర్శించిన రాచకొండ పోలీసులపై డిజిపి చర్యలు తీసుకోవాలి మంత్రి హోదాలో ఇంతటి ఆటవికంగా ప్రవర్తించండం దుర్మార్గపు చర్య కాంగ్రెస్ అంటే దాడుల సంస్కృతి అని మరో సారి నిరూపితం అయింది కాంగ్రెస్ అధికారం లోకి వస్తే దాడులు, కొట్లాటలు అని ముందే ఊహించాము అందుకు నిదర్శనం ఈ సంఘటనలు పదేళ్ల బి ఆర్ ఎస్ పాలన లో కాంగ్రెస్ వాళ్ళ పై కానీ ప్రతి పక్షాల పై కానీ మేము దాడులు చేయాలె అలాంటి సంఘటనలు ఎక్కడ జరగలే... కానీ వచ్చిన నెల రోజుల్లో నే దాడులు, హత్య రాజకీయాలు చేస్తున్నారు అధికార కార్యక్రమాల్లో అది పత్యం హామీలు అమలు అడిగితే దాడులు తిట్లు ఇదేనా కాంగ్రెస్ సంస్కృతి
- బి ఆర్ ఎస్ ప్రభుత్వం లో ఎమ్మెల్యే లు మంత్రులు హుందాగా వ్యవహరించారు కానీ ఈ ప్రభుత్వం లో మంత్రులు గుండాల్లా వ్యవహరిస్తున్నారు.. ఇది ప్రజా స్వామ్యానికి చెంపపెట్టు
- మొన్నటి కి మొన్న కొండా సురేఖ పల్లా రాజేశ్వర్ రెడ్డి ని అవమాన పరిచారు నిన్న కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి జడ్పి చైర్మన్ ను ఒక కేబినేట్ హోదా లో ఉన్న వ్యక్తి పై దాడులు



దురుసు గా ప్రవర్తించారు అవమాన పరిచారు అంతటి అహంకారం ప్రజాక్షేత్రంలో పనికి రాదు
మంత్రి హోదాలో బుద్దిగా ఉంటారని ప్రజలు ఆలోచించారు హామీల అమలుకు ప్రజలు నిలదిస్తుంటే అసహనం తోటే విపక్షాల మీద దాడులు చేస్తున్నారు
- రైతు బంధు అడిగితే చెప్పుతో కొట్టండి అన్న నోరే చేతులతో నెట్టేదాకా చేరింది..
- ఇదే నా కాంగ్రెస్ ప్రభుత్వ సంస్కృతి
మీ గ్యారంటీలు అమలు చేయక పోతే మీకు త్వరలోనే ప్రజలు వారంటీ ప్రకటిస్తారు కరెంట్ కోతలు మొదలు అయ్యాయి ప్రజలు వాతలు పెట్టె రోజులు దగ్గర పడ్డాయ్... గుండా రాజకీయాలు వద్దు ప్రజల అభీష్టం మేరకు పనిచేయాలి ప్రజల మనోభావాలు కించ పరచే విధంగా మంత్రులు వ్యవహారం రాబోయే రోజుల్లో మహిళ ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి చర్యలు జరిగే ప్రమాదం ఉంది
తెలంగాణ రాష్ట్రం 10 ఏండ్లలో ఎప్పుడు ఇలా వ్యవహారం చేయలేదు
నాయకులకు కాంగ్రెస్ హయాంలో రక్షణ లేదు
జడ్పి చైర్మన్ కు బహిరంగ క్షమాపణ చెప్పాలి ఇచ్చిన హామీలను గుర్తు చేయడం తప్పు కాదు కదా
రేవంత్ ఇచ్చిన హామీలను అడగడం తప్పు కాదు ఆయన మాటలను గుర్తు చేశారు
జడ్పి చైర్మన్ సందీప్ రెడ్డి మీద జరిగిన దాడిని ప్రజలు గుర్తించారు కాంగ్రెస్ గుండా రాజకీయాలు కొత్త సంస్కృతి తో ప్రయత్నం చేస్తోంది పోలీసులతో క్యాబినెట్ స్థాయి జడ్పి చైర్మన్ ను నెట్టివేయడం సబబు కాదు పోలీసులు అమనుసుషంగా నెట్టివేయడం తగదు డిజిపి కలిసి పోలీసుల మీద పిర్యాదు చేస్తాం హామీలను అమలు చేయాల్సిన బాధ్యత మీ మీద ఉంది విమర్శిస్తే ఊరుకోం ప్రజలకు సేవ చేస్తూ జడ్పి చైర్మన్ ఉన్నారు
ఆయన పట్ల మంత్రి కోమటిరెడ్డి వ్యవహారం దారుణం ప్రజలు పెట్టిన భిక్ష మీకు కూడా అప్పుడే అధికారం వచ్చింది.





## అర్జున్ నాయక్ తాండ, మూడ్ తాండలలో ఘనంగా 24వ పాత పంటల జాతర

**గత 23 సంవత్సరాల నుండి పాత పంటల జాతర్లను నిర్వహిస్తున్నాం**
**మన తిండి మన చేతిలో ఉండాలి....మన దేశీ విత్తనాలు మన చేతిలో ఉండాలి**
**బయటి తిండి తినడం వల్ల అనేక రోగాలకు గురవుతున్నారు**
**యన్.వినయ్ కుమార్, జాతర కో-ఆర్డినేటర్**

**జహీరాబాద్, 30 జనవరి వెలుతురు :**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని అర్జున్ నాయక్ తాండా, మూడ్ తాండాలలో 24వ పాత పంటల జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సవిత బాయి బండ్లకు పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించినారు. ఈ బండ్లు తాండలోని విధి విధిలలో గిరిజన నృత్యలతో, ఆట పాటలతో బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా యన్. వినయ్ కుమార్, జాతర కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ గత 23 సంవత్సరాల నుండి పాత పంటల జాతర్లు చేసున్నాము. మన తిండి మన చేతిలో ఉండాలి, మన దేశీ విత్తనాలు మన చేతిలో ఉండాలి, బయటి తిండి తినడం వల్ల అనేక రోగాలకు గురైతున్నారు. చిన్న వయస్సులోనే బి.పి, షుగర్, కిడ్నీ సంబంధిత రోగాలు, గుండే పోటు వంటి రోగాలు వస్తున్నాయి, ఎందుకంటే ఎక్కువ రసాయన మందులు వేసి పంటలు పండించడం వల్ల తిండి కలుషితం అవుతుంది. భూమికి కూడా నష్టం వస్తుంది. చిరుధాన్యాలు పండించుకోవడం ద్వారా మనకు మంచి తిండి దొరుకుతుంది, భూమిని మరియు వాతావరణాన్ని కాపాడిన వారమౌవుతాము, అంతే కాకుండా పశువులకు మేత కూడా లభిస్తుంది. ఈ చిరుధాన్యాలకు ప్రభుత్వం మార్కెట్ కలిపించాల్సిన అవసరం ఉంది, ఈ విషయం గురించి సర్పంచ్లు గ్రామ సభల్లో మాట్లాడాలి. ఈ చిరుధాన్యాల పంటల సాగు విస్తీర్ణం పెంచుకోవాలి దీని వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో మాట్లాడి ఒక ప్రణాళిక రూపొందించుకోవాలి, ఈసారి పత్తి, సోయా పెట్టిన రైతులు నష్టపోయినారు. ఈ తాండల్లో విరుధాన్యాలు 25 నుంచి 30 రకాల వరకు పెట్టినారని తెలిపారు. పారు నాయక్, రైతు మాట్లాడుతూ మా తాండలో చిరుధాన్యాలు అంటే మాకు చాలా ఇష్టం. ఈ పంటలు పండించుకోవడానికి డిడియస్ సంస్థ మాకు కలుపు లాగోడికి ఆర్థిక సహాయం చేస్తుంది అన్నారు. పొందిబాయి, రైతు మాట్లాడుతూ మేము ఈ చిరుధాన్యాలను 25 నుంచి 30 రకాల పంటలు వేస్తున్నాము. కాని రెండు సంవత్సరాల నుండి వాతావరణం సహకరించక పంటలు సరిగా రాలేదు, కాని మేము ఎక్కువ రకాల పంటలు వేయడం వల్ల మాకు కొన్ని రకాల పంటలు వస్తున్నాయి అన్నారు. అమిర్రి బాయి, రైతు మాట్లాడుతూ మా తిండి మా చేతిలో ఉంది. మా విత్తనాలు మా చేతిలో ఉన్నాయి. ఆకు కూరలు మా చేతిలో ఉన్నాయి. ఈ చిరుధాన్యాల తిండి చిన్న పిల్లలకు అందరు అలవాటు చేయాలి అని తెలిపినారు. రాజీ బాయి, రైతు మాట్లాడుతూ ఎనుకటి నుండి మా తాతలు వ్యవసాయం చేసే వారు, ఇప్పుడు మేము కూడా చేస్తున్నాము. ఈ వ్యవసాయము మా కోడండ్లు కూడా చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం నుండి మార్కెట్ సదుపాయం కలిపించాలి మరియు మద్దతు ధర కూడా ఇవ్వాలి అన్నారు. ఇప్పుడు చిన్న పిల్లలు, యుక్త వయస్సు పిల్లలు, ఈ పంటలు తెలుపకుండే, ఇప్పుడు డిడియస్ సంస్థ మా ఊరిలో ఈ చిరుధాన్యాలపై పని చేయడం వల్ల ఈ పంటల విలువ తెలుస్తుంది, ఈ వంటలు తింటున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో డిడియస్ గ్రామ సూపర్వైజర్ టీ, మంజుల మరియు డిడియస్ సిబ్బంది చుక్కమ్మ, పూలమ్మ, చిన్న నర్సమ్మ, జనరల్ నర్సమ్మ, లక్ష్మమ్మ, అల్లోల్ నర్సమ్మ, చంద్రమ్మ, వినయ్కుమార్, శ్రీలయ, బింధు, ఎల్లియా మరియు గ్రామానికి చెందిన రైతులు, డిడియస్ మహిళా సంఘం మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ జాతరను సుమారు 1800 మంది తిలకించారు.

## జాతిపితకు నివాళులర్పించిన ఎమ్మెల్యే మాణిక్ రావు

**జహీరాబాద్, 30 జనవరి, వెలుతురు:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములోగల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి, తద్వారా జాతి నిర్మాణానికి మహాత్మా గాంధీ అందించిన అమూల్యమైన సేవలు, చేసిన త్యాగాలు అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, యువ నాయకులు మిథున్ రాజ్, మాజీ కౌన్సిలర్ లు మోతి రామ్, రాములు నేత,అబ్దుల్లా, యూనిస్, జహంగీర్, బండి మోహన్, బి ఆర్ ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## హలో బిసి చలో ఢిల్లీని
# విజయవంతం చేయాలి

### బీసీ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కొమ్ము ఉమేష్ యాదవ్

**సిద్దిపేట టౌన్ వెలుతురు జనవరి30:**
ఫిబ్రవరి 5,6 తేదీలలో జరగబోయే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని BC సంగం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొమ్ము ఉమేష్ యాదవ్ మాట్లాడుతూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో పార్లమెంటు ముట్టడి జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమానికి లక్షలాదిమందిగా తరలిరావాలని చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అలాగే ఎస్సీ ఎస్టీ బీసీ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రుత్వ శాఖ ఏర్పాటు చేయాలని జనాభా గణనలో బీసీ కుల గణన చేయాలని దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని గవర్నమెంట్ సంస్థలో ప్రైవేటీకరణ నిషేధించాలని బీసీ క్రిమిలేయర్ ను ఎత్తివేయాలని బడ్జెట్లో బీసీలకు 5లక్షల కోట్లు కేటాయించాలని బీసీలంట్లే కేవలం ఓట్లు వేసే యంత్రాలుగనే చూస్తున్నాయి ఈ ప్రభుత్వాలు దేశ గవర్నమెంట్ ఉద్యోగాలలో బీసీలు ఆరు శాతం గిట్ల లేకపోవడం సిగ్గుచేటు ఈ సిగ్గులేని రాష్ట్ర ప్రభుత్వం ఏమో బీసీల కోసం ఢిల్లీలో ధర్నా చేస్తాం బీసీ బిల్లుకు మద్దతు అని చెప్పి ఇంతవరకు దాని ఊసే లేదు బీసీ బిల్లుకు మద్దతు తెలపకపోతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపుతామని హెచ్చరించారు

ఈ సమావేశంలో బీసీ సంఘం టౌన్ అధ్యక్షుడు కృష్ణపురం లక్ష్మణ్ బాబు ముదిరాజ్ కిషన్ ప్రకాష్ శీను తదితరులు పాల్గొన్నారు

## నారాయణఖేడ్‌లో ఘనంగా
## దొడ్డి కొమరయ్యకు మూడవ వార్షికోత్సవం


**వెలుతురూ ప్రతినిధి కంగ్టి:** సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ నియోజకవర్గంలో దొడ్డి కొమురయ్య మూడవ వార్షికోత్సవ సందర్భంగా సంఘం నాయకులు పూల మాలవేసి కార్యక్రమాన్ని



ప్రారంభించారు నారాయణఖేడ్ కురుమ యువత అధ్యక్షులు లోండే నర్సింలు మాట్లాడుతు భూమికోసం భుక్తికోసం వెట్టిచాకిరి విముక్తికోసం విసునూరురంచంద్రనిజం నిరంకుశ పాలన వ్యతిరేకించి తెలంగాణ సాధనకోసం మొట్ట మొదటగా ప్రాణాలను అర్పించిన మహనీయుడు దొడ్డి కొమురయ్య అని గుర్తు చేశారు, ఈసందర్భంగా నారాయణఖేడ్ తాలూకా కురుమ సంఘం ఉపాధ్యక్షులు మల్గొండ, మనుర్ మండల అధ్యక్షులు మల్లేష్, సంఘం పెద్దలు జనవడే నర్సన్న , నవనాత్, విట్టల్, లక్ష్మన్,మరియు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కంగ్టి మండలములో బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, కామారెడ్డి ఎమ్మెల్యే కె. వెంకటరమణారెడ్డి

**వెలుతురూ ప్రతినిధి కంగ్టి:** సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండ లములోని స్థానిక దేవాలయం రామమందిరంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి హాజరైన కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే & జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ కె.వెంకటరమణారెడ్డి ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలో అందరం





కలిసికట్టుగా పనిచేద్దాం,ప్రతి కార్యకర్తలు భుజం పైన వేసుకొని పని చెయ్యాలి మరొక్కసారి కేంద్ర ప్రభుత్వంలో మోదీ నాయకత్వన్ని కొనసాగించుదాం,ఇట్టి కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారీ బద్దం మహిపాల్ రెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి, సంగప్పా, నారాయణ ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, రవిగౌడ్, పట్నం మాణిక్, మండల్ ఇంచార్జ మధు జనవడే,దత్తన్న, వివిధ గ్రామ కార్యకర్తలు,యువకులు పాల్గొన్నారు.





## పీకేఆర్ ట్రస్ట్ & లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాప్లో వికలాంగులకు వీల్ చైర్స్ అందించిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోల సంజీవరెడ్డి సతీమణి అనుపమ రెడ్డి

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 30:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో పోతనపల్లి మాధ్వార్ గ్రామంలో ప్రచారం చేస్తుండగా మద్వార్ గ్రామం భవాని పోతనపల్లి గ్రామం ఉప్పరి సాయమ్మ వాళ్లను చూసి వాళ్లు నడవలేని పరిస్థితిలో ఉండడంతో గుర్తుంచుకొని వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తోపాజి అనంత కిషన్ మరియు వాసవి క్లబ్ మాజీ గవర్నర్ జూకంటి లక్ష్మీ గుప్తా సౌజన్యంతో వీల్ చైర్లు ఈరోజు వాళ్ళిద్దరికీ ఇవ్వడం జరిగింది.

వారికీ అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే డా.పట్లోళ్ల సంజీవ రెడ్డి సతీమణి అనుపమ రెడ్డి తెలియజేయడం జరిగింది.

# బిజెపి మనువాద విధానాలు దేశ ఐక్యతకు ప్రమాదం

### రాజ్యాంగ రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలి.
### డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్.

**కుత్బుల్లాపూర్ వెలుతురు జనవరి 30:**
కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను తెసివేయడానికి కుట్రలు చేస్తుందని, మతోన్మాద బీజేపీ ని ఓడిచేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉధ్యమించాలని. మారుపాక అనిల్ కుమార్ అన్నారు.
మగళవరం రోజున సిపిఐ కార్యాలయం కుత్బుల్లాపూర్ లో జిల్లా స్థాయి సమావేశం
డి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షలు గాలం లక్ష్మనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. డి హెచ్ పి ఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కే ఏసురత్నం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ హాజరైనారు.
ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్.
హాజరైన మాట్లాడుతూ మతాలన్నీ సమాఖ్య స్పూర్తితో పనిచేస్తున్నాయని అన్నారు. కానీ కేంద్ర బీజేపీ సర్కార్ అధికారంలోకి వచ్చిన పదిహేనులలో మతాన్ని దేవుడిని అధికార యంత్రాంగం లోకి రాజకీయాల్లోకి ప్రవేశింపజేసి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు ఎల్ ఐ సి, బి ఎస్ ఎన్ ఎల్, రైల్వే లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేస్తున్నారని అన్నారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలను మార్చాలని కేంద్రం ప్రయత్నం చేస్తుందని అన్నారు.
దేశ స్వాతంత్ర%శీ% కోసం కుల మతాలకు అతీతంగా ప్రజలంతా ఉద్యమం చేశారానే విషయం కేంద్ర ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు
మతాన్ని తమ స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకొని లబ్ది పొందాలని బీజేపీ ప్రయత్నం చేస్తుందని అన్నారు.అన్ని మతాల ప్రజలు గ్రామాల్లో సోదరా భావంతో ఉంటారని వారి మధ్యల మత విద్వేషాలు పెట్టి ప్రజలను




చీలుస్తు%శీ%దన్నారు.
గడిచిన 10 ఏండ్ల కాలంలో ప్రభుత్వ రంగసంస్థలను అమ్మివేసిందన్నారు. దేశ సంపదను ఆధాని, అంబానిలకు దోచి పెడుతుందని అన్నారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు.నిరుద్యోగం 50 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరిందని అన్నారు.
జామిలి ఎన్నికలు నిర్వహించెందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు.దేశంలో కోట్లాది మంది ప్రజలు కోవిడ్ తరువాత ఉపాధి కోల్పోయినరాని, చిన్న చిన్న ఉద్యోగాలు చేసి కుటుంబాలను పోషించుకుంటున్న వారి జీవితాలు అప్పుల పాలైనయని అన్నారు.నోట్ల రద్దు, జి ఎస్ టీ వంటి అనాలోచిత నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసినయని అన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. మహిళలపై అత్యాచారాలు, మానభంగాలు చేసిన వారికి అండగా బీజేపీ ప్రభుత్వాలు ఉంటున్నాయని విమర్శించారు. 46 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన పేదలు పెరిగినరాని అన్నారు.ప్రజలపై మత విశ్వాసలు బలవంతంగా రుద్దే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు?. పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను రద్దు చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు లాభం చేస్తున్నారని అన్నారు.చాతుర్వర్ణ వ్యవస్థ పేరుతో మేజార్టీ ప్రజలను అన్నింటికీ దూరం చేస్తున్నారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని గద్దించడమే దేశభక్తుల కర్తవ్యం అని ఆయన పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా డి హెచ్ పి ఎస్ కార్యదర్శి కే సహదేవ్ సహాయ కార్యదర్శి చిలుముల మల్లేష్ ఉపాధ్యక్షులు చర్లపల్లి రాములు దర్శనం యాదగిరి, నర్సింగ్ రావు, నియోజకవర్గ అధ్యక్షులు కత్తుల దుర్గయ్య ప్రజానాట్యమండలి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఏ ప్రవీణ్,
ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, హరినాథ్ రావు, అంబాల ఎల్లయ్య, దుండిగల్ మండల%శీ% డి హెచ్ పి ఎస్ డప్పు రామస్వామి,వెంకటేష్, అధ్యక్షులు ఇందారం ఎల్లయ్య,సత్యవతి,కమల, సామేలు, ముసలయ్య, యాదగిరి, బాబు, గట్టు అశోక్ నరసింహ,ఇమాం భాయ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.





## 37వ ఆల్ ఇండియా జిఎస్ఐ ఇండోర్ గేమ్స్-2024ను హైదరాబాద్‌లోని జిఎస్ఐలో ప్రారంభించిన మిథాలీ రాజ్

**హైదరాబాద్ వెలుతురు జనవరి 30, 2024:**
37వ ఆల్ ఇండియా జిఎస్ఐ ఇండోర్ గేమ్స్-2024 ను హైదరాబాద్‌లోని వి-స్పోర్ట్స్ అకాడమీలో పద్మశ్రీ, మిథాలీ రాజ్ ప్రారంభించారు. 2024 జనవరి 30-31 తేదీలలో జరుగుతున్న ఈ రెండు రోజుల ఈవెంట్‌కు రీజనల్ స్పోర్ట్స్ కౌన్సిల్ అదనపు డైరెక్టర్ జనరల్, శ్రీ సి.హెచ్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

వివిధ కార్యాలయాల నుండి 150 మందికి పైగా జిఎస్ఐ ఇండోర్ గేమ్స్‌లో పాల్గొనడానికి వచ్చారు. ఇండోర్ గేమ్స్-2024లో క్యారమ్స్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, బ్రిడ్జ్ వంటి ఐదు విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మిథాలీ రాజ్ మాట్లాడుతూ, ఆరోగ్యంగా, ఫిట్‌గా, చురుగ్గా ఉండేందుకు క్రీడల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. జీవితంలో విజయానికి అవసరమైన విలువలైన క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధత గల జీవితాన్ని పెంపొందించడానికి కూడా క్రీడలు సహాయపడతాయని ఆమె తెలిపారు.

శ్రీ సి.హెచ్. వెంకటేశ్వరరావు సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఈ వేడుకకు ముఖ్య అతిథిగా రావడానికి అంగీకరించినందుకు శ్రీమతి మిథాలీ రాజ్ ను అభినందించారు. స్పోర్ట్స్ మ్యాన్ స్పిరిట్‌ను పెంపొందించడానికి తమ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించడం కోసం జిఎస్ఐలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి పాల్గొనే వారందరూ ఆరోగ్యకరమైన, స్నేహపూర్వక సంబంధాన్ని కొనసాగించాలని కోరారు. క్రీడలు శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సును పెంపొందించడంతోపాటు, మానసిక వికాసాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందించడానికి కూడా సహాయపడతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్‌లు శ్రీ ఎల్.పి.సింగ్, శ్రీ ఎస్.ఎన్. మహాపాత్రో, శ్రీ అన్షుమన్ ఆచార్య, శ్రీ కె.వి. మారుతి, శ్రీ ఎం.ఎన్. ప్రవీణ్ లతో పాటు శ్రీ సంజయ్ చౌదరి, శ్రీ శ్రీనివాసులు, భూటియా, దొర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ మరుమాముల సోదరుల ఆధ్వర్యంలో గురుసత్కారము స్వర్ణకంకణ ధారణ బహూకరణ

**సిద్దిపేట టౌన్ వెలుతురు జనవరి 30:** భాగ్యనగరంలో దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక ఆధ్వర్యంలో ఈనెల 26 27 28 తేదీలలో జరిగిన శ్రీ డా వద్దిపర్తిప్రభాకర్ సహస్రావధాని శతావధానంనందు అవధానము నిర్వహింపబడినది.అట్టి అవధానాంశాలలో సిద్దిపేటకు చెందిన కవులు శ్రీ సింగీతం నర్సింహారావు రామంభజేశ్యామలమ్ కృష్ణంవందేజగద్గురుమ్ సాహితీ పరిషత్ ల అధ్యక్షులకు మరియు ఆయా సాహితీ పరిషత్ ల ఇతర సభ్యులకు వివిధ అంశాలలోచోటు దక్కడం భాగ్యముగా పరిగణించారు. 30 నిమిషాలు లోపే శతావధాన పద్యధారణ జరిగింది.అనంతరం దర్శనమ్ ఆధ్యాత్మిక మాస పత్రిక సంపాదక నిర్వహహణ బాధ్యంలు శ్రీ మరుమాముల సోదరుల ఆధ్వర్యంలో గురుసత్కారము స్వర్ణకంకణ ధారణ బహుకరణ జరగింది.అంగరంగవైభవముగా ఇద్దరు సహస్రావ ధానులు 9 మంది శతావధానులు 24మంది అష్టావధానులు తో కవిపండితులుతో శ్రీదేవులపల్లి రామానుజరావు తెలంగాణ సారస్వతపరిషత్ భవనము సభా మంటపం అలరింపబడినది.






ఎండలు దారెత్తిస్తున్నాయి. నేల నుంచి ఎగిసే సెగ, పైనుంచి కాల్చేసే ఎండ వేడిమితో ప్రాణాలు అతలాకుతలమైపోతున్నాయి. అంతకంతకూ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. ఇప్పటికే ఉభయ రాష్ట్రాల్లో ఎండదెబ్బకు కొన్ని పదుల మంది ప్రాణాలు కోల్పోయారంటే ఇక మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించటానికే భయమేస్తోంది. కానీ ఈ వేసవిని సునాయాసంగా దాటేయాలంటే 'వడదెబ్బ'కు గురికాకుండా చూసుకుంటే చాలంటున్నారు వైద్యులు. ఇందుకోసం ఏం చేయాలి? ఏలాంటి

# ఎండ గండం గట్టెక్కేద్దాం!

వేడికి చల్లదనమే విరుగుడు. శరీరంలో పెరిగే వేడికి చెమటే విరుగుడు. వేసవి వేడికి ఒళ్లంతా వేడెక్కినప్పుడు శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ చెమట వెలువడేలా చేసి, శరీరాన్ని చల్లబరుస్తుంది. ఇదొక సహజసిద్ధమైన ప్రక్రియ. కానీ అందుకు శరీరంలో తగినంత నీరు ఉండాలి. అలాగే చమటతో కోల్పోయే ఒంట్లోని నీటిని తిరిగి ఎప్పటికప్పుడు భర్తీ చేస్తూ ఉండాలి. ఈ రెండూ జరగకపోతే ఒంట్లోని నీటి శాతం తగ్గి, మొదట 'డీ హైడ్రేషన్'కు, అప్పటికీ జాగ్రత్త పడకపోతే 'వడ దెబ్బ'కూ గురవుతాం. ఈ దశలో ఈ క్రింది లక్షణాలు కనిపిస్తాయి.

### కాఫీలు, పానీయాలు

వేసవి తాపం తీర్చేవి కచ్చితంగా నీళ్లే! నీళ్లకు మించిన ప్రాణధారం మరొకటి లేదు. అయితే చల్లగా, తీయగా ఉండి తాగాలనిపించే శీతల పానీయాలను ఎక్కువగా ఆశ్రయిస్తూ ఉంటాం. కానీ వీటిని తాగడం వల్ల దాహార్తి తీరకపోగా మరింత పెరుగుతుంది. వీటిలో ఉండే రసాయనాలు, చక్కెరలు ఎండదెబ్బకు గురయ్యే అవకాశాలను పెంచుతాయి. ఎనర్జీ డ్రింకులూ అలాంటివే! తక్షణ శక్తిని ఇచ్చే ఎనర్జీ డ్రింకుల వల్ల హానికారక రసాయనాలు శరీరంలో చేరి ఎండ నుంచి తట్టుకోగలిగే శక్తిని కుంటుపరుస్తాయి. కాబట్టి ఎనర్జీ, కూల్ డ్రింకులకు బదులుగా సురక్షితమైన పానీయాలనే ఎంచుకోవాలి. తాజా కొబ్బరి నీళ్లు, చెరుకు రసం, మజ్జిగ, లస్సీ, పళ్ల రసాలు, నిమ్మ రసం మేలైనవి. అయితే ఏ పానీయం తాగినా వాటిలో ఐసు ముక్కలు కలుపుకోకూడదు. అలాగే ఫ్రిజ్‌లో విపరీతంగా చల్లబరిచి తాగకూడదు. కెఫీన్ ఉత్ప్రేరకం. కాబట్టి వేసవి కాలంలో కెఫీన్ కలిగి ఉండే కాఫీలను తగ్గించాలి. లేదంటే శరీరంలో వేడి పెరిగి ఎండ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

### పిల్లలు, వృద్ధులు.. జాగ్రత్త!

పిల్లలు, వృద్ధులు... వీళ్లిద్దరూ దాహం వేస్తుందనే విషయాన్ని వ్యక్తపరచలేరు. తమకు తాముగా గ్రహించలేరు. కాబట్టి వాళ్లు అడిగినా, అడగకపోయినా తరచుగా నీళ్లు తాగిస్తూ ఉండాలి. నీళ్లు తాగడానికి ఇష్టపడకపోతే పళ్ల రసాలు, గ్లూకోజు నీళ్లు, మజ్జిగ ఇస్తూ ఉండాలి. పిల్లలు, వృద్ధులు వాతావరణ మార్పులకు త్వరగా అడ్జస్ట్ కాలేరు. వీళ్లలో రోగనిరోధకశక్తి, శరీర సామర్థ్యాలు తక్కువ. కాబట్టి పగటి వేళ బయటకు పంపకూడదు. తేలికగా జీర్ణమయ్యే పదార్థాలను అందిస్తూ నీడ పట్టునే ఉంచాలి.

సాయంత్రం 5 గంటల తర్వాత పిల్లలను ఆటలకు బయటకు పంపవచ్చు. ఎండదెబ్బ తగలకుండా ఉండాలంటే ఇంట్లో చల్లదనం ఉండేలా చూసకోవాలి. ఇందుకోసం ఎ.సి, కూలర్లు వాడొచ్చు. ఇవి లేకపోయినా కిటికీలకు దుప్పట్లు, వట్టి వేళ్ల చాపలు కట్టుకోవచ్చు. పడుకునే గదిలో నీళ్లు నింపిన వెడల్పాటి టబ్బులు ఉంచి ఫ్యాన్ వేసినా గది చల్లబడుతుంది.

### వేడి చేస్తుందా?

ఎండాకాలంలో ప్రత్యేకంగా చలువ పదార్థాలే తినాలని అంటూ ఉంటారు. నిల్వ పచ్చళ్లు, ఉప్పు, కారాలు, మసాలాలు తింటే వేడి చేస్తుందని అనుకుంటాం! విరేచనాలు అయినా, శగ గడ్డలు ఏర్పడినా మామిడి పళ్లు తిన్నాం కదా! వేడి చేసింది అనుకుంటారు. ఇలా వేడి చేయటాన్ని కొన్ని పదార్థాలతో ముడి పెడుతూ ఉంటాం! కానీ ఇది నిజం కాదు. వేడి చేయటానికి, శరీర ఉష్ణోగ్రత పెరగటానికి సంబంధం లేదు. అలాగే శరీర ఉష్ణోగ్రత పెరిగి జ్వరం వచ్చినా దాన్ని వేడి చేసిందనడం సరి కాదు. శరీర ఉష్ణోగ్రతను పెంచే ఎలాంటి ఆహారాన్నైనా పరిమితంగా తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదు.

ప్రతి ఏడాదీ వచ్చే వేసవే! అయినా ఈ కాలమొచ్చిందంటే గుండెల్లో దడ మొదలవుతుంది. పగటిపూట అడుగు బయట పెడితే ఎండదెబ్బ తగులుతుందేమోననే భయం! ఒక పక్క ఉక్కపోత, మరోపక్క వేసవి తెచ్చే చెమట, దాని వెంటే చెమట పొక్కుల బాధ! ఇలా ఒకటా, రెండా? వేసవి వెతలు మాటల్లో చెప్పలేనన్ని! అయితే కొన్ని జాగ్రత్తలు, అప్రమత్తతలు పాటిస్తే వేసవి కాలాన్ని సునాయాసంగా దాటేయొచ్చు!

### ఈ సమయాల్లో



### జాగ్రత్త!

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల సమయంలో సూర్య కిరణాలు నేరుగా భూమి మీద పడతాయి. కాబట్టి ఆ సమయాల్లో ఎండలోకి వెళ్లకపోవడం మంచిది. ఈ సమయంలో కిరణాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఎండ ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుంది. ఇలాంటి ఎండకు గురవడం మూలంగా శరీర ఉష్ణోగ్రత త్వరితంగా పెరిగిపోతే ఎండదెబ్బకు గురవుతాం! కొన్ని సందర్భాల్లో శరీర వేడి 104 నుంచి 106 డిగ్రీల వరకూ పెరిగిపోతుంది.

### ఇలాంటి దుస్తులు మేలు!

చెమటను పీల్చుకునే వదులైన నూలు దుస్తులు వేసుకోవాలి. అలాగే అవి తేలిక రంగువై ఉండాలి. రాత్రివేళ లోదుస్తులు ధరించకుండా ఉండడమే మేలు! బిగుతుగా ఉండే జీన్స్, ఒంటికి అతుక్కుపోయే దుస్తులు, మందపాటి జాకెట్లు ఈ కాలంలో మానేయాలి. రేయాన్, సిల్క్, ఊలు, షిఫాన్, శాటిన్ దుస్తులు ఈ కాలంలో పూర్తిగా మానేయాలి.

### సన్ ట్యాన్ రాకుండా!

ఎండకు గురయ్యే ముఖం, మెడ భాగం, ముంజేతులు సన్ ట్యాన్‌కు గురవుతూ ఉంటాయి. ఇలా జరగకుండా ఉండాలంటే ఎండలోకి వెళ్లినా వెళ్లకపోయినా సన్‌స్క్రీన్ లోషన్ అప్లై చేస్తూ ఉండాలి. ఎస్‌పిఎఫ్ 15 పైబడి ఉండే సన్‌స్క్రీన్ లోషన్లు వాడడం మేలు. అలాగే ఎండలోకి వెళ్లే 15 నిమిషాల ముందు లోషన్ అప్లై చేసుకోవాలి. ఎండలో ఉన్నంతసేపు ప్రతి అరగంటకోసారి ఈ లోషన్ అప్లై చేస్తూ ఉండాలి.

### ఎలాంటి చలువ అద్దాలు?

సూర్య కిరణాలు కంట్లో పడకుండా చూసుకోగలిగితే చాలు! ఇందు కోసం గొడుగు, హ్యాట్ వాడినా సరిపోతుంది. అయితే సూర్యకిరణాల తోపాటు వేడి గాలుల నుంచి రక్షణ కల్పించాలి అనుకుంటే ముదురు



రంగు చలువ కళ్లద్దాలు వాడాలి! వీటిలో ఖరీదైనవే మంచివి అనుకుంటే పొరపాటు. చవక అద్దాలు ఖరీదైనవాటితో సమానమైన రక్షణనే కల్పిస్తాయి. నల్ల గొడుగులకు బదులుగా తేలిక రంగుల్లో గొడుగులు వాడడం మేలు!

### డీ హైడ్రేషన్ రాకుండా!

వేసవిలో శరీరంలోని నీరు చెమట రూపంలో వెళ్లిపోతూ ఉంటుంది. కాబట్టి ఆ నీటిని భర్తీ చేసే పదార్థాలే ఎక్కువగా తింటూ ఉండాలి. లేదంటే డీ హైడ్రేషన్ తప్పదు. ఈ సమస్యతో ఎండదెబ్బకు గురవకుండా ఉండాలంటే... నీరుండే కూరగాయలైన అనపకాయ, బీరకాయ, పొట్లకాయ, టమాటా, క్యాబేజీ, దోసకాయ తినాలి. అలాగే పుచ్చకాయ, ద్రాక్ష, తర్బూజా లాంటి నీరుండే పళ్లు తినాలి. దాహంతో సంబంధం లేకుండా గంట గంటకూ నీళ్లు తాగుతూనే ఉండాలి. దాహం వేస్తుందంటే అప్పటికే మన శరీరంలోని కణాలను దాహంతో అల్లాడుతున్నాయని అర్థం. కాబట్టి అప్పటిదాకా ఆగకుండా అంతకంటే ముందే శరీరంలో నీటిని భర్తీ చేస్తూ ఉండాలి. స్వేదంతో కోల్పోయిన నీటిని మామూలు నీటితో భర్తీ చేస్తే సరిపోదు. స్వేదం ద్వారా లవణాలను (సోడియం, పొటాషియం) కూడా కోల్పోతాం కాబట్టి ఎండలో గడిపిన సమయం ఆధారంగా ఉప్పు కలిపిన నీటిని తాగుతూ ఉండాలి. మాంసాహారం తినే అలవాటున్నవాళ్లు మిగతా కాలాల్లో కంటే తక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో మాంసాహారం, మసాలాలు లేకుండా చూసుకోవాలి. ఉదయం లేదా సాయంత్రం మాంసాహారానికి అనువైన వేళలు. వేసవిలో జీర్ణశక్తి మందగిస్తుంది. కాబట్టి భారీగా తినడం తగ్గించుకోవాలి. వీలైతే భోజనానికి బదులు సలాడ్లు, మిజ్జిగ, పళ్ల రసాలు తీసుకోవచ్చు.

### దీర్ఘకాల రుగ్మతలుంటే?

రక్తపోటు బాధితులు: మందుల ప్రభావం వల్ల ఈ కాలంలో రక్తపోటు బాధితుల్లో మూత్ర విసర్జన ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తేలికగా ఎండదెబ్బకు గురయ్యే ప్రమాదం వీరిలో ఎక్కువ. ఇలా డీహైడ్రేషన్‌కు గురవకుండా ఉండాలంటే వేసవి కాలం మొత్తం కొంత మేరకు ఉప్పు మోతాదు పెంచుకోవచ్చు. నీళ్లలో, మజ్జిగలో ఉప్పు కలుపుకోవచ్చు. అయితే ఎంత ఉప్పు? అనేది వైద్యుల సూచన మేరకు పాటించాలి.

**మధుమేహులు:** మధుమేహులు కూడా ఈ కాలంలో త్వరగా డీహైడ్రేషన్‌కు గురవుతూ ఉంటారు. నీరసించిపోతూ ఉంటారు. కాబట్టి ప్రతి మూడు గంటలకోసారి ఆహారం తీసుకోవాలి. వైద్యుల సూచనల మేరకు పళ్లు, బిస్కెట్లు, సలాడ్లు తింటూ ఉండాలి.

### ఎండ దెబ్బ తగిలితే?

ఎన్ని జాగ్రత్తలు పాటించినా ఒక్కోసారి ఎండదెబ్బ నుంచి తప్పించుకోలేం! అసలు సమస్య ఎండదెబ్బో, కాదో కూడా ప్రారంభంలో అర్థం కాదు. బడలికగా ఉండి, జ్వరం వచ్చినట్టు అనిపిస్తే ఎండకు ఒళ్లు అలసిపోయిందని అనుకుంటామే తప్ప ఎండదెబ్బకు గురయ్యామని తెలుసుకోలేం! కానీ వేసవిలో కొన్ని లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.

### అవేంటంటే....

ఒళ్లు నొప్పులు, నీరసం, బడలిక
చమట పట్టకపోవడం
శరీరం వేడెక్కిపోవడం (102 నుంచి 106 డిగ్రీల జ్వరం)
చర్మం ముడతలు పడడం, పొడిబారడం
కళ్లు తిరగడం, స్పృహ కోల్పోవడం
వాంతులు, విరేచనాలు
మూత్రం పచ్చగా మారడం

ఈ లక్షణాలుంటే ఎండదెబ్బగా భావించాలి. వెంటనే ఒంటికి చల్లని గాలి తగిలేలా చూసుకోవాలి. తడిబట్టతో ఒళ్లు తుడుచుకుంటూ శరీర ఉష్ణోగ్రతను తగ్గించే ప్రయత్నం చేయాలి. తర్వాత ఉప్పు, చక్కెర కలిపిన నీళ్లు తాగాలి. తీవ్రతను బట్టి వైద్యులను కలవాలి.

ఎండతాపాన్ని తట్టుకోవడానికి, నీరసం రాకుండా ఉండటానికి, ఒళ్లు నొప్పులు రాకుండా, దాహాన్ని కంట్రోల్ చేయడానికి ఐదు జ్యూస్‌లున్నాయి. వాటిని ప్రతిరోజూ తీసుకుంటే, జీర్ణకోశం శుభ్రపడి ఆరోగ్యంగా ఉంటారు. వాటిని ఎలా తయారుచేయాలంటే...

## వేసవిలో శక్తినిచ్చే డ్రింక్స్

సగం యాపిల్, కొద్దిగా కొత్తిమీర, అర కీరదోస, ఒక టీ స్పూను నిమ్మరసం, చిటికెడు ఉప్పు, చిటికెడు పంచదార, నాలుగు ఐస్‌క్యూబ్స్, ఒక గ్లాసు చల్లటి నీరు... వీటన్నింటినీ కలిపి మిక్సర్‌లో బ్లెండ్ చేసి రాత్రి నిద్రపోయే ముందు తాగాలి.



సగం యాపిల్, పది పాలకూర ఆకులు, ఒక టీ స్పూను నిమ్మరసం, ఒక టీ స్పూను పంచదార, చిటికెడు ఉప్పు, నాలుగు ఐస్‌క్యూబ్స్, ఒక గ్లాసు చల్లటి నీరు... వీటిని మిక్సర్‌లో బ్లెండ్ చేసి సాయంకాలం తాగాలి.

అర కప్పు పెరుగు, చిన్న అల్లం ముక్క, ఒక టీ స్పూను నిమ్మరసం, చిటికెడు దంచిన పచ్చిమిర్చి, తగినంత ఉప్పు, నాలుగు ఐస్‌క్యూబ్స్, ఒక గ్లాసు చల్లటి నీరు... అన్నీ కలిపి మిక్సర్‌లో బ్లెండ్ చేసి, మట్టి గ్లాసులో పోసి మధ్యాహ్నం తాగాలి.

ఒక గ్లాసు కొబ్బరి బోండాం నీళ్లు, బోండాలో ఉండే కొబ్బరి మీగడ, చిటికెడు పంచదార, చిటికెడు ఉప్పు, నాలుగు ఐస్‌క్యూబ్స్... అన్నీ కలిపి మిక్సర్‌లో బ్లెండ్ చేసి ఉదయం 11 గంటలకు తాగితే బూస్టర్ డోస్‌లా పనిచేస్తుంది.

పావు కప్పు క్యారెట్, అర కప్పు ఆరెంజ్ జ్యూస్, పావు కప్పు యాపిల్, పావు కప్పు బీట్‌రూట్, చిటికెడు ఉప్పు, చిటికెడు పంచదార, నాలుగు ఐస్‌క్యూబ్స్, ఒక గ్లాసు చల్లటి నీళ్లు... అన్నీ కలిపి మిక్సర్‌లో బ్లెండ్ చేసి ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు తీసుకోవాలి. వేసవిలో ప్రతీ రోజూ వీటిని తాగితే ఎండదెబ్బ బారిన పడకుండా, నీరసపడిపోకుండా హాయిగా ఉండొచ్చు.

## వేసవిలో చర్మాన్ని కాపాడేదెలా?

**రుతువులు మారే కొద్దీ, చర్మపు స్థితిగతులూ మారుతుంటాయి. శీతల కాలంలో అయితే మృత కణాలన్నీ ఒంటిమీద పేరుకుపోయి ఉంటాయి. వాటిని తొలగించే ఏ ప్రయత్నమూ చేయకపోతే, అవి అలాగే ఉండిపోయి మరికొన్ని ఇతర సమస్యలకు కూడా దారి తీస్తాయి. అందుకే...**

బాడీ సాల్ట్ ద్వారా గానీ, షుగర్ స్క్రబ్‌ల ద్వారా గానీ, ఒంటి మీద నిలిచిఉన్న మృత కణాలను తొలగించుకోవాలి. ఇలా చేయడం వల్ల మృత కణాలు తొలగిపోవడమే కాదు, చర్మం కాంతివంతంగా తయారవుతుంది.



మృత కణాలను తొలగించేంచుకు అవపరమైన మిశ్రమాన్ని స్వయంగానే తయారు చేసుకోవచ్చు. అందుకు బ్రౌన్ షుగర్, వైట్ షుగర్, ఆలివ్ ఆయిల్, కొన్ని ల్యావెండర్ ఎస్సెన్షియల్ ఆయిల్ చుక్కలు కలిపి ఈ మిశ్రమాన్ని తయారు చేసుకోవచ్చు.

కేవలం ఆలివ్ నూనె, కొబ్బరినూనెతో మర్దన చేసినా చర్మానికి ఎంతో మేలు కలుగుతుంది

స్నానం పూర్తి కాగానే మంచి బాడీ లోషన్ ద్వారా గానీ క్రీము ద్వారా గానీ సున్నితంగా మర్దన చేయాలి.

బాగా పండిన ఒక అరటిపండు, ఒక అవకాడో, మూడు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె కలిపి, స్వయంగానే కండీషనర్‌ను తయారు చేసుకుని వాడుకోవచ్చు.

రోజుకు కనీసం 4 లీటర్ల నీరు తప్పనిసరిగా తాగాలి. పసుపు /ఆరెంజ్, ఆకుపచ్చ, ఎరుపు, తెలుపు, నీలి /ఊదా ఈ ఐదు రంగుల్లో ఉండే పండ్లు, కూరగాయలు తరుచూ తింటూ ఉండాలి.

శరీరానికి అవసరమైన కొవ్వు లభించే, అవకాడో, నెయ్యి, వెన్న, కొబ్బరినూనె, చేపలు, ముడిధాన్యాలు తరుచూ తినాలి.

ఈ జాగ్రత్తల్లో ఏ కొన్ని పాటించినా, వేసవిలో చర్మం సంబంధమైన ఏ సమస్యలకు గురికాకుండా, చక్కని నిగారింపుతో ఉంటుంది.

## 'డీ'లా పడిపోవద్దు!

విటమిన్ డి తీరే వేరు. అవటానికిది విటమినే అయినా హార్మోన్ మాదిరిగా పనిచేస్తుంది. చర్మానికి ఎండ తగిలినపుడు కొలెస్ట్రాల్ నుంచి దీన్ని మన శరీరమే తయారుచేసుకుంటుంది. కొవ్వుతో కూడిన చేపల వంటి వాటిల్లోనూ విటమిన్ డి ఉన్నప్పటికీ ఆహారం ద్వారా దీన్ని తగినంత తీసుకోవటం చాలా కష్టం. శరీరంలోని పలు వ్యవస్థలపై గణనీయమైన ప్రభావం చూపే విటమిన్ డి లోపంతో ఎంతోమంది బాధపడుతున్నారు. పైకి ఎలాంటి లక్షణాలూ కనబడకపోవటం వల్ల చాలా మంది దీన్ని పట్టించుకోవటం లేదు. నిజానికి విటమిన్ డి లోపం పలు సమస్యలకు దారితీయొచ్చు. కొన్ని కొన్ని లక్షణాల ఆధారంగా దీని లోపాన్ని గుర్తించొచ్చు.


తరచుగా జబ్బుపడటం: రోగనిరోధక వ్యవస్థ బలంగా పనిచేయటంలో విటమిన్ డి కీలక పాత్ర పోషిస్తుంది. ఇన్‌ఫెక్షన్లతో పోరాడే కణాలతో ఇది నేరుగా చర్య జరుపుతుంది. అందువల్ల విటమిన్ డి లోపిస్తే జలుబు, ఫ్లూ వంటివి తరచుగా దాడిచేస్తుంటాయి.

నిస్సత్తువ: అలసట, నిస్సత్తువకు దారితీసే అంశాల్లో విటమిన్ డి లోపం ఒకటి. దురదృష్టవశాత్తు చాలామందికి విటమిన్ డి లోపమన్నదే గుర్తుకురాదు. రక్తంలో దీని స్థాయిలు తగ్గితే తీవ్రమైన నిస్సత్తువకు దారితీస్తుంది.

వెన్నునొప్పి: ఎముకల దృఢంగా, ఆరోగ్యంగా ఉండటానికి విటమిన్ డి ఎంతగానో తోడ్పడుతుంది. ఇది మనం తిన్న ఆహారం నుంచి శరీరం క్యాల్షియాన్ని మరింత ఎక్కువగా గ్రహించుకునేలా చేస్తుంది. అందువల్ల విటమిన్ డి లోపిస్తే వెన్నునొప్పి, ఎముకల నొప్పుల వంటివి బయలుదేరొచ్చు. దీని లోపంతో చిన్న చిన్న దెబ్బలకే ఎముకలు విరిగే ప్రమాదముంది.

కుంగుబాటు: ఎప్పుడూ విచారంతో ఉంటున్నట్టు గమనిస్తే విటమిన్ డి లోపం కూడా కారణం కావొచ్చని అనుమానించాలి. రక్తంలో విటమిన్ డి స్థాయులు తగ్గటానికీ కుంగుబాటుకూ సంబంధం ఉంటున్నట్టు పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

పుండ్లు మానకపోవటం: ఏదైనా దెబ్బ తగిలినపుడు, సర్జరీల వంటివి చేయించుకున్నప్పుడు గాయం, కోతలు త్వరగా మానకుండా వేధిస్తుంటే విటమిన్ డి లోపం ఉందేమో ఒకసారి పరీక్షించుకోవటం మంచిది. ఎందుకంటే పుండు మానే క్రమంలో కొత్త చర్మం ఏర్పడటంలో కీలక పాత్ర పోషించే రసాయనాల ఉత్పత్తికి విటమిన్ డి తోడ్పడుతుంది



మరి. అంతేకాదు, వాపు నియంత్రణలోనూ ఇన్‌ఫెక్షన్‌తో పోరాడటంలోనూ ఇది పాలు పంచుకుంటుంది.

జుట్టు ఊడటం: వెంట్రుకలు ఊడిపోతుంటే ముందుగా ఒత్తిడే గుర్తుకొస్తుంది. కానీ కొన్ని జబ్బులతో పాటు విటమిన్ డి లోపం సైతం జుట్టు ఊడిపోవటానికి దోహదం చేయొచ్చు.

# డైట్ ప్లాన్‌లు...

## అవసరమా? అనర్థమా?

డైటింగ్...! ఊబకాయం తగ్గడానికో, స్లిమ్‌గా కనిపించటానికో, జీరోసైజ్ కోసమో నేటి యువత అనుసరిస్తున్న విధానం. ఒకప్పుడు పూర్తిగా కడుపు మాడ్చుకోవడం, లేదంటే తినే ఆహారాన్ని మితం చేసుకోవడం చేసేవారు. దానివల్ల బరువు తగ్గుతామని తలపోసేవారు. కానీ నేటి డైటింగ్ ప్లాన్‌లు పూర్తిగా దానికి వ్యతిరేకం. ముల్లును ముల్లుతోనే తీయాలన్న చందంగా కొవ్వును కొవ్వుతోనే కరిగించాలనుకుంటున్నారు. అస్తవ్యస్తమైన ఆహారపు అలవాట్ల వల్ల వచ్చిన ఊబకాయాన్ని అదే ఆహారంతో తరిమికొట్టాలనుకుంటున్నారు. దాంతో రకరకాల డైట్‌లు విస్తృతంగా ప్రచారంలోకి వస్తున్నాయి. వీరమాచినేని డైట్, కీటోజెనిక్, అట్కిన్స్ డైట్, ట్యూనా డైట్‌లు ఆ కోవలోనివే.

### అసలేమిటీ డైట్ ప్లాన్‌లు?

శరీర బరువు మోస్ట్ ఇంపార్టెంట్ సమస్యగా మారిన నేటి పరిస్థితుల్లో, కడుపు నిండా ఇష్టమైనవి తినడం కలగా మారుతోంది. కేలరీలు కొలుచుకుని తినడం, తినే ప్రతీదాంట్లో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఫ్యాట్ పరిమాణాలను బేరీజు వేసుకోవడం.... తిండి కూడా కూడికలు, తీసివేతలు చందంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ట్రెండీ డైట్‌ప్లాన్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు.

డైటింగ్ అంటే కడుపు మాడ్చుకోకుండా, కడుపు నిండా తింటూనే తీసుకునే ఆహారం ద్వారా అదనపు కేలరీలు చేరకుండా చూసుకోవడం. ఈ సూత్రం ఆధారంగా రకరకాల డైట్ ప్లాన్స్ రూపొందించబడ్డాయి. అయితే ఒక్కో డైట్ ప్లాన్‌ది ఒక్కో కాన్సెప్ట్. శరీరపు చక్కెర మోతాదును నియంత్రణలో ఉంచి బరువు పెరగకుండా అడ్డుకునేవి కొన్నయితే, కొవ్వు పదార్థాలు లేకుండా పోషకాలు మాత్రమే శరీరానికి అందేలా రూపొందించినవి మరి కొన్ని.

అలాగే శరీర అధిక బరువు తగ్గాలంటే కేవలం ద్రవాహారం మాత్రమే తీసుకోవాలని కొందరు డైట్‌ప్లాన్ రూపొందిస్తే, కొవ్వును కొవ్వుతోనే కరిగించాలని డైట్‌ప్లాన్ తయారుచేసుకునేవారు మరికొందరు. అంతేకాక, పచ్చి కూరలు మాత్రమే తీసుకునే డైట్, పాత తరపు ఆహారపు విధానం...అంటే ఆహారంలో చిరుధాన్యాలు చేర్చుకోవడం వంటివి...నేడు విస్తృతంగా ప్రచారం పొందుతున్నాయి.

### ఎందుకంటే...?

ముఖ్యంగా మనం చెప్పుకోవాల్సింది మారిన జీవనశైలి గురించి! ఆధునికత, నాగరికత, సాంకేతికత పెరిగి, జీవనశైలి పూర్తిగా మారింది. తినే వేళలు, సరైన ఆహారం తీసుకోకపోవడం, రుచుల పేరిట జంక్‌ఫుడ్ తీసుకోవడం, అలాగే బిజీ షెడ్యూల్‌తో స్వయంగా వండుకుని తినలేకపోవడం, శారీరక శ్రమ లేకపోవటం, ఒత్తిళ్ళు...ఇలా రకరకాల కారణాల వల్ల ఒబేసిటీ బారిన పడుతున్నారు.

ఆ తరువాత మనం చెప్పుకోవాల్సింది...మితం లేకపోవడం! ఆహారనియమాలు పాటించకపోవడం! వెజ్, నాన్ వెజ్...ఐటెమ్ ఏదైనా, రకరకాల వెరైటీ రుచులు కళ్ళ ముందు కనిపిస్తుండటంతో... ఏం తింటున్నామో, ఎంత తింటున్నామో తెలియకుండా అన్నింటినీ ఆస్వాదించేయాలన్న తపన. దాంతో తెలియకుండానే తమ శరీర బరువును పెంచేసుకుంటున్నారు. పెరిగిన శరీరాన్ని తగ్గించుకోవటానికి, ఆ తరువాత తీరిగ్గా ఆలోచిస్తున్నారు. డైట్ ప్లాన్‌ల గురించి ఆరా తీస్తున్నారు.

ఇంకో ముఖ్య కారణం తీరిక లేని జీవితం! పొద్దున్న లేచింది మొదలు ఉరుకులు పరుగులు. పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకూ, ఈ పోటీప్రపంచంలో ఎవరి షెడ్యూల్ వారిది. దాంతో శారీరక శ్రమకు, వ్యాయామానికి ప్లానింగ్ చేసుకోవాల్సి వస్తోంది. శారీరక అలసట లేక, చెమట చిందించక, శరీరం అమాంతం పెరిగిపోతోంది. దాన్ని తగ్గించుకోవడానికి ఆ తరువాత తంటాలు పడుతున్నారు. ఇవే కాక ఇంకా రకరకాల కారణాలు మనిషిని, స్త్రీ, పురుష భేదం లేకుండా డైటింగ్‌వైపు నడిపిస్తున్నాయి.

### ప్రయోజనమేనా?

అధిక బరువును వెంటనే తగ్గించుకోవాలనే అత్యాశతో, అతిగా డైట్ ప్లాన్ చేసుకుంటారు. సమయం లేదు, అంత ఓపిక లేదు, ఫలితం వెంటనే రావాలి వంటి సాకులతో కఠినంగా, ఆలోచన లేకుండా, డైటింగ్ చేస్తుంటారు. దీనివల్ల ప్రయోజనం కన్నా అనర్థమే ఎక్కువ. నిజానికి ఏ ఒక్క డైటూ వందశాతం ఫలితం ఇవ్వదు. శారీరక, మానసిక ఆరోగ్యాలు, అలవాట్లు, శరీరతత్వం, నివసించే ప్రాంతం, జన్యు సంబంధ సమస్యలు, వ్యాధులు మొదలైన అనేక అంశాలను పరిగణనలోనికి తీసుకొని డైట్ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. నిజానికి ఎవరో ఒకరికి సత్ఫలితాలు వచ్చాయని, వారినే ఫాలో అవుదామనే ధోరణి ప్రజల్లో ఎక్కువైంది.

నిజానికి కొన్ని తాత్కాలికంగా పని చేసినప్పటికీ, భవిష్యత్తులో జీవక్రియలకు ఆటంకంగా మారి ఆరోగ్య సమస్యలు తెచ్చే ప్రమాదాలు లేకపోలేదు. ఈ విషయం గమనించకుండా, ఏది పాటించాలి? ఏది మంచి ఫలితాలను ఇస్తుంది? ఇవేవీ పూర్తిస్థాయిలో తెలుసుకోకుండా ఏ డైటూ సక్రమంగా పాటించక దీర్ఘకాలిక సమస్యలను తెచ్చుకుంటున్నారు కొందరు.

### ఇలా చేస్తే మేలు!

● ఏ పనికయినా ప్లానింగ్, పద్ధతి ముఖ్యం. డైట్ ప్లాన్స్ అనుసరించేముందు కూడా ఒక క్రమమైన పద్ధతి అవసరం, అది ఏరకమైన డైట్ అయినా సరే! ఎవరో పాటిస్తున్నారనో, సోషల్‌మీడియాలో వైరల్ అయిందనో కాకుండా, మీ శారీరకతత్వాన్ని దృష్టిలో పెట్టుకుని, మీకు ఏది సూట్ అయితే ఆ డైట్‌నే పాటించాలి.

● డైట్ చెయ్యడం వరకు బాగానే ఉంటుంది. కానీ దీన్ని ఆపేసిన తర్వాత మళ్లీ బరువు పెరుగుతారు. దీని వల్ల రెసిస్టెంట్ కొవ్వు పెరుగుతుంది. ఏ డైట్ అయినా సరే మూడు నెలలు తప్పనిసరిగా చెయ్యాలి. ఫలితంగా బరువు తగ్గుతారు. అప్పుడు ఆ తగ్గిన బరువునే కనీసం ఏడాదిన్నర పాటు మెయిన్‌టెయిన్ చెయ్యాలి. అలా చెయ్యగలిగితే మళ్లీ బరువు పెరిగే అవకాశం ఉండదు. సమతుల్యత లోపించడం వల్ల బరువు పెరగడం.. ఇతర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. కాబట్టి మన జీవనవిధానంలోనే మార్పులు చేసుకోవడం వల్ల ఆరోగ్యపరంగా శాశ్వత ఫలితాలు పొందవచ్చు.



**అతి ఏదైనా అనర్థమే! మితం పరిమితం అలవాటు చేసుకుంటే జీవితం సంతోషదాయకం, ఆరోగ్యకరం. ఆధునిక జీవన, ఆహారపు అలవాట్లు, బిజీ షెడ్యూళ్ళు, ట్రెండీ లైఫ్, లగ్జరీ ఎంజాయ్‌మెంట్...వంటి అంశాలు జీవన పరిమితులకు అడ్డుకట్ట వేస్తున్నాయి. అతి చేదుగా మారుతోంది. తిన్నా, ఎంజాయ్ చేసినా, ఖర్చు పెట్టినా... అన్నీ అతిగానే ఉంటున్నాయి. అందుకే నేడు మనిషిని శారీరక, మానసిక సమస్యలు కుదిపేస్తున్నాయి. ముఖ్యంగా ఒబేసిటీ! ఆ కారణంగానే నేటి కార్పొరేట్ సమాజంలో రకరకాల డైట్ ప్లాన్‌లు ప్రచారంలోకి వస్తున్నాయి. ఎంతోమందిని తమవైపు ఆకర్షించుకుంటున్నాయి.**

● నేటి యువత ఇంటర్నెట్ ప్రభావంతో, ఇష్టం వచ్చినట్టుగా సొంత ప్రయోగాలు చేస్తోంది. ట్రెండింగ్, ఫాలోయింగ్ అంటూ నిజానిజాలు తెలుసుకోకుండా, ఒకదాని తరువాత ఒకటిగా...డైట్ ప్లాన్స్‌తో ప్రాణాలమీదికి తెచ్చుకుంటోంది. బరువు తగ్గడమన్నది సహజ పరిస్థితుల్లో, ఆరోగ్యకరంగా తగ్గాలి తప్ప, అత్యుత్సాహంతో దేన్ని పడితే దాన్ని ఫాలో అవకూడదు. ఇలా చేయడం వల్ల ఉన్న సమస్యకు మరికొన్ని సమస్యలు తోడవుతాయి. కాబట్టి నేటి వ్యాపార ప్రపంచంలో, ఎవరికీ, దేనికీ మీరు టార్గెట్ కావద్దు.

● పద్ధతి ప్రకారం చేసే ఏ డైట్ అయినా మంచిదే. మహిళలకైనా, పురుషులకైనా న్యూట్రీషియస్ బేస్డ్ డైట్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కాకపోతే ఏ రకమైన డైట్‌ను తీసుకున్నా, బ్యాలెన్స్‌డ్‌గా తీసుకోవాలి.



### కొన్ని టాప్ లిస్ట్ డైట్ ప్లాన్స్

గత సంవత్సరం కొన్ని రకాల డైట్ ప్లాన్‌లు అత్యంత ప్రాచుర్యం పొందాయి. సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు ఎంతోమంది ఈ డైట్ ప్లాన్లను ఫాలో అయ్యారు. వాటిల్లో కొన్నిటి గురించి తెలుసుకుందాం.

### కీటో డైట్!

గతేడాది ప్రపంచవ్యాప్తంగా గూగుల్‌లో ఎక్కువ మంది సెర్చ్ చేసింది ఈ కీటో డైట్ గురించేనట! అంతలా ప్రాముఖ్యం సంతరించుకున్న ఈ కీటో డైట్ ఎప్పటి నుంచో ఉంది. ఇందులో ప్రధానంగా కార్బోహైడ్రేట్లను ఆహారంలో తీసుకోకుండా, అధికశాతం కొవ్వుపదార్థాలు, ప్రోటీన్స్ తీసుకుంటూ, అతి తక్కువ కాలంలో అధిక బరువుకు స్వస్తి పలకవచ్చనే కాన్సెప్టుతో వచ్చిందే... ఈ కీటో డైట్!

### వీరమాచినేని డైట్

నేడు తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుందీ డైట్! ఎంతోమంది ఈ డైట్‌ను ఫాలో అవుతున్నారు. వీరమాచినేని రామకృష్ణారావు రూపొందించిన ఈ డైట్ ప్రధాన ఉద్దేశం... కొవ్వును కొవ్వుతోనే కరిగించడం. ముఖ్యంగా మధుమేహులకు ఉపయోగకరంగా ఉంటుందనే ప్రచారంతో ఇప్పుడీ డైట్ బాగా ఫేమస్ అయింది.

### రా ఫుడ్ డైట్

తినే ఆహారం, తాగే పానీయాలు అన్నీ నేచురల్‌గా ఉండాలి. ఎలాంటి ప్రాసెసింగ్ చేయొద్దు. ఒకరకంగా ముడి ఆహారం మాత్రమే తీసుకోవడం ఈ డైటింగ్ విధానం.

### సౌత్ బీచ్ డైట్

ఇన్సులిన్ స్థాయిలను తగ్గించేందుకు ఈ డైటింగ్ ఉపయోగపడుతుంది. కార్బోహైడ్రేట్స్ తీసుకోవడం వల్ల బరువు తగ్గొచ్చు అనేది దీని ఉద్దేశం.

### మెడిటెర్రేనియన్ డైట్

బీన్స్, నట్స్.. తాజా పండ్లు, ఉడకబెట్టని ఆహారం తీసుకోవడం ద్వారా బరువు తగ్గొచ్చని మెడిటెర్రేనియన్ డైటింగ్ సూచిస్తుంది.

### అట్కిన్స్ డైట్

శరీరంలోని ఇన్సులిన్ స్థాయిలను నియంత్రిస్తుంది. దీనిలో భాగంగా తక్కువ మోతాదు కార్బోహైడ్రేట్స్‌ను తీసుకోవాల్సి ఉంటుంది.

వేగాన్ డైట్

గుడ్డు.. పాలు.. తేనె తినొచ్చు. వీటితో పాటు శాకాహారం తీసుకోవాలి. ఈ డైటింగ్ విధానాన్ని ఫిలాసఫీతో పోలుస్తుంటారు నిపుణులు. ప్లాంట్‌బేస్డ్ ఫుడ్ తీసుకోవడానికి అవకాశాలు ఉంటాయి.

### వెయిట్ వాచర్ డైట్

చాలా పురాతనమైన విధానం. 1960 నుంచే ఇది వాడుకలో ఉంది. తిండి కన్నా వ్యాయామానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. శరీర బరువు తగ్గాలంటే కచ్చితంగా నిర్దిష్టమైన వ్యాయామం అవసరమేది ఈ డైటింగ్ ఫార్ములా.

### ట్యూనా డైట్

ఈ రకమైన డైట్ వల్ల మూడు రోజుల్లో 4 కేజీల బరువు తగ్గుతారట. దీనినే కెమికల్ బ్రేక్‌డౌన్ డైట్ అని కూడా పిలుస్తారు. ఈ రకమైన డైట్‌లో ముఖ్యంగా కేలరీలు తక్కువగా ఉండి, అధికమొత్తంలో ప్రోటీన్లను కలిగి ఉన్న ట్యూనా ఫిష్‌ను వాడతారు.

### లిక్విడ్ డైట్

ఇందులో కేవలం ద్రవాహారం మాత్రమే తీసుకుంటారు. ఘనపదార్థం జోలికి వెళ్ళరు. కేవలం మంచినీరు, పళ్ళరసాలు, కూరగాయల రసాలు... మాత్రమే ఈ డైట్‌ను ఫాలో అయ్యేవారు తీసుకుంటారు.

## బరువు తగ్గడానికి...

బరువు తగ్గాలనుకుంటున్నారా? వ్యాయామం, డైటింగులతో పాటు దీనికి మరో సులువైన మార్గం కూడా ఉంది. సింపుల్ జ్యూస్‌తో ఈ సమస్యను అధిగమించవచ్చు.



నిమ్మరసంలో కొత్తిమీర కలిపిన జ్యూసు తాగాలి. ఇది శరీరానికి చాలా మంచిది. నిమ్మరసం శరీరంలోని విషపదార్థాలను పోగొడుతుంది. అదే కొత్తిమీర కలిపిన నిమ్మరసం తాగితే బరువు తగ్గుతారు. పొట్ట చుట్టూ పేరుకున్న కొవ్వు కూడా కరుగుతుంది. కొత్తిమీరలో కాలరీలు తక్కువ కానీ విటమిన్ ఎ,బి,సి,కెలతో పాటు ఐరన్, పొటాషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. శరీరంలోని మలినాలను పోగొట్టడంతో పాటు శరీరంలోని అనవసర ఫ్లూయిడ్స్‌ను ఈ జ్యూసు బయటకు పంపేస్తుంది. కొత్తిమీరకు బ్లడ్‌షుగర్ ప్రమాణాలను సమతులం చేసే గుణం ఉంది. అందులోని క్లోరోఫైల్ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియ బాగా జరిగేలా సహకరించే ఎంజైములు ఇందులో ఉన్నాయి. వీటివల్ల కూడా బరువు తగ్గుతారు. ఇక నిమ్మకాయ శరీరంలో నీటి నిల్వలను పెంచుతుంది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. నిమ్మకాయ, కొత్తిమీర కలిస్తే బరువు తగ్గడంతోపాటు ఉత్సాహంగా ఉంటారు.

**వండర్ జ్యూసు తయారీ:**

మొదట కొత్తిమీర కడగాలి. నిమ్మకాయ తీసుకుని గాజుపాత్రలో రసం పిండాలి. ఈ రెండెంటినీ బ్లెండర్‌లో వేసి, ఒక కప్పు నీళ్లు పోసి బాగా బ్లెండ్ చేయాలి. ఇలా చేసిన జ్యూసును ఉదయమే ఖాళీ కడుపుతో తీసుకుంటే చాలా మంచిది.

పాలకూరలో ఎన్నో పోషకాలుంటాయి. ఇది చర్మాన్ని మెరిపిస్తుంది. దీనివల్ల ఆరోగ్య ప్రయోజనాలు కూడా బోలెడు ఉన్నాయి. అవేమిటో తెలుసుకుందాం...

- పాలకూర తినడం వల్ల కంటిచూపు మెరుగవుతుంది.
- వయసు వల్ల వచ్చే మాక్యులర్ డీజనరేషన్ తలెత్తకుండా నిరోధిస్తుంది.
- రక్తపోటు సాధారణస్థాయిలో ఉండేలా చూస్తుంది.

## పాలకూరలో ఎన్ని పోషకాలో...

- ఆస్టియోపొరాసిస్, గుండెజబ్బులు రాకుండా కాపాడుతుంది.
- జీవక్రియను పెంపొందిస్తుంది. జీర్ణవ్యవస్థ బాగా పనిచేసేలా తోడ్పడుతుంది.
- ఇందులోని విటమిన్‌కె హిమోఫీలియా చికిత్సకు సహాయపడుతుంది. రక్తస్రావాన్ని ఆపే గుణం పాలకూరలో ఉంది.
- పాలకూరలోని విటమిన్‌కె వల్ల కాల్షియం ఉత్పత్తి అయి ఎముకలు పటిష్టంగా ఉంటాయి.
- శుక్లాల రిస్కును తగ్గిస్తుంది. గాస్ట్రిక్ అల్సర్లను నివారిస్తుంది.
- కడుపులోని శిశువు ఆరోగ్యంగా పెరిగేలా, నాడీ వ్యవస్థ బలంగా ఉండేలా సహాయపడుతుంది.
- ఎసిడిటీని తగ్గిస్తుంది. క్యాన్సర్ బారిన పడకుండా నిరోధిస్తుంది.
- అతినీలలోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షించడంతో పాటు దీర్ఘకాలంలో చర్మ కాన్సర్ బారిన పడకుండా కాపాడుతుంది. యాక్నే సమస్యను నివారిస్తుంది. చర్మం కాంప్లెక్షన్ పెరుగుతుంది. కళ్ల కింద ఏర్పడ్డ నల్లటి వలయాలు పోతాయి.
- యాంటిఏజింగ్ గుణాలు పాలకూరలో బాగా ఉన్నాయి.

పాలకూరలో ఫ్యాట్, క్యాలరీలు తక్కువ. అందుకే దీన్ని తినడం వల్ల బరువు తగ్గుతాం. ఇందులో కొవ్వును కరిగించే డయటరీ పీచుపదార్థాలున్నాయి.

- ఈ పీచుపదార్థాల వల్ల మలబద్ధకం సమస్య పోవడంతోపాటు అతిగా తినడం తగ్గుతుంది.

## సలాడ్స్ ఎలా..?

**నేను కీటో డైట్ చేస్తున్నా. వెజిటబుల్ సలాడ్ తీసుకోమన్నారు. సలాడ్స్ ఎలా తయారుచేయాలి? ఎప్పుడు తీసుకోవాలి? అన్ని కూరగాయలు ఉపయోగించొచ్చా? సలాడ్‌లో ఆలివ్ ఆయిల్ ఉపయోగించవచ్చా? దయచేసి సవివరంగా చెప్పండి.**

సలాడ్స్ అనేవి అత్యంత ఆరోగ్యకరమైనవి. కీటో డైట్‌లో సలాడ్స్‌దే పెద్ద పీట. ఆకలిని తట్టుకోవడానికి, అవసరమైన విటమిన్స్, పీచుపదార్థాలు ఇందులో ఉంటాయి. అంతేకాదు సలాడ్స్ నుంచి బోలెడన్ని యాంటీ ఆక్సిడెంట్స్ వస్తాయి. ఇవి ముఖ్యంగా డైట్ చేస్తున్నప్పుడు చాలా అవసరం.

**సింపుల్‌గా సలాడ్ చేయడానికి కావాల్సిన పదార్థాలు...**

పచ్చి కాయగూర ముక్కలు, ఉప్పు, మిరియాల పొడి, నిమ్మరసం. అన్నింటిని కలిపి భోజనంతో పాటు ఒక సైడ్ డిష్‌లా తీసుకుంటే ఆరోగ్యకరం.

భోజనంతో పాటు తినడం వల్ల ఆహారం సమతుల్యం అవుతుంది. భోజనం తగ్గి బరువు తగ్గుతారు. కొందరు భోజనానికి భోజనానికి మధ్య సలాడ్స్ తింటారు. ఇలా చేయడం వల్ల భోజనం మోతాదు తగ్గదు. పైగా కొన్ని పోషకాలు అందవలసిన టైమ్‌లో అందవు. అందుకే సలాడ్స్ భోజనంతో పాటు తింటే బరువు తగ్గే అవకాశం ఉంది.

కీర, దోసకాయ, టొమాటో, క్యారెట్, బీట్‌రూట్, క్యాప్సికమ్, ఉల్లి, బ్రొకోలీ, కొత్తిమీర సలాడ్స్‌లో తీసుకోవచ్చు.

బెండకాయలు, దొండకాయలు, చిక్కుడు, బీన్స్, ఆలుగడ్డ, స్వీట్ పొటాటో, క్యాబేజీ, కాలీఫ్లవర్ మొదలైనవి సలాడ్‌లో తీసుకోవాలనుకుంటే, ఆ పూట భోజనం మానేసి కేవలం సలాడ్ తీసుకోవాలి. కొన్ని కాయగూరల్ని ఉడికించి, లేక మగ్గించి సలాడ్ రూపంలో తీసుకోవచ్చు.

తాజా సలాడ్స్ తీసుకుంటున్నప్పుడు కొద్దిగా ఆలివ్ ఆయిల్ స్ప్రే చేసుకోవచ్చు. ఉడికించిన లేక మగ్గించిన సలాడ్ తీసుకున్నపుడు కూడా ఆలివ్



ఆయిల్ ఉపయోగించొచ్చు. కీటో డైట్ చేస్తున్నారు కాబట్టి మీరు కొబ్బరినూనె ఉపయోగించండి.

సలాడ్స్ అంటే రుచి లేనివి, గడ్డి తిన్నట్టే, ఎందుకు ఈ బతుకు అని మాత్రం అనుకోవద్దు. సలాడ్స్ తినడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా జీర్ణకోశం శుభ్రపడుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. సో.. సలాడ్స్‌ని రుచిగా తయారుచేసుకుని తినండి. సోయా సాస్, చిల్లీ సాస్, జీలకర్ర పొడి, చాట్ మసాలా మొదలైనవి రుచి కోసం వాడుకోవచ్చు.

## ఆఫీసులో అతిగా తింటున్నారా?

చాలామంది ఉద్యోగినులకు ఆఫీసులో స్నాక్స్ తినే అలవాటు ఉంటుంది. గంటకో రెండుగంటలకో ఓ సారి బిస్కట్లు, లేదా చిప్స్ వంటివి తింటూంటారు. ఈ అలవాటే వారిని ఊబకాయం వైపు నడిపిస్తోందంటున్నారు నిపుణులు. ఆఫీసులో స్నాక్స్ తీసుకునే వారి శరీరంలోకి ఏడాదికి లక్ష కేలరీలు వచ్చి చేరుతాయట! ఒకటి రెండు బిస్కట్లు కన్నా ఎక్కువ తిన్నా, మిల్క్ కాఫీ రెండు సార్లు కన్నా ఎక్కువ తాగితే 80నుంచి 100 కేలరీలు అదనంగా వచ్చి చేరతాయంటున్నారు. అంతే కాకుండా కొందరికి




కేకులు తినే అలవాటు ఎక్కువగా ఉంటుంది. ఒక్కోకేకులో పది నుంచిపన్నెండు గ్రాముల ఫ్యాట్, 300నుంచి 400 కాలరీలు ఉంటాయి. ఇవి రోజుకు ఒకటి తిన్నా కూడా ఊబకాయం రావడం ఖాయం అంటున్నారు నిపుణులు. ముఖ్యంగా కూర్చుని పనిచేసే మహిళలు వీటికి ఆమడ దూరంలో ఉండాల్సిందే అని వారు చెబుతున్నారు. పనిమధ్యలో ఏదైనా తినాలని అనిపించినా, పళ్ళు, కూరగాయల ముక్కలు తినడం మేలని వారు సూచిస్తున్నారు.

## రాగి మొలకల జావ

గుండె లవ్ డబ్ అని కొట్టుకోవాలంటే ప్రేమలో పడటం ఒక్కటే సరిపోదు. గుండెకు రక్తవృద్ధి సక్రమంగా జరగాలి. అందుకోసం ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఇందుకోసం రాగులు వాడాలి. రాగులను ఎండబెట్టి పిండి కొట్టించి వండుకునే జావ కంటే, మొలకెత్తించి తయారు చేసుకునే రాగి పిండిలో ఎక్కువ పోషకాలు ఉంటాయి. ఇందుకోసం....

- రాగులను శుభ్రం చేసుకుని, రాత్రంతా నీళ్లలో నానబెట్టాలి.
- మరుసటి రోజు శుభ్రమైన పలుచని కాటన్ టవల్‌లో రాగులను మూటగట్టి పైన బరువుంచాలి.
- తర్వాతి రోజుకి రాగులు మొలకెత్తుతాయి.
- ఇలా మొలకెత్తిన రాగులను ఒక రోజంతా నీడలో ఎండబెట్టి, పిండి కొట్టుకోవాలి.
- ఈ పిండితో జావ లేదా సంకటి తయారు చేసుకుంటే రెట్టింపు పోషకాలు, ఐరన్ అందుతాయి.







# దేవదేవుడు...
# శ్రీ వేంకటేశుడు

**'వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి'**

బ్రహ్మాండంలో వేంకటాద్రికి సమానమైన పుణ్యక్షేత్రం లేదు. అలాగే శ్రీనివాసుడికి సాటిరాగల దేవుడు ఇటు భూత కాలంలో కానీ.. అటు భవిష్యత్తులో కానీ మరెవరూ ఉండరు... ఇదీ శ్లోకానికి అర్థం.

తిరుమల పుణ్యక్షేత్రం 'కలియుగ వైకుంఠ'మని ప్రసిద్ధి. ఈ ప్రశస్తికి మూలకారణం.. స్వయం వ్యక్త స్వరూపంలో వెలిసిన శ్రీవేంకటేశ్వరుడు. తిరుమలగిరిపై పవిత్రాద్భుతమైన ఒక సాలగ్రామశిల ద్వారా స్వయంభూగా వెలసిన శ్రీ వేంకటేశ్వరుణ్ణి శ్రీనివాసుడని, సప్తగిరీశుడని, ఏడుకొండలవాడని, బాలాజీ, తిరుమలప్ప, తిమ్మప్ప అని.. ఇలా ఎన్నో పేర్లతో భక్తజనులు ఆర్తిగా సంబోధిస్తూ ఉన్నారు. ఆనందనిలయుడైన శ్రీవారు నెలకొన్న బంగారు మందిరానికి 'ఆనంద నిలయ'మనే వ్యవహారం అనాదిగా ప్రసిద్ధమై ఉంది.

## స్థలపురాణం

కలియుగారంభంలో... అనగా సుమారు 5వేల సంవత్సరాల క్రితం.. వక్ష స్థల మహాలక్ష్మి సమేతంగా ఆవిర్భవించిన శ్రీనివాసునికి తరతరాలుగా ఎందరో భక్తులు మందిర, గోపుర, ప్రాకార, మహాద్వారాలు నిర్మిస్తూ వచ్చారు. వేంకటపతికి నిత్యోత్సవ, వార్షికోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నారాయణవనం అధిపతులు ఆకాశ రాజు, తొండమాన్ చక్రవర్తి, పల్లవరాణి సామవై, విజయ నగర సామ్రాజ్యాధీశులు సాళువ నరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయలు, తిరుమలరాయలు, అచ్యుతరాయలు ఇలా.. ఎందరో మహానుభావులు.. ఇక్కడ అద్భుత నిర్మాణాలను చేపట్టి అపూర్వసేవా కైంకర్యాల నెలవుగా తిరుమల క్షేత్రాన్ని తీర్చిదిద్దారు.

శ్రీవారిని దర్శించుకునే భక్తులు ముందుగా క్షేత్రపాలకుడైన వరాహస్వామివారిని దర్శించుకోవాలని స్థలపురాణంలో ఉంది. అలాగే స్వామి వారి దర్శనానంతరం... తిరుపతిలో పద్మావతి/బీబీనాంచారి/అలివేలుమంగ అమ్మ వారిని, గోవిందరాజస్వామి వారిని దర్శించుకోవాలి. తిరుమలగిరులలో ఉన్న పవిత్ర ఆకాశగంగ.. పాపనాశనం.. వకుళమాత ఆలయం,, హాథీరాంజీ మఠం.. త్రిదండి జీయర్‌స్వామివారి మఠం..వన్యప్రాణుల పార్క్.. వంటి ఆధ్యాత్మికపర్యాటక ప్రాశస్త్యమున్న ప్రాంతాల్ని దర్శించుకోవచ్చు. తితిదే బస్సు సర్వీసులతో పాటు ఆయా ప్రదేశాలకు ప్రైవేటు వాహనాలూ అందుబాటులో ఉంటాయి. తలనీలాలు మొక్కుబడి ఉన్నవారు తప్పనిసరిగా స్వామివారి 'కల్యాణకట్ట' వద్దనే తలనీలాలు సమర్పించాలి

## తితిదే ప్రకటించిన వేళల వివరాలివీ:

| వారం | సమయం |
|---|---|
| ఆదివారం | ఉదయం 9గం. నుంచి సాయంత్రం 7గం. వరకు |
| సోమవారం | ఉదయం 9గం. నుంచి సాయంత్రం 7గం. వరకు |
| మంగళవారం | ఉదయం 9గం. నుంచి సాయంత్రం 7 గం. వరకు |
| బుధవారం | ఉదయం 10గం. నుంచి సాయంత్రం 7గం. వరకు |
| గురువారం | ఉదయం 9గం. నుంచి సాయంత్రం 4గం. వరకు |
| శుక్రవారం | ఉదయం 10గం. నుంచి సాయంత్రం 4గం. వరకు |
| శనివారం | ఉదయం 7 గం. నుంచి సాయంత్రం 4 గం. వరకు |

## వృద్ధులకు, వికలాంగులకు దర్శన వేళలు:

శ్రీవారి దర్శనానికి వచ్చే వికలాంగులు, వృద్ధులకు తితిదే ప్రత్యేక ప్రవేశ అవకాశం కల్పిస్తోంది. మందిరం మహాద్వారం సమీపం నుంచి ఆలయంలోకి చేరుకునే సౌలభ్యం కల్పించింది. నిత్యం ఉదయం 10, మధ్యాహ్నం 3గంటలకు ఆలయ ప్రవేశాలకు అనుమతిస్తుంది. ఈ దర్శన సమయాల కన్నా గంట ముందుగా ఆయా భక్తులు పరిశీలనకు హాజరవ్వాల్సి వుంటుంది. 65 ఏళ్లకు పైబడిన వృద్ధులకు వయస్సు ధ్రువీకరణ పత్రం ఆధారంగా అనుమతిస్తారు. నడవలేని పరిస్థితిలో ఉన్నవారి వెంట సహాయకులను అనుమతిస్తారు. వికలాంగులు, గుండె జబ్బుతో ఆపరేషన్ చేసుకున్న భక్తులను వైద్యులు జారీచేసి పత్రాల పరిశీలన అనంతరం అనుమతిస్తారు. బ్రహ్మోత్సవాలు వంటి విశేష పర్వదినాల్లో ఈ దర్శనాలను తితిదే రద్దు చేస్తుంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని తితిదే ముందుగానే ప్రకటిస్తుంటుంది.

## తిరుపతి, తిరుమలకు ప్రయాణ సదుపాయాలు

తిరుమల, తిరుపతి శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తు



లకు రోడ్డు.. రైలు.. ఆకాశ మార్గాల్లో విస్తృతమైన ప్రయాణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకునే భక్తులకు స్టేషన్ ఎదురుగానే కొండపైకి తీసుకెళ్లే ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి తిరుమలకు ప్రతి నిమిషానికో బస్సు చొప్పున బ్రహ్మోత్సవాల సమయంలో నడుస్తుంటాయి. ప్రీపెయిడ్ ట్యాక్సీలు కూడా అందుబాటులో ఉంటాయి.

రేణిగుంట విమానాశ్రయం నుంచి నిత్యం మధ్యాహ్నం ఒక ఆర్టీసీ సూపర్ లగ్జరీ సర్వీసు నిర్వహిస్తున్నారు. ఈ బస్సు తిరుమల నుంచి ఉదయం 11 గంటలకు బయల్దేరి.. రేణిగుంట విమానాశ్రయానికి మధ్యాహ్నం 12.30 నిమిషాలకు చేరుతుంది. తిరిగి విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుమలకు బయల్దేరుతుంది. విమానాశ్రయంలో ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి. తిరుపతి కేంద్రంగా ఉన్న ట్రావెల్ కంపెనీలకు సమాచారం ఇచ్చే పక్షంలో వాహనాలను సమకూర్చుతారు. అన్ని రకాల సొంత వాహనాలనూ తిరుమల వెళ్లేందుకు తితిదే అనుమతిస్తోంది. అలిపిరి భద్రతా వలయంలో తనిఖీలు నిర్వహించుకున్న అనంతరం టోల్ రుసుం చెల్లించి ఆయా వాహనాల్లో తిరుమలకు రావాల్సి ఉంటుంది. అన్ని రకాల వాహనాలు అలిపిరి నుంచి తిరుమలకు రెండో కనుమ రహదారిలో 28 నిమిషాల వ్యవధిలో చేరుకోవచ్చు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని తితిదే వేగ నియంత్రణ చర్యలు చేపట్టింది. అదేవిధంగా తిరుమల నుంచి తిరుపతికి మొదటి కనుమ రహదారిలో ప్రయాణ సమయం 45 నిమిషాలు తీసుకోవాల్సి వుంటుంది. నిర్దేశిత సమయం కంటే ముందుగా వచ్చే పక్షంలో సంబంధిత వాహనాలను తిరుమలకు 10 రోజులపాటు రాకుండా నిషేధం విధిస్తూ చర్యలు తీసుకుంటారు! రెండోసారి కూడా నిబంధనలు పాటించని పక్షంలో జరిమానా విధిస్తారు. సమయాన్ని లెక్కించడానికి అలిపిరి భద్రతావలయంలో వాహనదారులకు తితిదే బార్ కోడింగ్ రశీదులను జారీ చేస్తుంది.

## కాలినడకన వెళ్లే భక్తుల కోసం

అలిపిరి, శ్రీవారి మెట్టు నుంచి తిరుమలకు కాలినడకన రావడానికి తితిదే అనుమతిస్తుంది. అలిపిరి నుంచి 24 గంటల సమయం, శ్రీవారి మెట్టు ల నుంచి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ప్రవేశం కల్పిస్తుంది. గరుడోత్సవం సమయంలో 24 గంటల సమయం అనుమతించాలని నిర్ణయించింది. అడవి జంతువులను దృష్టిలో పెట్టుకుని శ్రీవారి మెట్టు మార్గంలో పగటి సమయంలో మాత్రమే భక్తుల రాకపోకలకు అనుమతిస్తున్నారు. వీరికి మార్గమధ్యంలో దివ్యదర్శనం టోకెన్లను తితిదే ఉచితంగా జారీ చేస్తుంది. టోకెన్లను పొందిన భక్తులకు శ్రీవారి దర్శనం ఉచితంగా కల్పించడంతో పాటు ఒక లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తారు. రెండు లడ్డూలు కావాలంటే రూ. 10 చొప్పున రాయితీపై అందజేస్తారు. అవసరమైన వారు రూ. 25 ధరపై మరో రెండు లడ్డూలూ పొందవచ్చు. భక్తుల లగేజీని తితిదేయే తిరుమలకు ఉచితంగా చేరవేస్తుంది. అలిపిరి, శ్రీవారిమెట్టు ప్రవేశమార్గంలో ఈ ఉచిత లగేజీ రవాణా కేంద్రాలు ఉన్నాయి. అక్కడ భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసి రశీదు చూపి ఈ లగేజీని తీసుకోవచ్చు.

బ్రహ్మోత్సవాల సమయంలో తితిదే ప్రత్యేక ప్రవేశ దర్శనాల టికెట్లను కరెంటు బుకింగ్ కింద ఇవ్వడాన్ని రద్దు చేస్తుంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నారు. అడ్వాన్స్ బుకింగ్ కింద నిత్యం అంతర్జాలంలో 6వేలు, ఇదర్శన కౌంటర్ల ద్వారా మరో 5వేల టికెట్లను రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. టికెట్లలో నిర్దేశించిన సమయానికి ఆయా భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో శ్రీవారి దర్శనానికి హాజరుకావాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డు, సంప్రదాయ దుస్తులు ధరించని పక్షంలో శ్రీవారి దర్శనానికి అనుమతించరు. ఒక్కో టికెట్‌పై రెండు ప్రసాద లడ్డూలు ఉచితంగా అందజేస్తారు.

తిరుమలలో భక్తులందరికీ తితిదే స్వామివారి అన్న ప్రసాదం అందజేస్తోంది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో ఉదయం 9.30 నుంచి రాత్రి 10 గంటల వరకూ ఈ అన్నప్రసాదం అందుబాటులో ఉంటుంది. ఎలాంటి సిఫార్సు లేకుండా ప్రతిఒక్కరూ ఈ అన్న ప్రసాదాన్ని ఉచితంగా స్వీకరించవచ్చు. బ్రహ్మోత్సవాల్లో రద్దీ ప్రాంతాలను గుర్తించి అక్కడే భక్తులకు అల్పాహారం, పానీయాలనూ అందించేందుకు తితిదే ఏర్పాట్లు చేస్తోంది.

## వసతి సౌకర్యం

స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు 24 గంటల పాటు ఉచిత వసతి కల్పిస్తారు. తితిదే ఆధ్వర్యంలో తిరుపతితిరుమల ప్రాంతాల్లో సుమారు 15వేల కాటేజ్‌లు భక్తుల కోసం అందుబాటులో ఉన్నాయి. హాథీరాంజీ మఠం, జీయర్ మఠం, శంకరమఠం తదితర సంస్థల ఆధ్వర్యంలోనూ వసతి లభిస్తుంది.

ఇవికాక ఆర్జితసేవలు పొందేవారి కోసం ప్రత్యేక కాటేజ్‌లు ఉన్నాయి. అలాగే వివిధ రాష్ట్రాల టూరిజం శాఖల అతిథిగృహాలు, వివిధ ఆధ్యాత్మిక సంస్థల అద్దెగదులు అందుబాటులో ఉన్నాయి. ముందస్తు రిజర్వేషన్, ఇతర వివరాలకు తితిదే కార్యాలయంలో సంప్రదించాలి

## ప్రధాన/ ప్రత్యేక పూజలు:

నిత్యసేవలు: సుప్రభాతం
ప్రవేశం: ఒకరికిరోజు: నిత్యంటిక్కెట్టు ధర: రూ. 120
నిత్యసేవలు: తోమాల
ప్రవేశం: ఒకరికిరోజు: మంగళ, బుధ, గురుటిక్కెట్టు ధర: రూ.220
నిత్యసేవలు: అర్చన
ప్రవేశం: ఒకరికిరోజు: మంగళ, బుధ, గురుటిక్కెట్టు ధర: రూ.220
నిత్యసేవలు: కల్యాణోత్సవం
ప్రవేశం: ఇద్దరికిరోజు: నిత్యంటిక్కెట్టు ధర: రూ. 1000
నిత్యసేవలు: ఆర్జిత బ్రహ్మోత్సవం
ప్రవేశం: ఒకరికి రోజు: నిత్యంటిక్కెట్టు ధర: రూ.200
నిత్యసేవలు: డోలోత్సవం
ప్రవేశం: ఒకరికిరోజు: నిత్యంటిక్కెట్టు ధర: రూ.200
నిత్యసేవలు: సహస్ర దీపాలంకరణ సేవ
ప్రవేశం: ఒకరికిరోజు: నిత్యంటిక్కెట్టు ధర: రూ.200
నిత్యసేవలు: వారం సేవలు విశేషపూజ
ప్రవేశం: ఒకరికిరోజు: సోమవారంటిక్కెట్టు ధర: రూ.600
నిత్యసేవలు: అష్టదళ పాదపద్మారాధనం
ప్రవేశం: ఒకరికిరోజు: మంగళవారం టిక్కెట్టు ధర: రూ. 1,250నిత్యసేవలు: సహస్ర కలశాభిషేకం
ప్రవేశం: ఒకరికిరోజు: బుధవారంటిక్కెట్టు ధర: రూ.850
నిత్యసేవలు: తిరుప్పావడ సేవ
ప్రవేశం: ఒకరికిరోజు: గురువారంటిక్కెట్టు ధర: రూ.850
నిత్యసేవలు: అభిషేకం
ప్రవేశం: ఒకరికిరోజు: శుక్రవారంటిక్కెట్టు ధర: రూ.750
నిత్యసేవలు: నిజపాద దర్శనం

## శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన వేళలు

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రత్యేక దర్శనవేళలు ఒక్కోరోజు ఒక్కోవిధంగా ఉంటాయి. స్వామివారికి జరిగే నిత్య, వారపు సేవలను బట్టి ఆయా సమయాలను తితిదే నిర్దేశించింది. టిక్కెట్లను ముందస్తుగా అంతర్జాలం, ఈదర్శన్, తపాలా శాఖ ద్వారా విక్రయిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రంలోపు నిర్దేశించిన సమయంలోపు శ్రీవారిని దర్శించుకునే వేళలను ఎంపిక చేసుకోవచ్చు. ఎంపిక చేసుకున్న సమయం టిక్కెట్టుపై ముద్రితమవుతుంది. ఈ సమయానికి మాత్రమే ఆలయానికి చేరుకోవడానికి వరుస వద్దకు రావాల్సి ఉంటుంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను నిత్యం రూ.300 ధర వంతున 26వేల టిక్కెట్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 56 రోజులకు ముందుగా టిక్కెట్లను పొందే అవకాశం ఉంది. విశేష పర్వదినాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని టిక్కెట్ల సంఖ్యను దేవస్థానమే తగ్గిస్తుంది.

---

# కుటుంబమే కేంద్రబిందువు!

ఆదాము చేసిన తొలి పాపం దేవుని ఆజ్ఞను ఉల్లంఘించడమే! ఏదెను తోటలోని ఒక చెట్టు ఫలాన్ని తినవద్దని అతని మేలు కోసమే దేవుడు ఖండితంగా ఆజ్ఞాపించాడు. కాని హవ్వ వచ్చి "పరవాలేదు తిను!" అని చెబితే, దేవుని ఆజ్ఞను పక్కన పెట్టి ఆదాము దాన్ని తిన్నాడు. అలా లోకంలో తమకు



ఆప్తులైన వారిని సంతోషపెట్టేందుకూ, ఇతర స్వార్థప్రయోజనాలను ఆశించీ దేవుణ్ణి బాధపెట్టి సమాజంలో కీడుకు బాధ్యులవుతున్న వారి సంఖ్య ఈనాటికీ బాగా విస్తరిస్తోంది.

కుటుంబానికి భర్త లేదా తండ్రి నాయకుడు, యజమాని. కుటుంబంలో అస్తవ్యస్తమైన పరిస్థితులు ఉంటే దేవుడు పురుషుణ్ణే నిలదీస్తాడు, ఎందుకంటే 'కుటుంబ బాధ్యత' ప్రాథమికంగా పురుషుడిది. అయితే యజమానిగా పురుషుడు తప్పకుండా తన భార్యను అన్ని విషయాల్లో సంప్రతించాలి (ఆది 21:12). భార్య తన భర్తను చెప్పుచేతల్లో పెట్టుకోవాలనుకున్నా, కుటుంబ వ్యవహారాల్లో భార్యను సంప్రదించడాన్ని భర్త తేలిగ్గా తీసుకున్నా అందుకు దేవుడు అనుమతించడు. కుటుంబం సవ్యంగా సాగాలంటే, అది దైవ నిర్ణాయక విధానంలో సాగితేనే సాధ్యం. 'సమాజంలోని కీడు'కు ఆరంభ కేంద్రం కుటుంబమే! దైవ నిర్ణయాలను ఉల్లంఘించిన కుటుంబంలో ఆరంభమైన కీడే సమాజంలోకి విస్తరిస్తుంది. మొత్తం లోకాన్ని కలుషితం చేస్తుంది. కాబట్టి 'సమాజ ప్రక్షాళన' కుటుంబం నుంచే ఆరంభం కావాలి.

---

# ఆర్జన ధర్మ సమ్మతంగా ఉండాలి!

మనిషికి ఈ ప్రపంచంలో డబ్బు సంపాదించడాన్ని ఒక పరీక్షగా అల్లాహ్ పెట్టాడు. అతడికి పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని ప్రసాదించాడు. మనిషి కోరుకుంటే ధర్మసమ్మతమైన మార్గాల ద్వారా ఉపాధిని అన్వేషించవచ్చు. లేదా అధర్మమైన మార్గాలను అనుసరించి ధనరాశులను కూడబెట్టవచ్చు. కాని ప్రళయదినాన అల్లాహ్ సమక్షానికి హాజరై, తప్పనిసరిగా సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. ఆ రోజున అల్లాహ్ అతను సంపాదించిన ధనం గురించి ప్రశ్నిస్తాడు. "నువ్వు కూడబెట్టిన ధనాన్ని ఎలా సంపాదించావు? దాన్ని ఎలా ఖర్చు చేశావు?" అని.

"ప్రజలారా! ఒకరి సొమ్మును మరొకరు అధర్మంగా తినకండి. పాపాలకు మీరు దూరంగా ఉంటే, మీ చిన్న దోషాలను లెక్కలోంచీ తీసేస్తాం. మిమ్మల్ని గౌరవ స్థానాల్లో ప్రవేశింపజేస్తాం" అని దివ్య ఖుర్ఆన్ అన్నిసాలో పేర్కొన్నారు.

దైవ ప్రవక్త ఇలా తెలిపారు: "నిషేధించిన పద్ధతుల్లో చేసిన (హరామ్) సంపాదనతో పోషించిన శరీరం స్వర్గంలో ఎంతమాత్రం ప్రవేశించలేదు. ఆ శరీరం నరకానికి పోయే అర్హత కలిగి ఉంటుంది.



నిషేధిత సంపాదన సత్కార్యాలను నాశనం చేస్తుంది. ఇహలోక జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. అంటే మనిషి చేసే దుఆ(ప్రార్థన)కు దైవామోదం ఏమాత్రం లభించదు. మనిషి అన్ని వేళల్లో, అన్ని కార్యాల్లో నిస్సహాయుడు. ప్రతి విషయంలో దైవ సహాయం తప్పకుండా అవసరం అవుతుంది. అప్పుడు అతను రెండు చేతులనూ పైకెత్తి అల్లాహ్‌ను వేడుకుంటాడు. అలా ఎలుగెత్తి పిలిచిన తన ప్రతి భక్తుడి వైపూ కరుణామయుడైన అల్లాహ్ మరలుతాడు. అతడి వేడుకోలును ఆలకిస్తాడు. అతడి అవసరాలను తీర్చుతాడు. కానీ ఎవరైతే నిషేధిత పద్ధతుల్లో సంపాదించిన ధనం కలిగి ఉంటాడో, బంధుత్వ సంబంధాలను తెంచుకుంటాడో అటువంటి వ్యక్తి ఎంతగా మొరపెట్టినా, అతడి ప్రార్థనలను ఆలకించడు. అతడి అవసరాలను తీర్చడు. చివరకు ఈ స్థితిలో అతడు పవిత్ర గృహమైన మక్కాకు వెళ్ళి ప్రార్థించినా సరే!"

# దేవర విడుదలలో మళ్లీ అనుమానాలు

ఈ మధ్యకాలంలో తెలుగు సినీ పరిశ్రమలో సినిమాల రిలీజ్ డేట్స్‌పై పెద్ద చర్చలే జరుగుతున్నాయి. సినిమాల మధ్య ఎక్కువగా క్లాష్ రాకూడదని, అన్ని సినిమాలకు సమానంగా లాభాలు వచ్చేలా చూడాలని నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు చర్చించుకొని మూవీస్ రిలీజ్ డేట్స్‌ను అనౌన్స్ చేస్తూ ఎవరికీ నష్టం జరగకుండా చూస్తున్నారు. సంక్రాంతి సినిమా విడుదలల సమయంలో కూడా అదే జరిగింది. అప్పుడు చాలా



చిత్రాలు సంక్రాంతికే విడుదల అవ్వాలని నిర్ణయించుకోగా.. దిల్ రాజు సమక్షంలో మీటింగ్ పెట్టి 'ఈగల్' వెనక్కి తప్పుకుంటున్నట్టు తెలిపారు. కొరటాల శివ, ఎన్‌టీఆర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'దేవర' భారీ స్థాయిలో చిత్రీకరణ జరుపుకుంటోంది. అందుకే ఏ పోటీ లేకుండా ఈ మూవీని ఏప్రిల్ 5న విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించుకున్నారు. ఈ మూవీని సోలో రిలీజ్ చేయడానికి సూర్య హీరోగా నటిస్తున్న 'కంగువ'ను సైతం వెనక్కి తప్పించారు. కానీ ఇంతలోనే ఫ్యాన్స్‌కు ఊహించని ట్విస్ట్ ఇచ్చారు 'దేవర' మేకర్స్. ఈ సినిమా పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్సులు ఉన్నాయని టాలీవుడ్‌లో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇక తాజాగా ఇదే విషయంపై దిల్ రాజు క్లారిటీ ఇచ్చారు. అంతే కాకుండా తను నిర్మిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' రిలీజ్ డేట్ గురించి కీలక అప్డేట్‌ను అందించారు. అయితే 'దేవర' పోస్ట్‌పోన్ అయినట్టేనా అని అడగగా.. ఒకవేళ పోస్ట్‌పోన్ అయితే మేము వస్తామని చెప్తున్నామంటూ 'ఫ్యామిలీ స్టార్' గురించి స్పష్టం చేశారు. ప్రస్తుతం దిల్ రాజు నిర్మిస్తున్న పలు చిత్రాల్లో విజయ్ దేవరకొండ, పరశురామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఫ్యామిలీ స్టార్' కూడా ఒకటి. ఈ మూవీ సంక్రాంతికే విడుదల కావాల్సి ఉన్నా.. పోటీ ఎక్కువగా ఉండడంతో సమ్మర్‌కు పోస్ట్‌పోన్ అయ్యింది. ఈగల్' సోలో రిలీజ్ అవుతుందని అప్పట్లో ఆ మూవీ నిర్మాతలకు మాటిచ్చారు దిల్ రాజు. కానీ ఇప్పుడు దానికి పోటీగా 'ఊరి పేరు భైరవకోన' వస్తున్నట్టు ప్రకటించింది. అదే విషయంపై మాట్లాడుతూ.. 'ఊరి పేరు భైరవకోన' పోస్ట్‌పోన్ చేయడానికి నిర్మాతలు ఒప్పుకున్నారని దిల్ రాజు ప్రకటించారు. ఫిబ్రవరి 9న నాలుగు సినిమాలు ఉన్నాయి. 16న ఫ్రీగా ఉంది అని రాజేశ్, అనిల్‌కు నేనే చెప్పాను. మాట్లాడగానే వాళ్లు ఒప్పుకొని 16న వస్తున్నారు. ఒక వారం లేట్‌గా వాళ్లు వస్తున్నారు. ఎలాగో వాళ్ల పాట పెద్ద హిట్ అయ్యింది. సినిమా కూడా హిట్ కావాలని అందరం కోరుకుంటున్నాం. దాదాపు వాళ్లకు సోలో రిలీజ్‌లాగానే ఉంది. ఏదైనా చిన్న సినిమాలు వస్తాయేమో కానీ ఎక్కువశాతం వాళ్లది సోలో రిలీజ్ ఉంటుంది' అంటూ 'ఊరి పేరు భైరవకోన' పోస్ట్‌పోన్‌పై దిల్ రాజు క్లారిటీ ఇచ్చారు. 'ఈగల్' ఫిబ్రవరి 9న, 'ఊరి పేరు భైరవకోన' ఫిబ్రవరి 16న ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.



# శరవేగంగా పుష్ప చిత్రీకరణ

పుష్ప చిత్రం దేశవ్యాప్తంగా ఎంత సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా పుష్ప-2 సినిమా తెరకెక్కుతోంది. తొలి భాగం సాధించిన విజయంతో సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో మేకర్స్, ముఖ్యంగా సుకుమార్ ఈ చిత్రాన్ని పార్ట్-1ను మించేలా జాగ్రత్తగా తెరకెక్కిస్తున్నాడు. అదీ కాక ఈ చిత్రానికి అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారం దక్కడంతో ఎంతో బాధ్యతతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రష్మిక మందన్నా కథానాయికగా, పాహాద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోండగా దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించగా ఓ రెండు మూడ్రోజుల నుంచి పుష్ప-2 విడుదల వాయిదా అంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై బన్నీ డిజిటల్ టీమ్ వివరణ కూడా ఇచ్చింది. అనుకున్న సమయానికే పుష్పరాజ్ ర్యాంపేజ్ ఖాయం అంటూ ట్వీట్ సైతం చేశారు. తాజాగా సుకుమార్ టీమ్ మరోసారి ఈ చిత్రం విడుదల తేదీ విషయంలో స్పష్టతనిచ్చింది. ఇంకా 200 రోజుల్లో పుష్పరాజ్ రూల్స్ ప్రారంభం కానున్నాయి' అని చెబుతూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో పుష్ప-2 విడుదలలో ఎలాంటి మార్పు లేదని మరోసారి క్లారిటీ ఇచ్చినట్లైంది.




# అరుంధతి లాగానే హనుమాన్ విజయం

టాలీవుడ్‌లో సంక్రాంతి అంటే సినిమా పండుగగా భావిస్తుంటారు. తెలుగు ప్రేక్షకులు థియేటర్లకు తరలి వచ్చే అతి పెద్ద సీజన్ కావడం, కంటెంట్ ఎలా ఉన్నా అంతో ఇంతో కలెక్షన్స్ వచ్చే ఛాన్స్ ఉంటుంది కాబట్టి, ప్రతి ఒక్కరూ అదే టైంలో రావాలని కోరుకుంటారు. అలాంటి మ్యాజిక్కే దాదాపు 15 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో రిపీట్ అయింది. సంక్రాంతి పోరు ఎంత రసవత్తరంగా ఉంటుంది.. అయితే కంటెంటే కింగ్ అని, కంటెంట్ బాగుంటే సినిమాను ఎవ్వరూ ఆపలేరని 2024 ఫెస్టివల్ సీజన్ మరోసారి నిరూపించింది. చిన్న సినిమాగా వచ్చిన 'హను-మాన్' బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేసింది. ప్రేక్షకుల హృదయాలను గెలుచుకొని పొంగల్ విన్నర్ గా నిలిచింది. ఈ క్రమంలో టాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన 'సంక్రాంతి సినిమా'గా సరికొత్త రికార్డ్ సృష్టించింది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తేజ సజ్జ, అమృత అయ్యర్ ప్రధాన పాత్రలతో తెరకెక్కిన పాన్ ఇండియా సూపర్ హీరో మూవీ 'హనుమాన్'. ఈ సంక్రాంతికి సూపర్ స్టార్ మహేష్ బాబు, కింగ్ అక్కినేని నాగార్జున, విక్టరీ వెంకటేష్ లాంటి స్టార్ హీరోల సినిమాలతో పాటుగా రిలీజైంది. తొలి రోజు నుంచే వాటికి గట్టి పోటీ ఇవ్వటమే కాదు, బాక్సాఫీస్ దగ్గర కంప్లీట్ డామినేషన్ చూపించింది. తెలుగులో రాష్ట్రాల్లోనే కాదు, విడుదలైన అన్ని ప్రాంతాల్లోనూ అనూహ్యమైన వసూళ్లు సాధించింది. హనుమాన్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ. 270 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్టు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి.

తెలుగులో అల్లు అర్జున్ 'అల వైకుంఠపురములో' ఇప్పటి వరకు అత్యధిక వసూళ్లు సాధించిన సంక్రాంతి చిత్రంగా ఉండగా, ఇప్పుడు హనుమాన్ సినిమా దాన్ని బీట్ చేసి టాప్ లో నిలిచింది. ఇక నార్త్ అమెరికాలో 5 మిలియన్ డాలర్లకుపైగా కలెక్షన్స్ తో దూసుకుపోతోంది. ఇప్పుడు 'హనుమాన్' మాదిరిగానే సరిగ్గా 15 ఏళ్ళ క్రితం 'అరుంధతి' సినిమా కూడా సంచలన విజయం సాధించింది. అనుష్క ప్రధాన పాత్రలో కోడి రామకృష్ణ దర్శకత్వంలో ఈ హారర్ ఫాంటసీ మూవీ తెరకెక్కింది. 2009 సంక్రాంతి కానుకగా జనవరి 16న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఎలాంటి అంచనాలు లేకుండా థియేటర్లలోకి వచ్చిన ఈ విమెన్ సెంట్రిక్ సినిమా.. స్టార్ హీరోల సినిమాల రేంజ్ లో హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో నడిచింది. రూ. 13 కోట్ల బ్జడెట్ తో తీస్తే, రూ. 70 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం అందరూ 'హనుమాన్' గురించి ఎలా మాట్లాడుకున్నారో, అప్పుడు 'అరుంధతి' గురించి కూడా అలానే మాట్లాడుకున్నారు. ఈ చిత్రం పది నంది అవార్డులు, రెండు ఫిలింఫేర్ సౌత్ అవార్డులతో సహా అనేక అవార్డులు రివార్డులు అందుకుంది.



# బూట్ కట్ బాలరాజుగా సోహైల్


బిగ్ బాస్ రియాలిటీ షోతో గుర్తింపు తెచ్చుకున్న సయ్యద్ సోహైల్, 'బూట్ కట్ బాలరాజు' అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకు రాబోతున్నారు. కోనేటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఫిబ్రవరి 2న ఈ సినిమా విడుదలకు రెడీ అవుతోంది. ఇప్పటికే ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్లు, టీజర్, ప్రమోషనల్ వీడియోలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి. సినిమాపై భారీగా అంచనాలు పెంచాయి. తాజాగా 'బూట్ కట్ బాలరాజు' ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ వేడుకలో కామెడీ బ్రహ్మ బ్రహ్మానందం, మంచు మనోజ్, సందీప్ కిషన్, సాయి రాజేష్, లక్ష్మీ భూపాల్ సహా పలువురు సినీ సెలబ్రిటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సోహైల్ తన సినిమా గురించి కీలక విషయాలు వెల్లడించాడు. అందరూ తమ సినిమా చూడాలంటూ ఎమోషనల్ అయ్యాడు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పాడు. 'మా నాన్న రిటైర్మెంట్ డబ్బులు, నేను సంపాదించిన డబ్బులు, ఇల్లు కొనేందుకు దాచుకున్న డబ్బులు ఈ సినిమా కోసం పెట్టాను. ఈ సినిమా కోసం మా సర్వస్వం ధారపోశాం. సినిమా కోసం అందరిలాగే కష్టపడ్డాం. కొన్ని సార్లు ఏడ్చాం కూడా. నన్ను నేను నిరూపించుకోవాలి అనే కసి ఏర్పడింది' అని సోహైల్ అన్నారు. ఇక తన సినిమా గురించి పెద్ద ఎత్తున ప్రమోషన్ చేయడానికి డబ్బులు లేవని చెప్పిన సోహైల్, ప్రతి ఒక్కరు థియేటర్ కు వెళ్లి చూడాలని కోరారు. స్టేజి మీద మోకాళ్ల మీద కూర్చొని అందరికీ విజ్ఞప్తి చేశారు. 'నా సినిమాను థియేటర్ కు వెళ్లి చూడండి. సినిమా గురించి ఇంత కంటే ఎక్కువ పబ్లిసిటీ చేసుకునేందుకు డబ్బులు లేవు. ఫిబ్రవరి 2న 'బూట్ కట్ బాలరాజు' సినిమా థియేటర్లలోకి వస్తుంది. మీరంతా చూసి ఆశీర్వదించండి' అంటూ కంటతడి పెట్టుకున్నారు సోహైల్. 'బూట్ కట్ బాలరాజు' సినిమాలో సోహైల్ సరసన మేఘ లేఖ హీరోయిన్ గా నటించింది. ఎండీ పాషా ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రంలో సీనియర్ నటి ఇంద్రజ, సునీల్, సిరి హన్మంతు, జబర్దస్త్ రోహిణి, ముక్కు అవినాష్, సద్దాం కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.



# వరుస సినిమాలతో బిజీగా అనుపమ

కేరళ కుట్టి అనుపమ పరమేశ్వరన్‌కు తెలుగులో ఉన్న ఫాలోయింగ్ గురించి చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంటుంది. త్వరలోనే టిల్లు స్క్వేర్ సినిమాతో రాబోతుంది ఈ బ్యూటీ. తెలుగు, తమిళ్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటుంది అనుపమ. ఉంగరాల కురులతో.. కలువ కళ్లతో యూత్‌ను కట్టిపడేస్తుంది. అటు సినిమాలు చేస్తూనే.. ఇటు సోషల్ మీడియాలో యాక్టివ్?గా ఉంటూ ఎప్పటికప్పుడు లేటేస్ట్ ఫోటోస్ షేర్ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన నెట్టింట తెగ వైరలవుతున్నాయి. అటు సినిమాలు చేస్తూనే.. ఇటు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు లేటేస్ట్ ఫోటోస్ షేర్ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన నెట్టింట తెగ వైరలవుతున్నాయి.

పట్టు చీరలో.. జడలో మ్లలెపూలు.. మెడలో తాళి చూపిస్తూ కొన్ని ఫోటోస్ షేర్ చేసింది ఈ కేరళ కుట్టి. దీంతో అనుపమ ఫోటోస్ పై ఫన్నీగా కామెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్.



# కపిల తీర్థం నంది సర్కిల్‌లో షూటింగ్

## తిరుపతిలో సందడి చేసిన ధనుష్, నాగార్జున..

నాగార్జున ధనుష్‌తో కలిసి నటిస్తున్నారు. టాలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ధనుష్ తో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నాగార్జున కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ షూటింగ్ తిరుపతిలో జరుగుతోంది. తిరుపతిలోని కపిల తీర్థం నంది సర్కిల్‌లో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో సీన్స్ ను తెరకెక్కిస్తున్నారు. నాగార్జున ఇటీవలే నాసామిరంగ



సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. సంక్రాంతికానుకగా వచ్చిన ఈ సినిమా మంచి కలెక్షన్స్ ను సాధించింది. ఇక ఇప్పుడు నాగార్జున ధనుష్ తో కలిసి నటిస్తున్నారు. టాలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ధనుష్ తో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నాగార్జున కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ షూటింగ్ తిరుపతిలో జరుగుతోంది. తిరుపతిలోని కపిల తీర్థం నంది సర్కిల్‌లో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో సీన్స్ ను తెరకెక్కిస్తున్నారు. దాంతో ఉదయం నుంచే తిరుమలకు వెళ్లే వాహనాలను పోలీసులు దారి మళ్లించారు. దాంతో విద్యార్థులు, ఉద్యోగులతో పాటు భక్తులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు భక్తులు దీని పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ.. అన్ని అనుమతులు తీసుకొనే షూటింగ్ చేస్తున్నామని మూవీ యూనిట్ చెప్తోంది.



# ఛత్తీస్‌గఢ్‌లో మావోల కాల్పులు...

- ముగ్గురు జవాన్ల మృతి
- సుక్మా జిల్లా టేకులగూడ దురుకాల్పులు
- వెంటనే స్పందించి కాల్పులు జరిపిన జవాన్లు
- అటవీప్రాంతంలోకి తప్పించుకున్న మావోలు

**రాయపూర్, వెలుతురు:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. మావోయిస్టుల కాల్పుల్లో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. సుక్మా జిల్లా టేకులగూడలో ఈ ఎదురుకాల్పుల ఘటన జరిగింది. ఈ ఘటనలో మరో 14 మంది జవాన్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఇక్కడికి 400 కిలోమీటర్ల దూరంలోని రాయ్ పూర్‌కు తరలించారు.

సుక్మా జిల్లాలో నక్సల్స్ కదలికలు ఎక్కువగా ఉండడంతో టేకులగూడ వద్ద భద్రతా బలగాలు స్థావరం ఏర్పాటు చేశాయి. తమ పరిధిలో పెట్రోలింగ్ చేస్తుండగా, జవాన్లపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. వెంటనే స్పందించిన డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, కోబ్రా బెటాలియన్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ జవాన్లు వెంటనే స్పందించి ఎదురు కాల్పులు జరిపారు. దాంతో నక్సల్స్ అక్కడ్నించి తప్పించుకుని అటవీప్రాంతంలోకి వెళ్లిపోయారు.

టేకులగూడ ప్రాంతం అటవీమయం కాగా, ఇక్కడ నక్సల్స్‌కు బాగా పట్టుందని భావిస్తారు. 2021లో ఇక్కడ జరిగిన కాల్పుల ఘటనలో 22 మంది జవాన్లు మరణించారు. ఈ నేపథ్యంలోనే టేకులగూడ వద్ద భద్రతా బలగాలు క్యాంపును ఏర్పాటు చేశాయి.

# ఆంధ్రాలో కాంగ్రెస్ తరపున ప్రచారానికి వస్తా

- తెలంగాణ మంత్రి కొండ సురేఖ స్పష్టం

**హైదరాబాద్, వెలుతురు:** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం తాను ప్రచారం చేస్తానని తెలంగాణ మంత్రి



కొండా సురేఖ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం తాను ప్రచారానికి వెళతానని చెప్పారు. ఏపీలో వైఎస్ షర్మిల సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా పుంజుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎంపీ సీట్లను గణనీయ స్థాయిలో గెలుచుకోవడంతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏపీలో కాంగ్రెస్ బలం పెంచుకోవడం ఖాయమన్నారు.

వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ ఏర్పాటుతో అడవులు కలుషితమవుతాయని బీఆరెస్ చేస్తున్న ఆరోపణలపై మంత్రి కొండా సురేఖ మండిపడ్డారు. 30 ఏళ్లుగా తమిళనాడులో నేవీ రాడార్‌ను కేంద్రం నడిపిస్తున్నదని, అక్కడ ఎలాంటి సమస్య లేదని చెప్పారు. బీఆరెస్ అధికారంలో ఉన్నప్పుడే నేవీ రాడార్ కోసం కేంద్రం అన్ని పర్మిషన్లు ఇచ్చిందని, కానీ అప్పటి సీఎం కేసీఆర్ తమకు బైసన్ పోలో గ్రౌండ్ ఇస్తేనే సంతకం పెడతానంటూ మెలిక పెట్టి ఆపారని గుర్తుచేశారు. రాడార్ స్టేషన్‌కు గత బీఆరెస్ ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందన్నారు. రాడార్ స్టేషన్‌కు రిజర్వ్ ఫారెస్ట్ భూములను కూడా గత ప్రభుత్వమే అప్పగించిందని గుర్తు చేశారు. 2014లో భూముల బదలాయింపుల లెక్క వేసి నోట్ పంపారని చెప్పారు. 2017లో అటవీ భూములపై గత ప్రభత్వమే జీవో జారీ చేసిందన్నారు. 2017లో కేంద్రం మరింత సమాచారం కోరిందని.. గత ప్రభుత్వమే దానికి కూడా వివరణ ఇచ్చిందన్నారు.

ఇప్పుడు తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాడార్ సెంటర్‌కు, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కొందరు కావాలని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు నష్టం జరిగే ప్రాజెక్టు కాదు కాబట్టే పరిశీలన చేసి తుది జీవో విడుదల చేశామని కొండా సురేఖ తేల్చిచెప్పారు.

# టిడిపిలోకి సత్యవేడు ఎమ్మెల్యే

- పార్టీలో చేరికపై నారా లోకేష్‌తో భేటీ

**హైదరాబాద్,వెలుతురు:** వైసీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హైదరాబాదులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ను కలిశారు. టీడీపీలో చేరే అంశంపై లోకేశ్ తో ఆయన చర్చిస్తున్నారు. ఈ సమావేశానికి ఆదిమూలం తన కుమారుడితో కలిసి వచ్చారు.

అధికార వైసీపీలో అసంతృప్తుల సంఖ్య నానాటికీ పెరిగి పోతోంది. సీఎం జగన్ నియోజకవర్గాల మార్పు చేపడు తుండడం చాలా మంది సిట్టింగ్ లకు నచ్చడం లేదు. దాంతో అసంతృప్తికి గురైన వారు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిస్థితి కూడా ఇందుకు మినహాయింపు కాదు.

కోనేటి ఆదిమూలంకు ఈసారి ఎమ్మెల్యే సీటు నిరాకరిం చిన వైసీపీ అధిష్ఠానం ఆయనకు తిరుపతి ఎంపీ టికెట్ ఇవ్వజూపింది. ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం మంత్రి పెద్దిరెడ్డి, ఆయన తన యుడు ఎంపీ మిథున్ రెడ్డిలపై తీవ్ర విమర్శలు చేశారు.

అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇప్పుడు నారా లోకేశ్



ను కలిసేందుకు కుమారుడితో కలిసి హైదరాబాదులో ప్రత్యక్షమయ్యారు.

# పాక్ మాజీ ప్రధానికి 10 ఏళ్ల జైలు

- సైఫర్ కేసులో స్పెషల్ కోర్టు తీర్పు
- ఇదే కేసులో పాక్ విదేశాంగ మంత్రికి కూడా పదేళ్ల జైలుశిక్ష
- గతంలో ఈ కేసును ఓ జోక్‌గా కొట్టిపారేసిన ఇమ్రాన్ ఖాన్

**లాహోర్, వెలుతురు:** పాకిస్థాన్‌లో మరో 9 రోజుల్లో సాధారణ ఎన్నికలు జరగనుండగా, నేడు అత్యంత ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. అధికార రహస్యాల వెల్లడి కేసులో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ప్రత్యేక న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసులో మాజీ విదేశాంగ మంత్రి షా మహ్మద్ ఖురేషీకి కూడా శిక్ష పడింది.

దీనిపై ఇమ్రాన్ ఖాన్ న్యాయవాది నయీం పంజుతా సోషల్ మీడియాలో స్పందించారు. ఈ తీర్పును తాము



అంగీకరించబోమని, ఇది అక్రమం అని పేర్కొన్నారు. ప్రభుత్వ రహస్యాలను లీక్ చేశారన్న అభియోగాలపై ఇమ్రాన్ ఖాన్ చాన్నాళ్లుగా విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ కేసు 'సైఫర్ కేసు'గా ప్రసిద్ధికెక్కింది. గతేడాది అమెరికాలోని పాక్ దౌత్య కార్యాలయంలో ఓ రహస్య కేబుల్ (సైఫర్)ను పాక్ ప్రభుత్వానికి పంపింది. ఈ కేబుల్ ను ఇమ్రాన్ ఖాన్ బహిర్గతం చేశారన్నది సైఫర్ కేసులో ప్రధాన అభియోగం. అధికార రహస్యాల చట్టం కింద ఈ కేసు విచారణ చేపట్టారు.

ఇమ్రాన్ ఖాన్, షా మహ్మద్ ఖురేషీ ప్రస్తుతం రావల్పిండిలోని అడియాలా జైల్లో ఉన్నారు. ఇది హై సెక్యూరిటీ కారాగారం.

కాగా, ఇమ్రాన్ ఖాన్ ఈ కేసు విచారణను ఓ జోక్ అని గతంలో కొట్టిపారేశారు. ప్రాసిక్యూషన్ బృందం, డిఫెన్స్ బృందం అందరూ ప్రభుత్వానికి చెందినవారే అయినప్పుడు తమకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.

లండన్‌లోని కొందరు వ్యక్తులు పక్కా ప్రణాళికతో ఈ తంతు నడిపించారని, ఈ కేసులో ఎలాంటి తీర్పు వస్తుందో తనకు ముందే తెలుసని ఇమ్రాన్ ఖాన్ అప్పట్లో వ్యాఖ్యానించారు. ఇది మ్యాచ్ ఫిక్సింగ్ వంటిదేనని విమర్శించారు. కాగా, నేడు స్పెషల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఇమ్రాన్ ఖాన్ న్యాయవాది ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేయనున్నట్టు తెలుస్తోంది.

# విభజన హామీలపై మోడీకి లేఖ

- సూటిగా ప్రశ్నించిన పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

**అమరావతి, వెలుతురు:** రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ పీసీసీ ఛీఫ్ గా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల కీలకమైన విభజన హామీలపై ఇప్పటికే అన్న వైఎస్ జగన్ ను టార్గెట్ చేస్తున్నారు. పాతికమంది ఎంపీల్ని ఇస్తే ప్రత్యేక హోదా తెస్తానన్న హామీ ఏమైందని, మిగతా హామీలపై కేంద్రం సైలెంట్ గా ఉంటున్నా ఎందుకు అడగటం లేదని సూటిగా నిలదీస్తున్నారు. ఇదే క్రమంలో ఇవాళ ప్రధాని మోడీకి షర్మిల లేఖ రాశారు. ఇందులో విభజన హామీల నుంచి వైజాగ్ స్టీల్ వరకూ ప్రతీ అంశాన్నీ ప్రస్తావించారు.

2014లో రాష్ట్ర విభజన చేసినప్పుడు తెలంగాణతో పోలిస్తే ఏపీ వెనుకబడిపోకూడదన్న ఉద్దేశంతో విభజన చట్టంలో పలు హామీలు ఇచ్చిందని వైఎస్ షర్మిల ప్రధాని మోడీకి గుర్తుచేశారు. ఏపీ వేగంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో ఇచ్చిన ఆ హామీలు పదేళ్లయినా ఇంకా నెరవేరలేదని, దీంతో రాష్ట్రం రాజధాని లేకుండా మిగిలిపోయిందన్నారు. అప్పట్లో ఎన్డీయే తొలిసారి అధికారం చేపట్టినప్పుడు ఈ హామీలతో పాటు మరికొన్ని కొత్త హామీలు కూడా ఇచ్చారని, కానీ పదేళ్లయినా ఇప్పటికీ అవేవీ నెరవేరలేదని షర్మిల ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రం దీనావస్థకు చేరుకుందని, ప్రజలు తీవ్ర గందరగోళంలో ఉన్నారని, కాబట్టి ఏపీపై దయ చూపాలని షర్మిల మోడీని కోరారు. ఈ పరిస్థితికి కేంద్రం వైఫల్యమే కారణమన్నారు. ఇది కేంద్రం విశ్వసనీయతను ప్రశ్నార్థకంగా మారుస్తోందని షర్మిల





తెలిపారు. ప్రత్యేక హోదాను స్వయంగా అప్పటి ప్రధాని హామీ ఇచ్చినా తర్వాత వచ్చిన మీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. దీంతో ఏపీ అభివృద్ధికి దూరంగా ఉండిపోయిందన్నారు. పోలవరం ప్రాజెక్టు కూడా ఈ కోవలోకే వస్తుందన్నారు. పోలవరం జాతీయ హోదాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పక్కనపెట్టేశాయన్నారు. ఈ సందర్భంగా గతంలో కేంద్రం రాష్ట్రానికి ఇచ్చి నెరవేరని హామీల జాబితాను కూడా షర్మిల మోడికి రాసిన లేఖలో ప్రస్తావించారు. వీటిని సాధ్యమైనంత త్వరగా నెరవేర్చాలన్నారు. అలాగే వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను కూడా ఆపాలని ప్రధాని మోడీని కోరారు.

వీటిపై పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ప్రసంగంలో వీటిపై నిర్దిష్టంగా ప్రస్తావించాలని షర్మిల విజ్ఞప్తి చేశారు.

# షర్మిలకు భద్రత పెంచాలి

- టిడిపి సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు
- ఎన్నికల వేళలో షర్మిల ప్రాణాలకే ప్రమాదం ఉందని వ్యాఖ్య
- సీఎం జగన్ ఎంతకైనా తెగిస్తాడని మండిపాటు

**విశాఖపట్నం,వెలుతురు:** సీఎం జగన్ పై టీడీపీ సీనియర్ నేత అయ్యన్న పాత్రుడు తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్‌కు తల్లి, చెల్లి, బాబాయ్ అనే తేడా లేదని ఆయన అన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆయన ఆస్తిలో షర్మిలకు వాటా రాశారని... ఆ వాటాను షర్మిలకు జగన్ ఇవ్వడం లేదని చెప్పారు. షర్మిలను అంతమొందించినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని... ఆమెకు భద్రత పెంచాలని డిమాండ్ చేశారు. విశాఖలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

తనకు కూడా జగన్ నుంచి ప్రాణహాని ఉందని... అందుకే తన రివాల్వర్ లైసెన్స్ ను రెన్యువల్ చేయాలని దరఖాస్తు చేశానని అయ్యన్న చెప్పారు. గన్ మెన్ ను పంపిస్తానని జిల్లా ఎస్పీ తనకు చెప్పారని... తాను వద్దని చెప్పానని తెలిపారు. తను ఎక్కడ ఉన్నానో గన్ మెన్లే సమాచారం ఇస్తారని చెప్పారు. తన కుమారుడు అనకా పల్లి స్థానానికి దరఖాస్తు చేశాడని... ఈ అంశాన్ని పార్టీ హైకమాండ్ పరిశీలిస్తోందని తెలిపారు.



నాలుగున్నరేళ్లలో ఉత్తరాంధ్రకు ఏం చేశారని విశాఖలో సిద్ధం సభను ఏర్పాటు చేశారని జగన్ ను అయ్యన్న ప్రశ్నించారు. ఇక్కడి ప్రజలు వైసీపీకి ఎందుకు ఓటు వేయాలని అడిగారు.

ఉత్తరాంధ్ర భూములను దోచుకున్నందుకు మీకు ఓటు వేయాలా అని ప్రశ్నిం చారు. మూడు నెలల తర్వాత తమ ప్రభుత్వం వస్తుం దని... అప్పుడు అందరి లెక్కలు తీస్తామని అన్నారు. ఎన్నికల తర్వాత జగన్ లండన్, అమెరికాలో దాక్కున్నా లాక్కొస్తామని... దోచుకున్న సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు.

విశాఖ బీచ్ నుంచి భీమిలి వరకు ప్రభుత్వ భూములన్నింటినీ స్వాహా చేశారని ఆరోపించారు.

# రాజ్యసభకు చిరంజీవి..!

- ఉత్తర ప్రదేశ్ నుండి ప్రాతినిధ్యం వహించేలా బిజెపి ప్లాన్

**అమరావతి, వెలుతురు:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవికి పద్మ విభూషణ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ ఆసక్తికర అంశం తెరపైకి వచ్చింది. చిరంజీవిని ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు పంపించాలన్నది బీజేపీ ప్రణాళిక అంటూ ప్రచారం జరుగుతోంది. త్వరలో 15 రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు జరగనుండగా, ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 10 రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. తెలంగాణ బీజేపీ నేత డాక్టర్ లక్ష్మణ్ యూపీ నుంచి రాజ్యసభకు వెళ్లారు. ఇప్పుడు చిరంజీవిని కూడా యూపీ కోటాలోనే రాజ్యసభకు పంపాలని కమలనాథులు భావిస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. అయితే, చిరంజీవి ఈ ప్రతిపాదనను ఎంతవరకు అంగీకరిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. చిరంజీవి గతంలో ప్రజారాజ్యం పార్టీ పెట్టి, ఏపీలో కొన్ని సీట్లు గెలిచి, ఆపై తన పార్టీని కాంగ్రెస్‌లో కలిపేశారు. యూపీఏ హయాంలో చిరంజీవి కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా పనిచేశారు. అప్పట్లో రాజకీయాల్లోకి వెళ్లిన కారణంగా 10 ఏళ్లు సినిమాలకు దూరమైన చిరంజీవి... మళ్లీ ఖైదీ నెం.150తో రీఎంట్రీ ఇచ్చారు. వరుస సినిమాలతో ఊపుమీదున్నారు. ఇప్పుడు మరోసారి రాజకీయాల్లోకి ఆయన వెళతారా? అన్నది చర్చనీయాంశంగా మారింది.



# భువనేశ్వరికి తప్పిన ముప్పు

- విమానం ల్యాండ్ అయ్యే ముందు ఆందోళనకర పరిస్థితి
- ల్యాండింగ్ గేర్ తెరుచుకోకపోవడంతో బయటికి రాని వీల్
- విమానాన్ని మళ్లీ గాల్లోకి తీసుకెళ్లిన పైలెట్
- వీల్ తెరుచుకోవడంతో సురక్షితంగా ల్యాండింగ్

**గన్నవరం, వెలుతురు:** టిడిపి అధినేత చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమం కోసం నేడు గన్నవరం చేరుకున్నారు. ఆమె ప్రయాణిస్తున్న ఇండిగో విమానం గన్నవరంలో దిగడానికి ముందు ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. హైదరాబాద్ నుంచి గన్నవరం వచ్చేందుకు నారా భువనేశ్వరి ఇండిగో విమానంలో ప్రయాణించారు. అయితే, ఆ విమానం గన్నవరంలో ల్యాండింగ్ కు ప్రయత్నించగా, వీల్ తెరుచుకోలేదు. దాంతో పైలెట్ ఆ విమానాన్ని మళ్లీ గాల్లోకి తీసుకెళ్లారు.

కొద్దిసేపు విమానం గాల్లోనే చక్కర్లు కొట్టడంతో ఏం జరుగుతోందో తెలియక ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. కాసేపటి తర్వాత ల్యాండింగ్ గేర్ తెరుచుకుని వీల్ బయటికి రావడంతో ఇండిగో విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. దాంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నారా భువనేశ్వరికి గన్నవరం ఎయిర్ పోర్టులో మాజీ మంత్రి దేవినేని




ఉమా తదితరులు స్వాగతం పలికారు. నారా భువనేశ్వరి నేడు రేపల్లె, పర్చూరు, ఒంగోలు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. చంద్రబాబు స్కిల్ కేసులో అరెస్ట్ అయిన అనంతరం మరణించిన టిడిపి కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, వారికి రూ.3 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించనున్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com